

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 276

మంగళవారం 20-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




విజేత వెర్‌స్టాపెన్

ఫార్ములా వన్ కెనడియన్ గ్రాండ్‌ప్రిలో దూసుకెళ్లిన రెడ్‌బుల్ డ్రైవర్ - 12లో



ఇండిగో రికార్డ్ ఆర్డర్

ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలు - 13లో



'రా' చీఫ్‌గా రవి సిన్హా

దేశం వెలుపల గూఢచర్య కార్యకలాపాలు నడిపే రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ చీఫ్‌గా ఐపీఎస్ అధికారి రవి సిన్హా నియమితులయ్యారు.

వివరాలు 6లో ▸



ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హతం

నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను కెనడాలోని సుర్రీ నగరంలో దుండగులు ఆదివారం రాత్రి కాల్చిచంపారు.

వివరాలు 6లో ▸



ప్రత్యేక అంశాలపై ఒప్పందం

అమెరికా, చైనా మధ్య కొన్ని 'ప్రత్యేకమైన' అంశాలపై ఒప్పందం కుదిరిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



గుజరాత్‌ను వీడని బిపర్‌జోయ్

బిపర్‌జోయ్ తుపాను వాయుగుండంగా మారడంతో గుజరాత్, రాజస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

వివరాలు 6లో ▸

వేగంగా ప్రాజెక్టులు

ప్రాధాన్యత ప్రాజెక్టుల పనులు చకచకా పూర్తి చేయాలి

- 15 రోజులకు ఒకసారి పురోగతిని సమీక్షించాలి
- నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రైతులకు ఫలాలను అందించాలి
- జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి జగన్ దిశానిర్దేశం
- గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్ పూర్తి
- ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను తరలించాలి
- వెలిగొండ సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు నీటి తరలింపు పనులు పూర్తి చేయాలి
- గొట్టా బ్యారేజ్ నుంచి హిరమండలం రిజర్వాయర్‌కు నీటి తరలింపుపై దృష్టి పెట్టాలి
- పూర్తి కావస్తున్న కుప్పం బ్రాంచ్ కెనాల్.. వేగం పెంచాలన్న సీఎం
- పోలవరం జలాశయం పూర్తయ్యే లోగా ఎడమ కాలువ సిద్ధమవ్వాలి
- సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు గైడ్ బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు



కేంద్రం ప్రదానం చేసిన జాతీయ జల అవార్డుతో సీఎం వైఎస్ జగన్, మంత్రి అంబటి, ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: ప్రాధాన్యతగా నిర్దేశించుకున్న సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రాధాన్యత ప్రాజెక్టుల పనుల ప్రగతిని సమీక్షిస్తూ గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రైతులకు ఫలాలను అందించాలన్నారు. పోలవరంతోపాటు ప్రాధాన్యతగా నిర్దేశించుకున్న వెలిగొండ, వంశధార ఫేజ్–2 స్టేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం, గాలేరు–నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్ తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి జగన్ సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల పనుల్లో ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ముఖ్యమంత్రికి నివేదించారు.

సీమ ప్రాజెక్టులను వరదనీటితో నింపేలా..

గాలేరు–నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్(సొరంగం)లో

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్

ఆత్రుతతో రామోజీ

వికృత రాతలు

- పారదర్శకంగా పంటల బీమా అమలుచేయడమే నేరమా?
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలుచేస్తున్న ఏకైక రాష్ట్రమిది
- దేశంలో ఎక్కడాలేని విధంగా రైతులపై పైసా భారంలేదు
- ఈ–పంట నమోదు రశీదుతోనే పంటల బీమాపై రైతులకు భరోసా
- దిగుబడి ఆధారిత పంటలకు రైతుల తరపున ప్రీమియం చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం
- వాతావరణ ఆధారిత బీమా కవరేజ్‌కు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే..
- జూలై 8న రైతు దినోత్సవం, వైఎస్సార్ జయంతి రోజున బీమా సొమ్ములు జమచేస్తామని స్వయంగా సీఎం జగనే జూన్ 1న చెప్పారు
- చెప్పిన తేదీకి సీఎం డబ్బులు జమ చేస్తే మావల్లే వేశారని డబ్బా కొట్టుకోడానికా ఈ రాతలు?

2 లో

అవినాశ్‌రెడ్డి బెయిలు రద్దుకు పిటిషన్

విచారణను 3కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

కౌంటర్లు దాఖలుకు అవినాశ్‌కు, సీబీఐకి నోటీసులు

3 లో

కదిలిన రుతుపవనాలు

- రాయలసీమ మొత్తం విస్తరణ.. కురుస్తున్న వర్షాలు
- వచ్చే 4 రోజుల్లో రాష్ట్రమంతటికీ విస్తరించే అవకాశం.. ఓ మోస్తరు వర్షాలు కురిసే చాన్స్
- చల్లబడుతున్న వాతావరణం



తిరుమలలో కమ్ముకున్న కారు మబ్బులు

సాక్షి, అమరావతి: ఎట్టకేలకు నైరుతి రుతుపవనాలు ముందుకు కదిలాయి. పది రోజుల క్రితమే అవి రాయలసీమను తాకినా బిపర్‌జోయ్ తుపాను ప్రభావంతో ముందుకు కదల్లేదు. శ్రీహరికోట ప్రాంతంలోనే కేంద్రీకృతమై ఉండిపోయాయి. తుపాను తీరం దాటడంతో ఆదివారం నుంచి అవి ముందుకు కదిలేందుకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. సోమవారం దాదాపు రాయలసీమ అంతటికీ విస్తరించాయి. దీంతో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు

మిగతా 2వ పేజీలో ▶

పెరగనున్న పెన్షన్ల భారం

- ఉద్యోగుల పెన్షన్లకు రూ.2,80,141.94 కోట్లు
- వచ్చే తొమ్మిదేళ్లలో 1,33,417 మంది రిటైర్
- రూ.20 వేల కోట్ల నుంచి రూ.41,803.40 కోట్లకు పెరగనున్న పెన్షన్ల వ్యయం
- వచ్చే ఏడాది 13,643 మంది ఉద్యోగ విరమణ

- వివరాలు 14లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత కప్పట్రాళ్ల బొజ్జమ్మ

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి/ఆలూరు(కర్నూలు): సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు కుమార్తె, కర్నూలు జిల్లా టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ కప్పట్రాళ్ల బొజ్జమ్మ(సుశీలమ్మ) వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బొజ్జమ్మతో పాటు ఆమె భర్త, మాజీ ఎంపీపీ డి.రామచంద్రనాయుడుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ,ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, దేవనకొండ జడ్పీటీసీ రామకృష్ణ, తెర్నెకల్ మాజీ సర్పంచ్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్రనాయుడుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ నేతలు

పార్టీ నడిపే సత్తా పవన్‌కు లేదు

ఒంటరిగా పోటీ చేస్తే కనీసం గౌరవమైనా దక్కుతుంది: మంత్రి అంబటి రాంబాబు

- బాబును గెలిపించేందుకే పుట్టానని చెప్పుకోవడం సిగ్గుచేటు
- నాడు బాబు 45 దేవాలయాలను కూల్చివేస్తే ఏమైపోయావ్?
- నిన్న ప్యాకేజీ స్టార్.. నేడు బూతుల స్టార్‌లా తయారయ్యావ్
- నీపై రష్యాలో తెరిచిన ఫైల్ సంగతి చూసుకో పవన్
- మోదీ, అమిత్‌షా కాళ్లు పట్టుకున్నా నిన్ను కాపాడలేరు

- వివరాలు 3లో

వైద్యవిద్యలో 'పల్లెబాట'

ఎంబీబీఎస్ విద్యార్థులకు 'ఫ్యామిలీ అడాప్షన్' ప్రోగ్రాం

ప్రతి విద్యార్థికి 5 కుటుంబాల ఆరోగ్య బాధ్యతలు

ఆయా కుటుంబాలపై 6వ సెమిస్టర్ నాటికి సమగ్ర నివేదిక ఇవ్వాలి

జాతీయ మెడికల్ కమిషన్ తాజా మార్గదర్శకాలు

నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్‌కు సంబంధించిన కొత్త కరిక్యులం

దేశవ్యాప్తంగా ఇకపై మెడిసిన్ చదవబోయే విద్యార్థులు తొలి ఏడాది నుంచే పల్లెబాట పట్టాల్సి ఉంటుంది. మెడిసిన్ అంటే కాలేజీలో పాఠాలు చదవడం, ల్యాబొరేటరీల్లో ప్రాక్టికల్స్ చేయడమే కాదు పల్లెల్లో ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయో కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటి ప్రకారం దేశవ్యాప్తంగా 80 వేలమంది వైద్యవిద్యార్థులు ఈ ఏడాది నుంచే పల్లెల్లో వైద్యసేవలు అందించాలి. – సాక్షి ప్రతినిధి, అనంతపురం

ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం అమలు

ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా అన్ని వైద్యకాలేజీల్లో ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం (కుటుంబ దత్తత కార్యక్రమం) అమలు చేయనున్నారు. తొలి ఏడాది చదివేటప్పటి నుంచే ఎంబీబీఎస్ విద్యార్థులు పల్లెబాట పట్టాలి. ఒక్కో ఎంబీబీఎస్ విద్యార్థి పల్లెల్లో ఐదు కుటుంబాలను ఎంచుకోవాలి. ఈ కుటుంబాల ఆరోగ్య బాధ్యతలు ఆ విద్యార్థే చూడాలి. ఆ కుటుంబ సభ్యుల జబ్బులను తెలుసుకోవడం, దానికనుగుణంగా చికిత్స, అవసరమైతే వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేయడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా కరిక్యులంలో పొందుపరిచారు. దీనికోసం ప్రతి వైద్యవిద్యార్థి ఒక లాగ్‌బుక్ తయారు చేయాలి. ఈ బుక్‌లో విద్యార్థి, మెడికల్ కాలేజీ పేరు ఉంటాయి. ఈ విద్యార్థులు సోషియల్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఎస్‌పీఎం), కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల పరిధిలో పనిచేస్తారు. ఈ విద్యార్థికి ఆశావర్కర్ సహాయకారిగా ఉంటారు. ఈ కుటుంబాల పర్యవేక్షణ నివేదికను 6వ సెమిస్టర్ పూర్తయ్యే సమయానికి ఇవ్వాలి.

క్షేత్రస్థాయి స్థితిగతులు తెలుసుకునే వీలు

జాతీయ మెడికల్ కమిషన్ ఇచ్చిన కొత్త కరిక్యులంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది. దీనివల్ల ప్రాంతాల వారీగా ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేయడం, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. వైద్యవిద్యార్థులకు దీనివల్ల ఉపయోగం ఉంటుంది.

– డాక్టర్ హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ



54 నెలలకు అకడమిక్ క్యాలెండర్ విడుదల

తాజాగా నాలుగున్నరేళ్లు.. అంటే 54 నెలల అకడమిక్ క్యాలెండరును ఎన్ఎంసీ విడుదల చేసింది. ఇందులో చాలా విషయాలను పొందుపరిచింది.

- మొదటి, రెండో సంవత్సరాలు 12 నెలల చొప్పున ఉంటాయి.
- మూడో సంవత్సరంలో పార్ట్ వన్ 12 నెలలు, పార్ట్‌టూ 18 నెలలుగా విభజించారు.
- ఏటా ఆగస్టులో విధిగా క్లాసులు మొదలై జూలై నాటికి పూర్తికావాలి.
- వైద్యవిద్యార్థులు చేరినరోజు నుంచి 53వ నెలలో ఫైనల్ ఎగ్జామ్స్ జరగాలి.
- బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ సబ్జెక్టులు ఇకపై ఒకే థియరీగా ఉంటాయి. థియరీకి 100 మార్కులు, ప్రాక్టికల్స్‌కు 50 మార్కులు చేశారు.
- ప్రతి విద్యార్థికి రీసెర్చ్ ల్యాబ్‌ను నాలుగు భాగాలుగా విభజించి రీసెర్చ్ ఉండేలా కరిక్యులం పొందుపరిచారు.

కరిక్యులంలో క్రీడలు, యోగా సబ్జెక్టులను తొలిసారిగా చేర్చారు.

ప్రతి సబ్జెక్టులో పాఠాలు చెప్పే లెక్చరర్లు ఎన్ని గంటలు విద్యార్థులకు బోధన సమయం కేటాయించాలో తెలియజేశారు.

- కొత్తగా ఆటిట్యూడ్ (వైఖరి), ఎథిక్స్ (నీతి), కమ్యూనికేషన్ (సమాచార) నైపుణ్యాలు విధిగా ఉండాలని సూచించారు.
- ప్రతి విద్యార్థికి థియరీలో 75 శాతం, ప్రాక్టికల్స్‌లో 80 శాతం హాజరు ఉండాలి.
- ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాంలోను 80 శాతం హాజరు ఉండాలి.

బాలుడి హత్యపై బాబు నీచ రాజకీయం

- రెండు కుటుంబాల వివాదాన్ని రాజకీయం చేసే ప్రయత్నం
- ఘటన జరిగిన వెంటనే స్పందించిన ప్రభుత్వం
- గంటల వ్యవధిలోనే ముగ్గురి అరెస్టు.. కోర్టులో హాజరు
- పోలీసుల అదుపులో మరో వ్యక్తి.. అయినా పోలీసులు స్పందించ లేదంటూ నిందలు
- విషయం తెలియగానే బాధితుల వద్దకు ఎంపీ మోపిదేవి.. ఆయన ఇచ్చిన సాయం బాధిత కుటుంబానికి అందకుండా అడ్డుకున్న టీడీపీ
- మరునాడు ప్రభుత్వ సాయం రూ.10 లక్షలు ఇచ్చిన మంత్రి, ఎంపీ
- అయినా కులాల మధ్య చిచ్చు రగిల్చేలా బాబు ప్రయత్నం

3 లో

స్కూళ్లకు మినిస్టీరియల్ సిబ్బంది

- నాడు–నేడు పూర్తయిన పాఠశాలల్లో త్వరలో కంప్యూటర్ ఆపరేటర్లు
- టీచర్లకు బోధన తప్ప ఇతర విధులు ఉండవు.. త్వరలో మున్సిపల్ టీచర్ల బదిలీ
- మంత్రి బొత్స వెల్లడి

14 లో

క్లుప్తంగా...

అమృత్ సరోవర్‌ల వద్ద యోగా దినోత్సవం

రేపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్



సాక్షి, అమరావతి: వర్షపునీటిని పెద్ద ఎత్తున నిల్వ చేసే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ కార్యక్రమంలో నిర్మాణం జరిగిన చెరువుల వద్ద కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి సోమవారం అన్ని జిల్లాల డ్వామా పీడీలకు ఆదేశాలు జారీ చేశారు. అమృత్ సరోవర్‌ల వద్ద ఉపాధి కూలీలు, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి ఈ కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు.

■ తెలంగాణ

ఈ నెల 29న బక్రీద్ పండుగ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 29న దేశవ్యాప్తంగా బక్రీద్ (ఈద్-ఉజ్-జుహా) పండుగ జరుపుకోవాలని రుహియ్యతే హిలాల్ (నెలవంక నిర్ధారణ కమిటీ) ప్రతినిధి ముఫ్తీ సయ్యద్ ఖలీల్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం హైదరాబాద్ మొజంజాహీ మార్కెట్‌లోని సంస్థ కార్యాలయంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారని తెలిపారు. నెలవంక కనబడిందని.. ఈ నేపథ్యంలో నెలవంక కనిపించిన పదో రోజు బక్రీద్ పండుగ జరుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 28వ తేదీన అరఫాత్ రోజు అని, ఆ రోజు ఉపవాసం పాటించాలని ఆదేశించారు. బక్రీద్ సామూహిక నమాజ్ కోసం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధీనంలో కొనసాగుతున్న ఈద్గాలు, మసీదుల్లో ఏర్పాట్లు చేయాలని కోరారు. వీటితో పాటు ఇతర మసీదుల వద్ద కూడా ఈద్ నమాజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాత్కాలిక షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేస్తే, వర్షం వచ్చినా నమాజ్ కోసం వచ్చే వారికి ఇబ్బందులు ఉండవన్నారు.

కదిలిన రుతుపవనాలు

▶ మొదటి పేజీ తరువాయి

కురుస్తున్నాయి. అరేబియా సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారానికి కోస్తాంధ్రలోని పలు ప్రాంతాలు, తెలంగాణకు విస్తరించే అవకాశం ఉంది. మరో నాలుగు రోజుల్లో రాష్ట్రమంతటికీ విస్తరించి వర్షాలు కురిసే పరిస్థితి నెలకొంది. ఉపరితల ఆవర్తనం ఇలాగే కొనసాగితే ఇంకా ముందుగానే రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

రుతుపవనాల ప్రభావంతో కొద్దిరోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించింది. కొన్ని ప్రాంతాలు మినహా చాలా చోట్ల వాతావరణం చల్లబడింది. గ్రేటర్ రాయలసీమ జిల్లాలన్నీ చల్లబడగా కోస్తా జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. కృష్ణా, గుంటూరు బెల్ట్‌లోనే సోమవారం ఎండ తీవ్రత కనిపించింది. గత పది రోజులుగా 600కి పైగా కేంద్రాల్లో 40 నుంచి 46 డిగ్రీలు వరకు నమోదైన ఉష్ణోగ్రతలు సోమవారం 120 కేంద్రాల్లోనే నమోదయ్యాయి. రుతుపవనాల ప్రభావంతో ఏర్పడిన మేఘాలు బలంగా కదులుతుండడంతో మంగళవారానికల్లా రాష్ట్రం మొత్తం చల్లబడి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

ఆత్రుతతో రామోజీ వికృత రాతలు

సాక్షి, అమరావతి : రాక్షస ఆలోచనలతో నిండిపోయిన రామోజీ మెదడుకు వాస్తవాలు బయటికొస్తాయనే భయం ఏకోశానా లేదు. రైతులపై పైసా భారం పడకుండా నోటిఫై చేసిన పంటలకు సంబంధించి సాగుచేసిన ప్రతీ ఎకరాకు ఈ–క్రాప్ ఆధారంగా బీమా కవరేజీను కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే ఆ పండు **ముసలి** ప్రాణం కడుపుమంటతో రగిలిపోతో**ంది.** యూనివర్సల్ కవరేజ్ విషయంలో ఏపీని స్ఫూర్తిగా కేంద్రం కూడా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంతో కలిసి ఫసల్ బీమాను అమలుచేస్తోంది. **పలు** రాష్ట్రాలు కూడా ఈ విషయంలో ఏపీ బాటపట్టాయి. కానీ, క్షుద్ర రాతలతో అబద్ధాలను అడ్డగోలుగా అచ్చేసే రామోజీకి ఇవన్నీ తెలిసినా కణకణాన ఓర్వలేనితనం ఆయన్ను రోజురోజుకీ దిగజారుస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 44.66 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల పరిహారం అందించింది. కానీ, ఇవన్నీ చూసి తట్టుకోలేకపోతున్న రామోజీ నిత్యం ఈ పథకంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. రైతులను గందరగోళ పర్చేలా 'ఏది బీమా?' అంటూ తాజాగా ఈనాడు ఎంతో ఆత్రుతతో మరో అబద్ధాల సంకలనాన్ని అచ్చేసింది. నిజానికి.. ఖరీఫ్–21 సీజన్‌కు సంబంధించి 15.61 లక్షల మందికి రూ.2,977.82 కోట్ల పరిహారం అందించిన రాష్ట్ర ప్రభుత్వం.. పరిహారం ఇంకా అందని వారెవరైనా మిగిలి ఉన్నారేమోనని దరఖాస్తులను ఆహ్వానించింది. అర్హులను గుర్తించి ఈ నెల 14న మరో 9 వేల మందికి రూ.90 కోట్ల పరిహారం జమచేసి రైతులపట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. కానీ, ఇవేమీ పట్టించుకోని ఈనాడు విషం కక్కడమే పనిగా పెట్టుకుంది. ఫిల్మ్‌సిటీ **కోట**లో కాలుజాపుకుని ఇంకెన్నాళ్లు ఈ **ఎల్లో** జర్నలిజం చేస్తారు? మీ కథల్ని ప్రజలు నమ్మే రోజులు పోయాయని తెలుసా? 'ఏది బీమా?'పై ఇదీ నిజం.. చదవండి రామోజీ..

పారదర్శకంగా పంటల బీమా అమలు చేయడమే నేరమా?



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

ఆరోపణ: బీమా హుళక్కేనా?

వాస్తవం: ఈ–పంట నమోదు జరిగిన వెంటనే రైతుల మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ రూపంలో మెస్సేజ్‌లు పంపడమే కాదు.. ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తికాగానే ప్రతీ రైతుకు భౌతిక రశీదులు అందించారు. వీటి ప్రామాణికంగానే పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు వ్యవసాయ రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి ఇతర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. సాగు చేసిన పంటలలో నోటిఫై చేసిన పంటలకు బీమా రక్షణ కల్పిస్తున్నారు. ఈ వివరాలన్నీ ఆ రశీదుల్లో స్పష్టంగా పొందుపరుస్తున్నారు. ఈ విషయంలో రైతుల్లో ఎలాంటి గందరగోళంలేదు. ఈనాడుకు తప్ప.

ఆరోపణ: ఆ పంటలకు బీమా కవరేజ్ ఏదీ?

వాస్తవం: నాసిరకం విత్తనాలవల్ల పంటలు దెబ్బతిన్నా, ఆశించిన దిగుబడులు రాకపోయినా, వాతావరణం వల్ల పంటలు దెబ్బతిన్నా నోటిఫై పంటలకు బీమా పరిహారం అందిస్తారు. పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలన్నీ నోటిఫైడ్ పంటలే. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రీమియం చెల్లించిన రైతులకు మాత్రమే కవరేజ్ ఉండేది. అధికారులు, బీమా కంపెనీల చుట్టూ చెప్పులరిగేలా తిరిగితే కానీ పరిహారం సొమ్ములు దక్కేవి కావు. అది కూడా అరకొరగానే. కానీ, నేడు రైతులపై పైసా భారం పడకుండా నాలుగేళ్లుగా పంటల బీమా పరిహారం ఇస్తున్నారు.

ఆరోపణ : అన్నదాతను ఆదుకోవడంలో అలసత్వమేలా?

వాస్తవం: పంటల పరిహారం చెల్లింపులో ఈనాడు చెబుతున్నట్లుగా ఎలాంటి గందరగోళంలేదు. యూనివర్సల్ కవరేజ్ విషయంలో కేంద్రం దిగిరావడంతో ఖరీఫ్–22 సీజన్‌కు సంబంధించి దిగుబడి ఆధారిత పంటలకు పీఎంఎఫ్‌బీవై–డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేస్తుండగా వాతావరణ ఆధారిత పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా వైఎస్సార్ ఉచిత బీమా పథకం కింద కవరేజ్ కల్పిస్తోంది. నోటిఫై చేసిన దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు రైతుల వాటాను కూడా ప్రభుత్వం చెల్లించింది. మే నెల వరకు వాతావరణ ఆధారిత పంటల బీమా కవరేజీ కొన్ని పంటలకు మిగిలి వున్నందువలన బీమా పరిహారం లెక్కింపు తదనుగుణంగా పూర్తికావస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు వారాలైనా ఖరీఫ్–2022 సీజన్‌కు సంబంధించి పంటల బీమా పరిహారం చెల్లింపుపై రైతులకు ఎలాంటి సమాచారం లేదనడంలో వాస్తవంలేదు. ఈ విషయంలో ప్రభుత్వం అసలు కసరత్తు చేయడం లేదని ఆరోపించడం హాస్యాస్పదం.

ఆరోపణ: ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

వాస్తవం: జూలై 8న ఖరీఫ్–22 సీజన్‌కు సంబంధించిన పంటల బీమా పరిహారాన్ని జమచేస్తామని సీఎం జగన్ స్వయంగా రైతుభరోసా ఇచ్చిన జూన్ 1నే ప్రకటించారు. ఎందుకంటే జూలై 8న రైతు దినోత్సవంతో పాటు వైఎస్సార్ జయంతి కూడా. కనుక ఇది ఇస్తారన్న సంగతి అందరికీ తెలుసు. అయినా, ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పినప్పటికీ దానిని ఏమాత్రం పట్టించుకోకుండా ఇంకా ఇవ్వలేదని రాయడం సబబేనా? ఇక.. ముందే చెప్పినట్లుగా ఆ తేదీకి సీఎం ఇచ్చేస్తే మేం చెప్పాం కాబట్టే ఇచ్చారని డబ్బా కొట్టుకునేందుకేనా ఈ రాతలు? మరోవైపు.. పంటల బీమాకు అర్హుల జాబితా మదింపు జరుగుతోంది. ఈ నెలాఖరులోగా జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరించి వాటిని జూలై మొదటి వారంలో పరిష్కరిస్తారు. ఆ వెంటనే తుది జాబితాలను ఆర్బీకేల ద్వారా ప్రదర్శిస్తారు.

ఆరోపణ: అమ్మఒడి కోసం జాప్యం చేస్తున్నారు..

వాస్తవం: 2016 నుంచి పీఎంఎఫ్‌బీవై అమలవుతోంది. అంతకుముందు వ్యవసాయ బీమా పథకం కింద బీమా కవరేజ్ కల్పించేవారు. గడిచిన సీజన్‌కు సంబంధించి చెల్లించాల్సిన బీమా పరిహారాన్ని గతంలో ఆగస్టు నెలాఖరులోపు ఇచ్చిన దాఖలాలే లేవు. పలు సీజన్‌లలో సెప్టెంబర్‌లో కూడా ఇచ్చారు. అది కూడా కంపెనీల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తేకానీ **పరిహారం దక్కేది కాదు. కానీ, ఈ ప్రభుత్వం వచ్చిన**ప్పటి నుంచి గడిచిన సీజన్‌కు సంబంధించిన పరిహారాన్ని మరుసటి ఏడాది ఆ సీజన్ ప్రారంభమయ్యేలోగా అర్హుల జాబితాలను ప్రకటించి జూన్–జూలైలో పరిహారం అందిస్తున్నారు. ఈ వాస్తవాలను విస్మరించి అమ్మఒడి కార్యక్రమం ఉన్నందున పంటల బీమా పరిహారం జూలై లేదా ఆగస్టులో ఇచ్చే అవకాశం ఉందంటూ చేతికొచ్చినట్లు రాయడం ఈనాడుకే చెల్లింది.

ఆరోపణ : ఈకేవైసీ అంటూ కొత్త మెలిక పెట్టారు..

వాస్తవం: మొదట్లో ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకుంటే చాలని, ఆ తరువాత ఈ–కేవైసీ చేయించుకుంటేనే పరిహారం ఇస్తామని మెలిక పెట్టిందనడంలో కూడా వాస్తవంలేదు. నోటిఫై చేసిన పంటలకు బీమా వర్తింపజేసేందుకు జారీచేసిన నోటిఫికేషన్‌లో రైతు తన ఆధార్ బయోమెట్రిక్ ధ్రువీకరణ చెయ్యాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పత్రికాముఖంగా రైతులకు విజ్ఞప్తి చేయడమే కాదు.. ఆర్బీకేల ద్వారా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని రైతులకు వివరించారు. చెల్లించాల్సిన క్లెయిమ్స్‌ను ఆధార్ ఆధారిత నగదు బదిలీ ద్వారా నేరుగా రైతు ఖాతాలకు జమచేస్తున్నందున ఈ–కేవైసీని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ వాస్తవాలను కప్పిపుచ్చి రైతులను గందరగోళ పరిచేలా తప్పుడు వార్తలు రాయడం, విషం కక్కడం ఈనాడుకు నిత్య కృత్యమైపోయింది.

నేడు 'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం

- విజయవాడలో అవార్డులు ప్రదానం చేయనున్న సీఎం జగన్
- పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన 42 మంది
- ఇంటర్‌లో సత్తాచాటిన 26 మంది
- నగదు పురస్కారంతో పాటు సర్టిఫికేట్, మెడల్ ప్రదానం
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు 22,710 మంది

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ : గత ప్రభుత్వంలో పెత్తందార్ల చేతిలో బందీ అయిన విద్యావ్యవస్థలో ప్రస్తుత ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చింది. లక్షల్లో డబ్బు గుంజే కార్పొరేట్ స్కూళ్ల కన్నా మిన్నగా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చి, డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, మెరుగైన విద్యనందిస్తోంది. ప్రతి పేద కుటుంబం నుంచి ఒక డాక్టర్, ఒక ఇంజనీర్, ఒక కలెక్టర్, ఒక సైంటిస్ట్, ఒక ఎంటర్‌ప్రెన్యూర్, ఒక లీడర్ వంటి ఆణిముత్యాలు రావాలన్న తపన, తాపత్రయంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ నాలుగేళ్లలో కేవలం విద్యా రంగ సంస్కరణలపైనే ప్రభుత్వం అక్షరాలా రూ.60,329 కోట్లు ఖర్చు చేసింది. కాగా, ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా సంస్థల్లో చదువుతూ.. రాష్ట్ర స్థాయిలో పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన 42 మంది, ఇంటర్మీడియట్ గ్రూపుల వారీగా టాపర్స్‌గా సత్తా చాటిన 26 మంది విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులను ప్రదానం చేయనున్నారు. విజయవాడ ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగే వేడుకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను సత్కరించనున్నారు. వీరితో పాటు ఉన్నత విద్యలో ఐదు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు 'స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు'ను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమ వేదిక ఏర్పాట్లను సోమవారం విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు పరిశీలించారు.

22,710 మంది విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని వివిధ కేటగిరీ విద్యాసంస్థల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థులను ఎంపిక చేసింది. పదో తరగతిలో కేటగిరీ వారీగా (జెడ్పీ, మున్సిపల్, మోడల్, ట్రైబల్/ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ తదితర) రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిలో ప్రతి స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ/ఎంఈసీ, హెచ్ఈసీ(నాలుగు) గ్రూపుల్లో ప్రతి గ్రూపులోను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మొత్తం 22,710 మంది విద్యార్థులకు ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రోత్సాహం అందించనుంది. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో తొలి 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12 నుంచి 19 వరకు ఇప్పటికే నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించింది. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను, సంబంధిత విద్యాసంస్థలకు మొమెంటోతో పాటు ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లను ప్రభుత్వం సన్మానించింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలిలా..

పదో తరగతి విద్యార్థులకు..

- రాష్ట్రస్థాయి నగదు పురస్కారం: ప్రథమ స్థానం– రూ.1,00,000, ద్వితీయ స్థానం– రూ.75,000, తృతీయ స్థానం– రూ.50,000 విద్యార్థులు 42 మంది.
- జిల్లా స్థాయి నగదు పురస్కారం: ప్రథమ– రూ.50,000, ద్వితీయ– రూ.30,000, తృతీయ– రూ.15,000 విద్యార్థులు 609 మంది.
- నియోజకవర్గ స్థాయి నగదు పురస్కారం: ప్రథమ– రూ.15,000, ద్వితీయ– రూ.10,000, తృతీయ–రూ.5,000. విద్యార్థులు 681 మంది.
- పాఠశాల స్థాయి నగదు పురస్కారం: ప్రథమ– రూ.3,000, ద్వితీయ–రూ.2,000, తృతీయ– రూ.1,000–విద్యార్థులు 20,299 మంది.

ఇంటర్ విద్యార్థులకు..

- రాష్ట్ర స్థాయి గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.1,00,000 చొప్పున 26 మంది విద్యార్థులకు ప్రదానం
- జిల్లా స్థాయిలో గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.50,000 చొప్పున 391 మంది విద్యార్థులకు ప్రదానం
- నియోజకవర్గ స్థాయిలో గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.15,000 చొప్పున 662 మందికి ప్రదానం
- మొత్తం విద్యార్థుల సంఖ్య: 22,710
- ర్యాంకర్లకు సమాన మార్కులతో ఎంతమంది ఉన్నా అందరినీ సత్కరించనున్నారు. ప్రతి ఒక్క విద్యార్థికీ నగదుతో పాటు సర్టిఫికేట్, మెడల్ అందజేస్తారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

బుట్టాయగూడెం: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని నాడు ఇచ్చిన మాటను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నాయకులు సీబీ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆ ఉద్యోగుల కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయని తెలిపారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎం. లక్ష్మి, సీహెచ్ సుబ్బలక్ష్మి, జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వి.ఆంజనేయులు, కె.శ్రీరామ్మూర్తి, బి.బంగారుబాబు, డీఈ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ తెలంగాణ

అక్టోబర్‌లో తెలంగాణ అసెంబ్లీ షెడ్యూల్!

- ఆ నెల 5–15 తేదీల మధ్య విడుదల కావొచ్చని రెవెన్యూ వర్గాల అంచనా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల కోసం రెవెన్యూ శాఖ సమాయత్తం అవుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 5–15 తేదీల మధ్యలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, అందుకు తగినట్టుగా కార్యాచరణ మొదలైందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వో), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వో)లతోపాటు క్షేత్రస్థాయిలో ఎంతమంది సిబ్బంది అవసరమనే దానిపై కసరత్తు జరుగుతోందని తెలిపాయి. ఆర్వోలుగా డిప్యూటీ కలెక్టర్లు (ఆర్డీవో), జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లతోపాటు ఈసారి జిల్లాల అదనపు కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించాయి. ఈ మేరకు 74 మంది డిప్యూటీ కలెక్టర్లు (ఇటీవలే పదోన్నతి పొందిన వారితో కలిపి), 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనికి వచ్చే అన్ని మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉండటంతో, ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2018లో 5 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో భాగంగా.. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 12, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో నవంబర్ 28న, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఈసారి కూడా ఐదు రాష్ట్రాల పోలింగ్ ప్రక్రియ డిసెంబర్ 5–9 తేదీల మధ్య ముగిసే అవకాశాలు ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా అక్టోబర్ రెండో వారంలోనే షెడ్యూల్ రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

వేగంగా ప్రాజెక్టులు

▶ మొదటి పేజీ తరువాయి

ఫాల్ట్ జోన్ (మట్టి పొరలు పెలుసుగా ఉన్న ప్రాంతం)లో పాలీయురిథేన్ ఫోమ్ గ్రౌటింగ్ పద్ధతిలో పనులు పూర్తి చేసినట్లు అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. నాన్ ఫాల్ట్ జోన్‌లో మరో 149 మీటర్ల లైనింగ్ పనులు మాత్రమే మిగిలాయని, వాటిని జూలై లోగా పూర్తి చేసి ఆగస్టులో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత డిజైన్ మేరకు పూర్తి సామర్థ్యం ప్రకారం గాలేరు–నగరి ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించి దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. శ్రీశైలానికి వరద వచ్చే 30 – 40 రోజుల్లోనే నీటిని ఒడిసిపట్టి రాయలసీమ ప్రాజెక్టులను నింపేలా కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- వెలిగొండలో మొదటి టన్నెల్, హెడ్ రెగ్యులేటర్ ఇప్పటికే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రెండో టన్నెల్‌లో 18,787 మీటర్లకుగానూ ఇప్పటికే 17,461 మీటర్ల పనులు పూర్తయ్యాయి. మరో 1,326మీటర్ల పనులు మిగిలినట్లు వివరించారు. రెండో టన్నెల్ అక్టోబర్‌కు పూర్తవుతుందన్నారు. రెండో టన్నెల్ హెడ్ రెగ్యులేటర్ పనులు 92.14 శాతం పూర్తయినట్లు చెప్పారు. ఆగస్టు నాటికి రెండో టన్నెల్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌లో గొట్టిపడియ, కాకర్ల డ్యామ్, తీగలేరు అప్రోచ్ కెనాల్, హెడ్ రెగ్యులేటర్‌తోపాటు ఈస్టర్న్ మెయిన్ కెనాల్, హెడ్ రెగ్యులేటర్ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వెలిగొండ సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌లోకి నీటిని తరలించేందుకు వీలుగా మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.
- వంశధార ఫేజ్–2 స్టేజ్–2 ప్రాజెక్టు పనులను డిస్ట్రిబ్యూటరీలతో సహా ఈ ఏడాదే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజ్ జల విస్తరణప్రాంతం నుంచి వంశధార జలాలను ఎత్తిపోసి స్టేజ్–2లో అంతర్భాగమైన హిరమండలం రిజర్వాయర్‌ను నింపే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.
- తోటపల్లి బ్యారేజీలో మిగిలిన పనులు, తారకరామ తీర్థసాగరం, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ తదితర ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం సమీక్షించారు. ఆ ప్రాజెక్టుల పనులన్నీ వేగంగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.



జలవనరుల శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సకాలంలో ఆయకట్టుకు నీటి విడుదల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా క్యాలెండర్ ప్రకారం నీటి లభ్యత ఆధారంగా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు సమీక్షలో అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, తోటపల్లి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేశామన్నారు. మిగతా ప్రాజెక్టుల కింద నీటి లభ్యత ఆధారంగా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాకు అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు పుష్కలంగా నీటిని అందించాలని సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు.

శరవేగంగా పోలవరం..

- పోలవరం పనుల ప్రగతిపై సీఎం జగన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. గోదావరి వరదల ఉధృతికి కోతకు గురైన ఈసీఆర్ఎఫ్(ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్)–1 నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను ఇప్పటికే ఇసుకతో నింపి వైబ్రో కాంపాక్షన్‌తో యథాస్థితికి తెచ్చే పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.
- ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో అగాధాలను ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులు చురుగ్గా సాగుతున్నట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తయ్యాక గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానం చేస్తామన్నారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టి జలాశయాన్ని పూర్తి చేస్తామన్నారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ పోలవరం జలాశయం నిర్మాణం పూర్తయ్యేలోగా ఎడమ కాలువ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.
- గైడ్ బండ్‌లో జారిన ప్రాంతాన్ని కేంద్ర జల్ శక్తి శాఖ నియమించిన నిపుణుల కమిటీ, కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అధికారులు ఈనెల 15, 16వ తేదీల్లో పరిశీలించిన అంశాన్ని అధికారులు సీఎం జగన్ దృష్టికి తెచ్చారు. నేల స్వభావంలో మార్పుల వల్లే గైడ్ బండ్‌లో కొంత ప్రాంతం జారి ఉండవచ్చని నిపుణుల కమిటీ అనుమానాలు వ్యక్తం చేసిందన్నారు. గైడ్ బండ్‌లో దెబ్బతిన్న ప్రాంతాన్ని రాక్ డంప్, సిమెంట్ స్లర్రీతో నింపి గాబియన్‌లు వేయడం ద్వారా తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని కమిటీ సూచించిందన్నారు. ఆ మేరకు పనులు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. గైడ్ బండ్‌ను పూర్తిగా విశ్లేషించాక శాశ్వత మరమ్మతులపై కమిటీ సూచనలు చేయనుంది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు గైడ్ బండ్‌ను పటిష్టం చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.
- పోలవరం తొలిదశ పూర్తి చేసేందుకు రూ.12,911.15 కోట్లు ఇవ్వాలని కేంద్ర ఆర్థికశాఖ నిర్ణయం తీసుకోగా కేబినెట్ నోట్ తయారీపై వివిధ శాఖల మధ్య సంప్రదింపులు కొలిక్కి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం జగన్ సూచించారు.
- పోలవరం పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను కేంద్రం రీయింబర్స్ చేయడంలో జాప్యం చేస్తుండటం వల్ల ఖజానాపై భారం పడుతోందని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు ముందుగా నిధులు విడుదల చేసిన తరహాలోనే పోలవరానికి కూడా ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.
- పోలవరంలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వచ్చే ముంపు గ్రామాల్లో 20,946 నిర్వాసిత కుటుంబాలకుగానూ ఇప్పటికే 12,658 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మిగిలిన 8,288 కుటుంబాలకు కూడా పునరావాసం కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు దాదాపు పూర్తి కావచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.
- సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య పలు ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

అంబటి, అధికారులకు సీఎం అభినందనలు

నాలుగో జాతీయ జల అవార్డుల్లో (నేషనల్ వాటర్ అవార్డ్స్–2022) ఆంధ్రప్రదేశ్ నాలుగు అవార్డులను దక్కించుకోవడంపై మంత్రి అంబటి రాంబాబు, అధికారులను ముఖ్యమంత్రి జగన్ అభినందించారు. జల వనరుల సంరక్షణ, నీటి నిర్వహణకుగాను ఉత్తమ రాష్ట్రాల విభాగంలో ఆంధ్రప్రదేశ్ తృతీయ స్థానంలో నిలిచింది. శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ చేతుల మీదుగా అందుకున్న అవార్డును జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సీఎం జగన్‌కు చూపారు.

క్లుప్తంగా...

చందాలతోనైనా పార్టీని నడిపిస్తా

- పారిపోను.. నన్ను నమ్మండి
- ఎంపీలు పార్లమెంటులో ఏమీ మాట్లాడరు
- కేవలం టిఫిన్లు తిని వచ్చేస్తున్నారు
- కాకినాడలో పవన్ వ్యాఖ్యలు



సాక్షిప్రతినిధి, కాకినాడ: పార్టీ నడపడం కష్టంగా ఉంటే నలుగురినీ చందాలు అడిగి నడిపిస్తాను తప్ప పారిపోనని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. తనను నమ్మాలని కోరారు. అధికారంలోకి వస్తామో రామో తెలియదని, గెలుపు ఓటములు ఎన్నికల ప్రక్రియకే పరిమితమని అన్నారు. అధికారమే అంతిమ లక్ష్యం అనుకుంటే ఇంత కష్టపడక్కర్లేదని, తనకున్న ఇమేజ్‌కు పదవి వస్తుందని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా సోమవారం కాకినాడ జగన్నాథపురం ఏటిమొగలో మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. అంతకుముందు కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన వివిధ రంగాల వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఓఎన్‌జీసీ పరిహారం కాకినాడ రేవులోని మత్స్యకారులకు కూడా ఇవ్వాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ తొండంగిలో దివీస్‌ను సముద్రంలో కలిపివేస్తానని చెప్పి, ఇప్పుడు దివిస్‌కు తోడు అరబిందో కూడా తీసుకువచ్చారన్నారు. సత్యలింగ నాయకర్ ఆస్తులు ఆన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. బాధ్యత లేని పాలకుల వల్ల వ్యవస్థ గాడి తప్పుతోందని అన్నారు. పాలకులు బాధ్యతగా వ్యవహరించనప్పుడు యంత్రాంగం సక్రమంగా పని చేయదని చెప్పారు. ప్రతి వర్గానికి జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన తేవడానికే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలకు రాజకీయ వ్యవస్థలే కారణమన్నారు. కోస్తా రైలు మార్గంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, ప్రధాని దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు. ఎంపీలు పార్లమెంటుకు వెళ్లి ప్రజల అవసరాలపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని, కేవలం టిఫిన్లు తినేసి వచ్చేస్తారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశాల్లో పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరులున్నారు.

నువ్వే గెలవలేవు.. ద్వారంపూడిని ఓడిస్తావా?

పవన్‌పై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజం



రామచంద్రపురం: సొంతంగా ఒక్కచోట కూడా ఎమ్మెల్యేగా గెలవలేని పవన్ కళ్యాణ్ కాకినాడలో సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఓడిస్తానంటూ ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ పార్టీ అధినేతగా ఉన్న పవన్ తన పార్టీ విధానాలను ప్రజలకు వివరించడం మాని, వ్యక్తిగత దూషణలకు మాత్రమే పరిమితం కావడం.. ఆయన రాజకీయ అవగాహన లేమిని తేటతెల్లం చేస్తోందని విమర్శించారు. నోరు విప్పితే కులాల గురించి మాట్లాడే పవన్.. సోషల్ ఇంజినీరింగ్ చేస్తానని చెప్పడంపై మండిపడ్డారు. మహిళల గురించి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదని దుయ్యబట్టారు. దేశం యావత్తూ మన రాష్ట్రం వైపు చూసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ ఇంజినీరింగ్ చేసి చూపించారన్నారు. గతంలో చంద్రబాబు.. వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేసే దురుద్దేశంతో ఫ్యాక్షనిస్టు అని, లక్ష కోట్లు అని ఎన్నో అబద్ధాలు ప్రచారం చేశారని, అయినా ప్రజలు వాస్తవాలు గుర్తించి 151 సీట్లు ఇచ్చి ఆశీర్వదించారని గుర్తు చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లో ముఖ్యమంత్రిపై పవన్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి 175కు 175 సీట్లు ఇచ్చి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడతారని అన్నారు.

సునీత పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య తదనంతర పరిణామాలు, సీబీఐ దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ కావడం వంటి అంశాలను న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ నెల 30 నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అప్పటికల్లా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అవినాశ్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకొని సీజేఐ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను కూడా జత చేసి జూలై 3న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని కోర్టు ఆదేశించింది.

- ఒకే ఇంటి నంబరుపై అధిక ఓటర్లు తక్కువే

డూప్లికేట్లను తొలగిస్తున్నాం



ముకేశ్ కుమార్ మీనా

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా స్పష్టీకరణ

- రాష్ట్రంలో 3.98 కోట్ల ఓటర్లలో ఒకే రకమైన ఇంటి నంబర్లు కలిగినవారు 1.62 లక్షల మంది
- ఒకే ఇంట్లో 500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఆరు ఇంటి నంబర్లను గుర్తించాం
- ఈనాడు కథనాన్ని ఖండించిన మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్లతో పోలిస్తే ఒకే ఇంటి నంబర్‌పై అధిక ఓటర్లు నమోదైన సంఖ్య చాలా తక్కువని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఒకే ఇంట్లో 500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఆరు ఇంటి నంబర్లను గుర్తించామన్నారు. 2018కు ముందు నుంచే ఇలా ఉందని చెప్పారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్లలో నివసించేవారు ఒకటే ఇంటి నంబరు, కొన్నిచోట్ల ఒకటే వీధి పేరు మీద ఓటర్‌గా నమోదు చేసుకోవడం వల్ల ఇలాంటి తప్పులు దొర్లాయని వెల్లడించారు. 50 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు 2,100 ఉన్నాయని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.98 కోట్ల ఓటర్లకుగానూ ఒకే రకమైన ఇంటి నంబర్లు కలిగినవారు 1.62 లక్షల మంది ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వీటిని ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ–2024 (ఎస్ఎస్ఆర్–2024) కార్యక్రమంలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సోమవారం సచివాలయంలో మీనా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్–2024 షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఆధార్‌తో అనుసంధానించలేదు..

అలాగే రెండు, మూడు చోట్ల ఒకరే ఓటర్లుగా ఉన్నవారిని గుర్తించామని మీనా తెలిపారు. వారు కోరుకున్న చోట ఓటు ఉంచి మిగిలిన చోట్ల రద్దు చేశామన్నారు. ఒకే ఫొటోతో రెండు, మూడు కార్డులున్న 15 లక్షల మంది ఓటర్లను గుర్తించి.. అందులో 10.20 లక్షల నకిలీ ఓటర్లను తొలగించామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఓటరు కార్డుతో ఆధార్ నంబర్‌ను లింక్ చేయలేదన్నారు. 80 శాతం మంది ఓటర్ల నుంచి ఆధార్ సమాచారం తీసుకున్నామే కానీ వాటిని ఇంకా అనుసంధానించలేదని స్పష్టం చేశారు.

యువ ఓటర్ల నమోదుపై దృష్టి

మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో యువ ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని ముకేశ్ కుమార్ మీనా చెప్పారు. వీరిని ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించామన్నారు. 18–19 ఏళ్ల వయసు ఉన్నవారు.. దేశ సగటు ప్రకారం చూస్తే రాష్ట్ర ఓటర్ల సంఖ్య ప్రకారం కనీసం 12 లక్షలు ఉండాలన్నారు. కానీ అది మన రాష్ట్రంలో 3.5 లక్షలకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండే వాళ్లు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఇందుకు ఎస్ఎస్ఆర్–2024ను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఎస్ఆర్ కోసం జూలై 20 వరకు ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తామన్నారు. బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేశాక అక్టోబర్ 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అన్ని రాజకీయపార్టీలకు అందిస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలను నవంబర్ 30 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. ఇందుకోసం అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 26లోగా పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని వివరించారు.

రాజకీయ పార్టీలు సర్వేలో పాల్గొనాలి..

కాగా విజయవాడలో ఒకే ఇంటి నంబరుపై అధిక ఓటర్లు ఉన్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై విచారణ చేస్తున్నామని మీనా తెలిపారు. ఇలా 2018 నుంచి ఒకటే ఇంటి పేరు మీద అధిక ఓటర్లు ఉన్నట్లు తేలిందన్నారు. 2018లో 674 మంది ఓటర్లు ఉంటే 2019లో 675 మంది.. ఇప్పుడు 516 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీటిని పరిశీలించాక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారని చెప్పారు. ఈ క్రమంలో ఓటర్ల సవరణ చేస్తారన్నారు. ఈ సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీఎల్ఏలను నియమించుకొని బీఎల్‌వోలతో కలిసి సర్వేలో పాల్గొనాలని కోరారు.

ఎన్ని జన్మలెత్తినా సీఎం కాలేవు

- దమ్ముంటే కాకినాడ నుంచి పోటీ చెయ్.. తుక్కు తుక్కుగా ఓడిస్తాం
- పవన్‌పై నిప్పులు చెరిగిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- రెండు చోట్ల ఓడిన నువ్వా నన్ను విమర్శించేది?



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎన్ని జన్మలెత్తినా సినిమాలలో తప్ప నిజ జీవితంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాలేడని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలతో వారాహి యాత్ర చేస్తున్న పవన్‌కు దమ్ముంటే తనపై పోటీ చేయడానికి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తే పవన్‌ను తుక్కుతుక్కుగా ఓడిస్తామన్నారు. ఆదివారం తనపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ద్వారంపూడి సోమవారం కాకినాడలో ఘాటుగా స్పందించారు. ఇక్కడ ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయనేమన్నారంటే.. పవన్ వారాహి యాత్ర కాకినాడ జిల్లా వీడే లోపు నాపై పోటీచేస్తానని ప్రకటించాలి లేదా, నాపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలి. నేను కాకినాడ నుంచి పోటీచేస్తానని ఇప్పుడే చెప్పగలుగుతున్నాను. అదే పవన్‌కైతే తన బాస్ చంద్రబాబు దయతలచి కాకినాడ సీటు ఇస్తారనే గ్యారెంటీ కూడా లేదు. కాకినాడ నుంచి పోటీచేసి అన్ని సామాజిక వర్గాల మద్దతుతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాను. నిజంగా నేను భూ కబ్జాలు చేసి, అరాచకాలకు పాల్పడి ఉంటే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఇక్కడి ప్రజలు గెలిపించే వారా?. రెండు చోట్ల పోటీచేసి రెండు చోట్లా ఓటమిపాలైన నీవా నాపై విమర్శలు చేసేది. నన్ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదు.

ప్యాకేజీ కుదరకే సీఎం జపం..

మార్చి 14న తాను ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కానని పొత్తులతో వస్తానని చెప్పిన పవన్.. మూడు నెలలు తిరగకుండానే మాట మార్చేశారు. చంద్రబాబుతో చీకటి ఒప్పందం, ప్యాకేజీ కుదరక మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కావాలని ప్రజల ముందు దేబిరిస్తున్నారు. అసలు జనసేన పార్టీ వల్ల నీ సామాజికవర్గానికి, నిన్ను అభిమానించే వారికి ఏమైనా ప్రయోజనం ఉందా?. నీ పార్టీ చంద్రబాబుకు, టీడీపీకి లబ్ధిచేకూర్చేందుకు మాత్రమే ఉంది. వంగవీటి మోహన్ రంగా, జక్కంపూడి రామమోహనరావు అడుగు జాడల్లో రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నాను. మూడు దశాబ్దాల క్రితం నేను రాజకీయాల్లోకి వచ్చినపుడు నా వెంట ఉన్న వారంతా ఇప్పటికీ నాతోనే ఉన్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పుడు నీ వెంట ఉన్న ప్రముఖులు మాదాసు గంగాధరం, తోట చంద్రశేఖర్, తేజ అశోక్, రాఘవయ్య వంటి వారు నీ పార్టీని వీడి ఎందుకు బయటకు వెళ్లిపోయారో చెప్పు.

చంద్రబాబుతోనే ప్రాణహాని

సొంత సోదరుడి కూతురే తుపాకీ పట్టుకుని బెదిరిస్తున్నాడని పోలీసులకు పవన్‌పై ఫిర్యాదు చేసిన విషయం గుర్తులేదా. సానుభూతి కోసం ప్రాణహాని అంటూ డ్రామాలు ఆడతావా? పవన్‌కు నిజంగా ప్రాణహాని చంద్రబాబుతోనే ఉంటుంది. ఇవే చంద్రబాబుకు చివరి ఎన్నికలు కావడంతో స్వార్థం కోసం ఆయనే ఆ పనిచేయవచ్చు. ఎప్పటికీ సీఎం కాలేని పవన్.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినట్టు కావాలంటే ఒక సినిమా తీసుకుని సంతృప్తి పడవచ్చు. రాజకీయాలలో వ్యక్తిత్వం లేని పవన్ రాజకీయ వ్యభిచారిగా మారాడు.

సీఎం చొరవతో ఎగుమతులు పెరిగాయి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడలోని రెండు పోర్టుల నుంచి బియ్యం ఎగుమతులకు అనుమతిస్తూ తీసుకున్న విధానపరమైన నిర్ణయంతోనే ఎగుమతులు పెరిగాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన బియ్యం కూడా ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్న విషయం తెలియని అజ్ఞాని పవన్. ఈ పోర్టు నుంచి రూ. 15 వేల కోట్ల విలువైన బియ్యమే ఎగుమతి కానప్పుడు రూ. 15 వేల కోట్ల అవినీతి ఎలా జరిగిందో చెప్పాలి. నా వద్ద అంత సొమ్మే ఉంటే పవన్‌కు ప్యాకేజీ ఇచ్చి నా కూడా తిప్పుకునేవాడిని.

ఏపీకి విలన్ చంద్రబాబే

- నాడు పన్నుల భారం మోపి ప్రజల నడ్డి విరిచారు
- అరాచక పాలన సాగించారు
- నేడు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ధ్వజం



చిలకలూరిపేట: రాష్ట్రానికి విలన్ టీడీపీ నేత చంద్రబాబేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పన్నుల భారం మోపి, ఇష్టారీతిన విద్యుత్ చార్జీలు పెంచి, పెట్రోల్, డీజిల్‌పై అదనపు వ్యాట్ విధించి ప్రజలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారని మండిపడ్డారు. చంద్రబాబు పూర్తిగా అరాచక పాలన సాగించారని విమర్శించారు. ఇప్పుడేమో వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు విమర్శలను ఖండిస్తూ మంత్రి రజిని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు పెంచారని చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు విద్యుత్ చార్జీలను భారీగా పెంచిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా విద్యుత్ చార్జీల మోత మోగించేవారని గుర్తు చేశారు. 2015 ఫిబ్రవరిలో పెట్రోల్, డీజిల్‌పై ఏకంగా రూ.4 అదనపు వ్యాట్ విధించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. రాష్ట్రంలో బెల్టుషాపుల వ్యవస్థను సృష్టించిన చంద్రబాబు.. మద్యపాన నిషేధాన్ని సైతం ఎత్తివేశారని.. అలాంటి వ్యక్తి నేడు మద్యం గురించి మాట్లాడుతుండటం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు ఊరూరా మద్యం అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్టుషాపులన్నింటినీ రద్దు చేసిందని గుర్తు చేశారు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకు టిడ్కో ఇళ్లను తెరపైకి తెచ్చారని విమర్శించారు. అందుకే ప్రజలు టీడీపీకి తగిన విధంగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఎన్ని హత్యలు జరిగాయో, మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరిగాయో, టీడీపీ గూండాలు ఎలా రెచ్చిపోయారో ప్రజలింకా మర్చిపోలేదన్నారు. శాంతిభద్రతల విషయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసుల పనితీరుకు గాను ఇప్పటికే 200కు అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. నాడు టీడీపీ నేతలు పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడితే.. చంద్రబాబు వారందరికీ అండగా నిలిచారని విమర్శించారు.

ఆడబిడ్డలకు రాష్ట్రంలో రక్షణ లేదు

- అమర్‌నాథ్‌ను కిరాతకంగా సజీవ దహనం చేశారు
- పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
- మహిళల రక్షణ బాధ్యత తీసుకుంటా
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. ఉప్పాలవారిపాలెంలో హత్యకు గురైన పదో తరగతి విద్యార్థి అమర్‌నాథ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. పార్టీ తరఫున రూ.10 లక్షలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమర్‌నాథ్‌ని కిరాతకంగా సజీవ దహనం చేశారని, మీడియాలో వార్తలు చూసిన తర్వాతే పోలీసులు స్పందించారని చెప్పారు. బాధిత కుటుంబం సీఐకు ఫిర్యాదు చేస్తే వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ ఘటన తర్వాత నిందితులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కౌంటర్ కేసు పెట్టేందుకు ప్రయత్నించారని అన్నారు. ఇంత ఘోరం జరిగితే సీఎం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సీఎంకీ ఆడబిడ్డలున్నారని, ఇలాంటి పరిస్థితి వాళ్లకెదురైతే బాధ ఉండదా, బీసీ బిడ్డకు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోరా అని అన్నారు. గంజాయి మాఫియా చెలరేగడం వల్లే రాష్ట్రంలో ఈ దుస్థితి వచ్చిందన్నారు. ఎంపీ వచ్చి కేసు పెట్టొద్దని, ఆయా ఉద్యోగం ఇస్తామని చెబుతారా అని ప్రశ్నించారు. ఆయా ఉద్యోగం చేసుకుంటావా, చదువుకుని నీ తమ్ముడిని చంపిన వారిపై పగతీర్చుకుంటావా అని అమర్‌నాథ్ అక్కని అడిగితే, గొప్పగా చదువుకుని ఇలాంటి దుర్మార్గులను తరిమి కొడతానని ఆ బాలిక చెప్పిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ఆ అమ్మాయిని దత్తత తీసుకుంటున్నామని చెప్పారు. మహిళల రక్షణ బాధ్యత తీసుకుంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించి బంగాళాఖాతంలో పడేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రం నార్త్ కొరియాలా మారింది

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రం ఉత్తర కొరియాలా తయారైందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. దేశంలో నంబర్ 1 డ్రగ్ రాష్ట్రంగా ఏపీ తయారైందని ఆరోపించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. భూముల ధరలు ఇంతలా పతనం కావడానికి జగన్ వైఖరే కారణమన్నారు. గుడివాడలో టిడ్కో ఇళ్లు తానే కట్టించానని జగన్ అబద్ధాలు చెబుతున్నాడని, నివాస యోగ్యమైన ఇళ్లను తాను కట్టిస్తే సీఎం సెంటు భూమిలో ఇల్లు పేరుతో మోసం చేస్తున్నాడని చెప్పారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్ల ఆస్తులను గన్ చూపించి బెదిరించి లాక్కున్నారన్నారు. ఎక్కడ ఎలాంటి మైనింగ్ చేయాలన్నా ఒక రేటు కట్టి దోచుకుంటున్నారని, మైనింగ్ సెస్ కలెక్ట్ చేసేందుకు జిల్లాకో వైసీపీ బ్యాచ్‌ను ఏర్పాటు చేశారని విమర్శించారు. తిరుపతిలో శ్రీ వాణి దర్శనం టికెట్లు కూడా క్యాష్ రూపంలోనే కలెక్ట్ చేస్తున్నారని ఆరోపించారు.

పార్టీ నడిపే సత్తా పవన్‌కు లేదు: మంత్రి అంబటి



సాక్షి, అమరావతి: రాజకీయ పార్టీని నడిపే సత్తా లేని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆవేశం, ఆక్రోశంతో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై అవగాహన లేని పవన్ లాంటి వ్యక్తులు రాజకీయాలకు తగరని స్పష్టం చేశారు. మంత్రి అంబటి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'పవన్ కల్యాణ్ రాజకీయం చేస్తున్నాడా? రౌడీయిజం చేస్తున్నాడా? వైఎస్సార్ సీపీ నాయకులను గూండాలంటాడు. ఇళ్లల్లోకి వచ్చి బయటకు లాగి కొడతాడట. ఆయన కొడుతుంటే మేం చేతులు కట్టుకుని కూర్చోవాలా?' అని ధ్వజమెత్తారు. జనసేన క్లారిటీ లేని పార్టీ అని విమర్శించారు. పవన్‌ను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లేనని వ్యాఖ్యానించారు. 2009 నుంచి రాజకీయాల్లో ఉంటూ పవన్ ఏం సాధించారని ప్రశ్నించారు. ఒంటరిగా పోటీ చేస్తే గౌరవమైనా దక్కుతుందని, చంద్రబాబును గెలిపించడానికే పుట్టానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పవన్ చుట్టూ తిరిగే యువత భవిష్యత్తును నాశనం చేయవద్దని హితవు పలికారు. గత నాలుగు రోజులుగా సీఎం జగన్, తమ పార్టీపై పవన్ అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా విజయవాడలో 45 దేవాలయాలను కూలివేస్తే పవన్ ఏమైపోయారని నిలదీశారు. టీడీపీ నాయకులు గంజాయి సాగులో రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేశారన్న వ్యాఖ్యలను పవన్ గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. టిడ్కో ఇళ్లపై విమర్శలు చేస్తున్న చంద్రబాబు ఎవరికో పుట్టిన బిడ్డను ఎత్తుకుని ముద్దాడుతున్న పనికిమాలిన వ్యక్తి అని అంబటి విమర్శించారు. 'ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన పార్టీని నువ్వే స్థాపించినట్లు వ్యవహరిస్తున్నావ్. పోలవరాన్ని కూడా సిగ్గులేకుండా నీ బిడ్డే అంటున్నావ్' అని చంద్రబాబుపై మండిపడ్డారు. 'దివంగత వైఎస్సార్ పోలవరానికి శంకుస్థాపన చేసి రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తే సీఎం జగన్ పూర్తి చేస్తున్నారు. సినిమాల్లో ప్రకాశ్‌రాజ్ మాదిరిగా కరకట్ట విలన్ చంద్రబాబు ప్రజలను మోసగించేందుకు రకరకాల పాత్రలు వేస్తున్నారు' అని అంబటి దుయ్యబట్టారు.

పవన్ చెడ్డీ, బనియన్‌తో తిరగడం ఖాయం

'వచ్చే ఎన్నికల్లో కౌరవ వధ జరగాలని చంద్రబాబు కోరుకుంటున్నాడు. ఇప్పటికే ఒకసారి వైఎస్సార్ చేతిలో, మరోసారి సీఎం జగన్ చేతుల్లో కౌరవ వధ జరిగింది. 2024 ఎన్నికల్లో కూడా జరుగుతుంది. మాది దత్తపుత్రుడి మాటలు, ఉడత ఊపులకు బెదిరే పార్టీ కాదు. తన వాహనానికి అమ్మవారి పేరు పెట్టుకుని అబద్ధాలు వల్లిస్తున్న పవన్‌కల్యాణ్‌కు పుట్టగతులుండవ్. అధికారంలోకొస్తే మా నాయకుల్ని బట్టలూడదీసి కొడతావా పవన్? నీకు అంత ధైర్యం ఉందా? త్వరలో నువ్వు చెడ్డీ, బనియన్‌తో తిరగడం ఖాయం. రాజకీయాల్లోకి వచ్చి ప్యాకేజీస్టార్ బిరుదు తెచ్చుకున్నావు. ఇప్పుడు బూతుల స్టార్‌వి అయ్యావు. నీకు ప్రాణహాని ఉంటే ఆధారాలతో నిరూపించాలి. సానుభూతి, మభ్యపెట్టే ప్రయత్నాల్ని మానుకోవాలి. దీనిపై విచారణ జరిపి తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' అని అంబటి పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్టులో ఒక్క పైసా కూడా అవినీతి జరగడానికి ఆస్కారం లేదని పునరుద్ఘాటించారు. పవన్ కళ్యాణ్‌పై రష్యాలో ఒక ఫైల్ ఓపెన్ అయ్యిందని, దాని సంగతి చూసుకోవాలని హితవుపలికారు. అక్కడ కమ్యూనిస్టుల పరిపాలన సాగుతుంది కాబట్టి ఆ ఫైల్ విషయంలో మోదీ, అమిత్‌షా కాళ్లు పట్టుకున్నా పవన్‌ను ఎవరూ కాపాడలేరన్నారు. మార్గదర్శిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్న బీజేపీ నేత, ఎంపీ జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైట్ కాలర్ క్రిమినల్ రామోజీరావును సమర్థిస్తూ జీవీఎల్ మాట్లాడటం సరికాదన్నారు. చిట్‌ఫండ్ సంస్థల పేరిట ప్రజల డబ్బును అక్రమ మార్గాల్లో దోచుకుంటుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు.

బాలుడి హత్యపై బాబు నీచ రాజకీయం

- రెండు కుటుంబాల వివాదాన్ని రాజకీయం చేసే ప్రయత్నం
- బాధిత కుటుంబాన్ని రెచ్చగొట్టేలా బాబు వ్యవహారం

సాక్షి, ప్రతినిధి, గుంటూరు : టీడీపీ అధినేత చంద్రబాబు నీచ రాజకీయ చరిత్రలో మరో పేజీ ఇది. రాష్ట్రంలో ఏ ఘటన జరిగినా రాజకీయానికి వాడుకొనే ఆయన.. బాపట్ల జిల్లాలో జరిగిన బాలుడి హత్యనూ అందుకే వాడుకొన్నారు. రాజకీయాలకు, కులాలకు ఏమాత్రం సంబంధంలేని హత్యకు రాజకీయ రంగు పులిమారు. రెండు కుటుంబాల మధ్య వివాదాన్ని కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు. బాధలో ఉన్న కుటుంబానికి సాంత్వన కలిగించేలా ప్రవర్తించాల్సిన ఆయన.. అందుకు భిన్నంగా వ్యవహరించారు. మాజీ సీఎం అయి ఉండీ, .. వారిని మరింత రెచ్చగొట్టేలా వ్యవహరించడం అందరినీ విస్మయపరిచింది. ఘటన జరిగిన వెంటనే తన పార్టీ శ్రేణులతో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ.. సోమవారం తానే ఆ గ్రామానికి వచ్చి పరామర్శ పేరుతో నీచ రాజకీయానికి తెరలేపారు.

రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లాలో పదో తరగతి విద్యార్థి అమర్‌నాథ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వెంటనే పోలీసులను రంగంలోకి దింపింది. గంటల వ్యవధిలోనే పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాలుగో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారికి కఠిన శిక్షలు పడేలా పోలీసు అధికారులు ఛార్జ్‌షీట్ సిద్ధం చేస్తున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా ఘటన స్థలాన్ని పరిశీలించి నిందితులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ప్రకటించారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అదే రోజు సమాచారం తెలిసిన వెంటనే రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఆ గ్రామానికి వెళ్లారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. తక్షణ సాయం కింద లక్ష రూపాయలు ఇచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆ సాయం బాధిత కుటుంబానికి అందకుండా అడ్డుపడ్డారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి తీసుకువచ్చే సమయంలోనూ టీడీపీ నాయకులు అడ్డుకుని రాజకీయం చేశారు. మృతదేహంతో నడిరోడ్డుపై బైఠాయించారు. మరుసటి రోజే రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ మోపిదేవి ఆ కుటుంబం వద్దకు వెళ్లి రూ. 10 లక్షల చెక్కు అందించారు. వారికి ఇంటి స్థలం కేటాయించడంతో పాటు, ప్రస్తుతం వారు ఉంటున్న చోట ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. మృతుని సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దానికి ఆ కుటుంబం కూడా అంగీకరించింది. ప్రస్తుతం సోదరి ఇంటర్మీడియట్ చదువుతుండటంతో అంగన్‌వాడీ ఆయా పోస్టు ఇస్తామని చెప్పారు. ఈమేరకు ప్రభుత్వం ఆర్డర్స్ కూడా ఇచ్చింది. ఒకవేళ చదువుకుంటానంటే చదువు పూర్తి అయిన తర్వాత దానికి తగ్గ ఉద్యోగం ఇస్తామని చెప్పినట్లు మృతుని సోదరి మీడియా ముందు చెప్పింది. తొలిరోజు జరిగిన ఘటనల్లో తమ తప్పు ఉంటే మన్నించాలని కూడా ఆ కుటుంబం కోరింది.

కులాల మధ్య చిచ్చు పెట్టేలా

ఇది రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదమన్నది సుస్పష్టం. ప్రభుత్వమూ వెంటనే స్పందించిన విషయమూ స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. అయినా ప్రతి ఘటననూ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలనే చంద్రబాబు.. ఈ విషాదాన్ని కూడా అదే విధంగా కలుషితం చేసే ప్రయత్నం చేశారు. దీనిని రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం చేయాలని టీడీపీ శ్రేణులను ఆదేశించారు. దీంతో టీడీపీ శ్రేణులు బాధిత కుటుంబం చుట్టూ చేరి, ప్రభుత్వ చర్యలను అడ్డుకోవడం ప్రారంభించాయి. ఆదివారం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తో కూడా బాబు ఇదే అంశంపై మాట్లాడించారు. సోమవారం ఆయనే స్వయంగా పరామర్శ పేరుతో గ్రామానికి వచ్చారు. పూర్తిగా రాజకీయమే చేశారు. పోలీసులు ఆలస్యంగా స్పందించారంటూ నిందలు వేశారు. బీసీ బిడ్డకు అన్యాయం జరిగిందంటూ కుల ప్రస్తావన చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించారు. వాస్తవానికి ఈ ఘటనలో నలుగురు నిందితుల్లో ముగ్గురు ఒక సామాజిక వర్గానికి చెందిన వారైతే, నాలుగో వ్యక్తి మృతుని సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే. ఈ హత్యతో రాజకీయాలకు, కులాలకు సంబంధం లేదు. అక్కని వేధించడంపై నిలదీశాడని కక్ష పెంచుకుని వారు హత్య చేశారు. అయినా చంద్రబాబు ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారు. సీఎం ఇంట్లో ఆడబిడ్డలు లేరా, వారికీ ఇలా జరిగితే.. వైసీపీ ఎంపీ, మంత్రుల ఇంట్లో వాళ్లకు ఇలా జరిగితే ఊరుకుంటారా.. అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే ఆయా ఉద్యోగం చేసుకుంటావా, నీ తమ్ముడిని చంపిన వారిపై పగ తీర్చుకుంటావా అంటూ మృతుని సోదరిని రెచ్చగొట్టారు. ఇలా ఆయన గ్రామంలో ఉన్నంతసేపూ రెచ్చగొట్టేలా వ్యవహరించారు. గతంలో పల్నాడులో జరిగిన హత్య, ఇతర ఘటనలపైనా ఇదే విధంగా నీచ రాజకీయానికి ఒడిగట్టారు. ఇప్పుడూ అలానే వ్యవహరించి, తన సహజ లక్షణాన్ని బయటపెట్టుకున్నారు.

అన్ని ఆచరణల కంటే మించి చేయాల్సినది హృదయాన్ని కాపాడుకోవడం. ఎందుకంటే అదే జీవితానికి ఆధారం కాబట్టి.
– జుదాయిజం

సాక్షి
మంగళవారం, 20 జూన్ 2023

ఈ మంటలు ఆర్పండి!

నెలన్నర దాటిపోయింది. ఇప్పటికి 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 50 వేల మంది నిరాశ్రయులయ్యారు. రాష్ట్ర బలగాలకు తోడు కేంద్ర బలగాలు రంగంలోకి దిగి చాలాకాలమైంది. సాక్షాత్తూ కేంద్ర హోమ్ మంత్రి వచ్చి పర్యటించారు. అయినా పరిస్థితి మారలేదు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ ఇవాళ్టికీ అగ్నిగుండమై మండుతోంది. శాంతిభద్రతలు క్షీణించి, మూకస్వామ్యం రాజ్యమేలుతోంది. షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) హోదా ఇవ్వాలంటూ మైతై తెగ ప్రజలు చేస్తున్న డిమాండ్‌కు వ్యతిరేకంగా మే మొదటివారంలో జరిగిన గిరిజనుల ప్రదర్శన హింసాత్మకంగా మారినప్పుడు మొదలైన ఈ జ్వాల మణిపూర్‌లోని తెగల మధ్య చీలికలను ఎత్తిచూపింది. మరి, ఈ మంటల్ని చల్లార్చి, శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత తల మీద ఉన్న సర్కారు ఇప్పటి దాకా ఏం చేసినట్టు? సమస్యను చక్కదిద్దాల్సిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఒక వర్గం వైపు నిలబడి, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దీంతో పరిస్థితి అంతకంతకూ దిగజారుతోంది.

కుకీలు ఎక్కువుండే కొండ ప్రాంత జిల్లాల నుంచి మైతైలు వలసపోతుంటే, మరోపక్క మైతైలు అధికంగా ఉండే ఇంఫాల్ లోయ నుంచి కుకీలు తరలిపోతున్నారు. కేంద్ర మంత్రి నివాసం సహా రెండు వర్గాలకు చెందిన 4 వేల గృహాలు ఇప్పటికే అల్లర్లలో అగ్నికి ఆహుతి అయ్యాయి. శరణార్థి శిబిరాలు కిక్కిరిశాయి. అమాత్యుడి ప్రైవేట్ నివాసంపై దాడి గత మూడు వారాల్లో ఇది రెండోసారి. జాతుల మధ్య విద్వేషం ఇంతగా పెచ్చరిల్లుతుంటే, కేంద్రంలో, రాష్ట్రంలో రెండుచోట్లా అధికారంలో ఉన్న పాలకపక్షం ఏం చేస్తోందన్నది ప్రశ్న. నిజానికి, కేంద్ర హోమ్ మంత్రి ఇటీవలే సంక్షుభిత మణిపూర్‌ను సందర్శించినప్పుడు, సమస్యకు పరిష్కారం లభిస్తుందనుకున్నా ఆ ఆశ నెరవేరలేదు.

భౌగోళికంగా బంగ్లాదేశ్, చైనా, మయన్మార్‌ల మధ్య చిక్కిన ఈశాన్య రాష్ట్రాల్లో తెగల మధ్య తరచూ ఘర్షణలు కొత్త కావు. 1949లో భారత యూనియన్‌లో చేరినప్పటి నుంచి మణిపూర్‌లోనూ అవి ఉన్నవే. కానీ, మధ్యవర్తులుగా ఉండాల్సినవారే తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానంతో ఇరువర్గాల మధ్య విశ్వాసం సన్నగిల్లడం విషాదం. అపనమ్మకం నిండినచోట భద్రతా దళాలైనా తగిన చర్యలు చేపట్టడం కష్టం. మణిపూర్ రైఫిల్స్ సహా రాష్ట్ర పోలీసు బలగాలు మైతైలకే మద్దతుగా నిలుస్తున్నాయని కుకీల భావన. మైతైలేమో కుకీ ప్రాబల్య పర్వత ప్రాంతాల్లో చట్ట విరుద్ధంగా గంజాయి సాగు చేస్తున్నా అస్సామ్ రైఫిల్స్ చూసీ చూడనట్టున్నాయని ఆరోపిస్తున్నారు. ఇది చాలదన్నట్టు భద్రతాదళాల మధ్యా ఘర్షణ వాతావరణం నెలకొంది. పారా మిలటరీ దళాలు తమ పనిలో జోక్యం చేసుకుంటున్నాయని పోలీసుల ఆరోపణ. వెరసి, పాలన మృగ్యమైన మణిపూర్‌లో నేటికీ రహదారులు సాయుధ మూకల నియంత్రణలోనే ఉన్నాయి.

రాష్ట్రంలో ఉద్రిక్తతల్ని చల్లబరచడానికి పాలకుల వైపు నుంచి ఏ మాత్రం ప్రయత్నాలు జరుగుతున్నాయంటే అనుమానమే. ఎంతసేపటికీ దీన్ని శాంతి భద్రతల సమస్యగానే వారు చూస్తున్నారు. అది పెద్ద చిక్కు. పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పదే పదే విఫలమైనా, కేంద్రం ఉపేక్షించింది. విద్వేషాగ్నిలో ఈశాన్యం కాలిపోతున్నా, మూడు వారాల పైచిలుకు తర్వాత కానీ హోమ్ మంత్రి అక్కడకు రాకపోవడం ఏ రకంగా సమర్థనీయం? కొన్ని వారాలుగా ఇలా ఉన్నా ప్రధాని తన రాజకీయ సభల్లో కానీ, ఇతరత్రా కానీ ఎక్కడా మణిపూర్ ఊసే ఎత్తలేదు. మాటల ద్వారా మనుషుల మధ్య మత్సరం తగ్గించాల్సిన వేళ పాలకులు మౌనముద్ర దాల్చడం విడ్డూరమే!

గౌహతి హైకోర్ట్ రిటైర్డ్ ఛీఫ్ జస్టిస్ సారథ్యంలో ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేయడం బాగానే ఉంది. కానీ, రాష్ట్ర గవర్నర్ నేతృత్వంలో శాంతి సంఘం ఏర్పాటుకు మాత్రం ఆదిలోనే హంసపాదు పడింది. పక్షపాత సీఎం సభ్యుడిగా ఉన్న కమిటీలో తాము ఉండబోమనేది కుకీ ప్రతినిధులు తేల్చేశారు. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందో బీరేన్ ఆలోచించుకోవాలి. 2017లో తొలి విడత సీఎంగా ఎన్నికైనప్పుడు గిరిజనవాసులతో సన్నిహితంగా మెలిగిన ఆయన 2022లో రెండో విడత అధికారం చేపట్టాక వైఖరి మార్చారు. ప్రభుత్వస్థలంలో ఆక్రమణల పేరిట ఇంఫాల్‌లో చర్చిలతో సహా అనేకం కూల్చివేతకు ఆదేశించి, కుకీలకు కోపకారణమయ్యారు. సంఖ్యాపరంగా మైతైలున్నందున మెజారిటీ వాదాన్ని స్థానిక గిరిజన తెగలపై రుద్దుతున్నారనే భావన కలగడమూ సమస్యకు కారణమైంది.

మైతైలకు ఎస్టీ హోదానిచ్చే అంశం పరిగణనలోకి తీసుకోవచ్చని కోర్ట్ చెప్పింది సరే, ఆ వివాదాస్పద నిర్ణయంతో తెగల మధ్య అశాంతి నెలకొంటుందని ఊహించకపోవడం ప్రభుత్వ తప్పిదమే. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, పర్యవసానాలు ఊహించి సంబంధిత వర్గాల మధ్య అపోహల్ని ముందే తొలగించడం కీలకం. పాలకులు అక్కడే విఫలమయ్యారు. అనుమానాలు పెను భూతాలై, పరిస్థితిని ఇంతదాకా తెచ్చారు. ఇంటర్నెట్‌పై నిర్బంధాల నేపథ్యంలో క్షేత్రస్థాయి వార్తలు సరిగ్గా తెలియకపోగా, అసలు కథ వదిలేసి దీన్ని రెండు మతాల మధ్య ఘర్షణగా చిత్రించే ఘోర తప్పిదాలూ సాగుతున్నాయి. ఇప్పటికైనా కేంద్రం కలగజేసుకోవాలి. అన్ని తెగలకూ రాజ్యాంగ రక్షణ ఉందన్న భరోసా కల్పించాలి. మూలన విసిరేసినట్టుగా ఉన్న ఆ ప్రాంతాలనూ, ప్రజలనూ పరాయివారుగా చూసే ధోరణి మారాలి. అక్కడి విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలను గౌరవిస్తూ, దేశంలో తామూ భాగమనే అభిప్రాయం ఆ ప్రజల్లో కల్పించాలి. మరి, ఆ దిశగా శాంతి స్థాపనకు ఇకనైనా పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అన్నది మాటలకే పరిమితం కాదన్న నమ్మకం వివిధ తెగల మధ్య కల్పిస్తారా?

ప్రశ్నించే గొంతులకు సంకెళ్లా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'దేశద్రోహ' నేరారోపణ అన్నది వలస పాలకుల దౌర్జన్య పాలనావసరాల కోసం ఏర్పరచుకున్న ప్రత్యేక నిబంధన. వలస పాలనానంతరం ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఈ నిబంధన చేటు కలిగిస్తోంది. 2010 నుంచీ ఇప్పటివరకూ 800కు పైగా దేశద్రోహ కేసులు నమోదయ్యాయని 'ఎ డికేడ్ ఆఫ్ డార్క్‌నెస్' డేటాబేస్ చెబుతోంది. ఈ ప్రజా వ్యతిరేక చట్టాల కొనసాగింపు కేంద్రం వరకే పరిమితం కాలేదు. కొన్ని రాష్ట్రాల పాలకులు కూడా అదే 'అలవాటు'లో ఉన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం 150 మందికిపైగా పౌర హక్కుల ఉద్యమ నాయక, కార్యకర్తలపైన సాధికారత లేని 'ఉపా' కేసుల్ని మోపింది. భూస్వామ్య, ధనికవర్గ ప్రయోజనాల రక్షణే పాలకుల ప్రాధాన్యమా?

''దేశంలో వలస పాలన అంతరించిన తరువాత కూడా, వలస పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం భారతదేశంలో పౌరులపైన, పౌర హక్కులపైన విధించిన 'దేశద్రోహ' చట్టంలోని '124–ఎ' నిబంధన అమలు జరుగుతూండటం దారుణం. వలస పాలనానంతరం ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఈ నిబంధన చేటు కలిగిస్తోంది. ఈ తప్పుడు నిబంధన సృష్టించిన సమస్యను ఏ భాషా మార్పు వల్లా, నిబంధనల సరళింపు వల్లా పరిష్కరించలేము. ఎందుకంటే 'దేశద్రోహ' నేరారోపణ అన్నది వలస పాలకుల దౌర్జన్య పాలనావసరాల కోసం ఏర్పరచుకున్న ప్రత్యేక నిబంధన. కనుకనే స్వతంత్ర భారత సుప్రీంకోర్టు '124–ఎ' దేశద్రోహ నేరారోపణ నిబంధన స్వతంత్ర భారతంలో చెల్లదని కేదార్‌నాథ్ వర్సెస్ బిహార్ (1962) కేసు విచారణ సందర్భంగా కొట్టివేసింది. ఈ అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని పాలకులు అమలు జరిపి ఉంటే – ప్రభుత్వాన్ని విమర్శించిన నేరానికి లేదా అలాంటి విమర్శను ప్రసారం చేసే వీడియోలు విన్న నేరానికి లేదా అలాంటి పాటలు విన్న నేరానికి దేశ పౌరులపైన దేశద్రోహ కేసులను పాలకులు మోపి ఉండేవారు కాదు. ఇప్పటిదాకా రాజ్యాంగంలోని 14వ అధికరణ కింద 2010 నుంచీ ఇప్పటి వరకూ 800కు పైగా దేశద్రోహ కేసులు నమోదయ్యాయి.''

– లభ్యతి రంగరాజన్

(ఇప్పటివరకూ దేశంలో నమోదైన 'దేశద్రోహ' కేసులను పరిశీలించి, వాటిని 'ఓ దశాబ్దపు చిమ్మ చీకటి' (ఎ డికేడ్ ఆఫ్ డార్క్‌నెస్) పేరిట ఏర్పాటుచేసిన డేటాబేస్ సాధికారికంగా నమోదు చేసింది. దీనికి లభ్యతి రంగరాజన్ ఎడిటర్‌గా ఉన్నారు.)

దేశ పాలకులూ, వారి ఇష్టానుసారం మెలగుతున్న పాలనా యంత్రాంగమూ పుర్రెకు పుట్టిన బుద్ధి ప్రకారం పౌర సమాజాన్ని ఇబ్బంది పెట్టవచ్చా? అనుకూలమైన వలస చట్టాల చాటున అనేక రకాల నిర్బంధాలకు గురి చేయవచ్చునని 'పెగసస్' విదేశీ స్పైవేర్ కొనుగోలు చేసినప్పుడే ఇది నిరూపితమైంది. ఈ ప్రజా వ్యతిరేక చట్టాల కొనసాగింపు కేంద్రం వరకే పరిమితం కాలేదు. అలాంటి చట్టాలపై ఆధారపడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు కూడా అదే 'అలవాటు'లో ఉన్నారు. ఉండబట్టే తాజా పరిణామాలలో భాగంగా

రెండో మాట



దేశవ్యాప్తంగానూ, విదేశాల్లోనూ ఖ్యాతి పొందిన సుప్రసిద్ధ విద్యావేత్త, సంస్కర్త, పౌరహక్కుల ఉద్యమ నాయకులలో ఒకరు అయిన ప్రొఫెసర్ హరగోపాల్ సహా దాదాపు 150 మందికిపైగా పౌర హక్కుల ఉద్యమ నాయక, కార్యకర్తలపైన సాధికారత లేని 'ఉపా' కేసుల్ని మోపి పాలకులు తమ 'చెవి దురద' తీర్చుకున్నారు. ఆ 'దురద'ను అంత త్వరగానూ తొలగ గొట్టుకోవడానికి తంటాలు పడ్డారు. ఏ 'నేరం'పైన ఈ కుట్ర కేసు బనాయించవలసి వచ్చిందో స్పష్టత లేదు.

కాగా, పక్కా తెలంగాణ వాసి, భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చినా ఆ వాసనకు దూరంగా ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, తాను పుట్టి పెరిగిన ఫ్యూడల్ సంప్రదాయాల్ని కాలదన్నిన వారు బి.నరసింగరావు. తెలంగాణలో తన ప్రజలు అనుభవించిన భూస్వామ్య దాష్టీకాలను కళ్లారా చూసి మనసు చెలించి, 'దాసి' చలన చిత్రం ద్వారా ధనిక వర్గ దుర్మార్గాన్ని ఎండగట్టి దేశంలోనే గాక అంతర్జాతీయంగానూ ఆయన ఖ్యాతి గడించారు. అలాంటి నేలతల్లి బిడ్డకు కూడా పాలకులు 'ఇంటర్వ్యూ' ఇవ్వడానికే జంకారు, కాదు భయపడ్డారు, లేదా బిడియపడ్డారు! ఎందుకు? నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే తెలంగాణకు నిజమైన రక్షణ ఉందని ఆయన ప్రకటించినందుకు! పేరుకు తగ్గట్టే ఆయనది తెలంగాణలోని 'ప్రజ్ఞాపురం'. వాస్తవం ప్రకటించినందుకు తనకు ఇంటర్వ్యూను నిరాకరించిన నేటి తెలంగాణ పాలకులను ప్రశ్నిస్తూ నరసింగరావు ఎక్కడ పుట్టిన 'కమలం' ఇది అని ప్రశ్నించడం కొంత బాధాకరమైనదైనా అది తనకు జరిగిన అవమానాన్ని వ్యక్తం చేయడానికి ఉద్దేశించింది మాత్రమేనని భావించాలి.

భారత లౌకిక రాజ్యాంగం నిర్దేశించి నెలకొల్పిన సుసంప్రదాయాలు ఎన్నో ఉన్నా వాటిని తృణీకరించి ప్రజా వ్యతిరేక పాలనను దొల్లించుకుపోతున్న పాలకులకు 'ముగుదాడు' వేయగల ప్రజాస్వామిక న్యాయ వ్యవస్థ ఇప్పుడు ఉన్నందున, పాలకులు, పాలనా వ్యవస్థ కొంతమేర అదుపులో ఉన్నట్టు కన్పిస్తోంది. కానీ లోపాయికారీ పద్ధతుల్లో దేశంలోని ఫెడరల్ వ్యవస్థ ప్రయోజనాల్ని దెబ్బతీయడానికి మరోవైపు నుంచి మతవాద, మితవాద శక్తులు చీలుబాటలవైపే ప్రయాణిస్తూ వ్యవస్థను అస్థిరం చేస్తున్నాయని మరచిపోరాదు. అంతకన్నా ఎన్నటికీ మరవరాని అంశం – రాజ్యాంగంలో పొందుపరచుకున్న ప్రజాహిత సూత్రాలను అమలు చేయించుకోగల హక్కును దేశ పౌరులకు లేకుండా చేశారు. కారణం స్పష్టమే. భూస్వామ్య, ధనికవర్గ ప్రయోజనాల రక్షణకే పాలకుల ప్రాధాన్యం. నేడు రాజ్యాంగమూ, దాని ప్రయోజనాలనూ కేవలం కొద్దిమంది కార్పొరేట్ అధిపతులు, వారికి కొమ్ముకాస్తున్న పాలక వర్గమే అనుభవిస్తోందని ప్రజలు భావిస్తున్నారు. తొల్లింటి అరకొర ప్రజానుకూల ప్రణాళికా వ్యవస్థ కూడా ఈ రోజున కూలిపోయింది. అందుకే కూలిపోయే వ్యవస్థను కాపాడ్డానికే దాని రక్షకులైన పాలక వర్గాలు 'కంకణం' కట్టుకుంటారు. మహాకవి శ్రీశ్రీ దశాబ్దాల క్రితమే రానున్న పరిణామాల్ని గురించి ముందస్తు హెచ్చరిక చేశారు:

''విభజన రేఖను రక్షించడానికే
న్యాయస్థానాలు, రక్షక భట వర్గాలు
చెరసాలలు, ఉరి కొయ్యలు'' అని చెబుతూనే –
''అభిప్రాయాల కోసం
బాధలు లక్ష్యపెట్టనివాళ్లు
మాలోకి వస్తారు
అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించేవాళ్లు
మీలోకి పోతారు'' అనీ ప్రకటించారు!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎవరున్నారు?



దాదాపు నెల రోజుల్లో ముగ్గురు ముఖ్య ఖలిస్తాన్ అనుకూల నాయకులు వేర్వేరుగా చనిపోవడం కాకతాళీయ సంఘటనలు కావు.
– హర్జోత్ సింగ్ బాల్, సంపాదకుడు

మారిన పరిస్థితి



పదిహేనేళ్ల క్రితం, వాస్తవ ప్రపంచం నుంచి తప్పించుకోవడానికి ఇంటర్నెట్ ఒక సాధనం. ఇప్పుడు దీన్నుంచి తప్పించుకోవడానికి వాస్తవ ప్రపంచమే మార్గం.
– నోవా స్మిత్, ఆర్థికవేత్త

ఇదా ప్రజాస్వామ్యం?



'ప్రజాస్వామ్యం మన నరాల్లో ఉంది, అది మన సంస్కృతి': 'భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిది': 'భారత్ ప్రజాస్వామ్య దేవాలయం'... ఇలాంటి గొప్పగా ధ్వనించే మాటలకు అంతర్జాతీయ సమాజం హర్షిస్తుంది: వీటినే పునరావృతం చేసుకుని వినుగు చెందుతుంది. అన్నట్టూ కేంద్ర పాలనలో జమ్ము కశ్మీర్ ఐదేళ్లు పూర్తిచేసుకుంది. జమ్ము కశ్మీర్ ఎక్కడ ప్రారంభం అవుతుందో అక్కడ ప్రజాస్వామ్యం అంతం అవుతుంది.
– ఒమర్ అబ్దుల్లా, జమ్ము–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

కృతఘ్నత



గత డెబ్బై ఐదేళ్లుగా పాశ్చాత్య దేశాల ఉదారత మీద పాలస్తీనా బతుకుతోంది. అయినా పెట్టుబడిదారీ విధానాన్నీ, అమెరికానూ, పాశ్చాత్య దేశాలనూ తీవ్రంగా విమర్శిస్తుంది; ఇరాన్, చైనా, రష్యాలను ప్రశంసిస్తుంది. దీనికి భిన్నంగా మేము ఇజ్రాయిల్‌కు ఇచ్చే సొమ్ముకు ప్రతిఫలంగా కనీసం కృతజ్ఞత, విశ్వాసం గల స్నేహాలను పొందుతున్నాం.
– హుస్సేన్ అబ్దుల్ హుస్సేన్, యూఎస్ రీసెర్చ్ ఫెలో

వరుస మరణాలు




ముగ్గురు ముఖ్య ఖలిస్తాన్ అనుకూల నాయకులు నెల రోజుల్లో చనిపోవడం గమనార్హం. కేసీఎఫ్ చీఫ్ పరంజీత్ సింగ్ పంజ్‌వార్‌ను పాకిస్తాన్‌లో కాల్చేశారు. కేఎల్‌ఎఫ్ చీఫ్ అవతార్ సింగ్ ఖాండా హాస్పిటల్లో చనిపోయారు. ఇప్పుడు కేటీఎఫ్ చీఫ్ హర్‌దీప్ నజ్జర్‌ను కెనడాలో కాల్చేశారు.
– పర్తీక్ సింగ్ మహల్, పాత్రికేయుడు

గొప్ప సేవ



తక్కువ ధరకు దాదాపు 42 కోట్ల కాపీల ధార్మిక పుస్తకాలను ప్రచురించి 'గీతా ప్రెస్' హిందూ ధర్మానికి ఎవరూ చేయనంత సేవ చేసింది. దానికి గాంధీ శాంతి బహుమతిని ఇవ్వడాన్ని విమర్శిస్తున్న రాజకీయ పార్టీలు హిందూ ద్రోహులు.
– ఎన్.సి.ఆస్థానా, మాజీ ఐపీఎస్ అధికారి

గొంతెత్తుదాం!



లైంగిక హింసను ఒక యుద్ధ ఆయుధంగా వాడటం అనేది దురదృష్టవశాత్తూ విస్తృతంగా వ్యాప్తిలో ఉన్న వాస్తవం. ఈ సిగ్గుచేటు నేరాన్ని తప్పనిసరిగా నిరసించాలి. యుద్ధం వద్దు, హింస వద్దు అని చెప్పే విషయంలో మనం ఎప్పటికీ అలసి పోకూడదు.
– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

విస్తృతమౌతున్న వైద్య విద్య

ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యారంగం అభివృద్ధికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేస్తోంది. 2023–24 విద్యాసంవత్సరానికి కొత్తగా ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు సాధించింది. దీంతో ఈ ఏడాది నుంచి 750 ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామన్న ముఖ్యమంత్రి మాట వాస్తవ రూపం దాలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ రీజియన్లలో వైద్య కళాశాలలు మాత్రమే మిగిలాయి.


ప్రస్తుతం రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేటు, రెండు మైనారిటీ, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఉన్నాయి. వీటిలో 5,360 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 2,185 సీట్లు 11 ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించినవి. ఈ విద్యా సంవత్సరం నుంచి విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలల్లో కొత్తగా నిర్మించిన 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభం కానున్నాయి. వీటిలో ఒక్కో కాలేజీలో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఇది విద్యార్థులకు వరమే. వీటితో కలుపుకొంటే ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు 2,935కు పెరుగుతాయి. వీటిలో 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలినవి రాష్ట్ర కోటాలో భర్తీ చేస్తారు. మరోవైపు గత ఏడాది నుంచి బీ కేటగిరిలో 85 శాతం సీట్లలో మన విద్యార్థులకే ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్యనూ, వైద్య సదుపాయాలనూ అందరికీ అందుబాటులోకి తీసుకుపోవాలనే ప్రభుత్వ లక్ష్యం ఇప్పటికే 80 శాతం వరకు నెరవేరింది. రానున్న కాలంలో నూటికి నూరుశాతం నెరవేరేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. ఇదే ఏడాది నుంచి పీజీ సీట్లు 1,668 వరకు భారీగా పెరగడంతో ఉన్నత వైద్య విద్యను అభ్యసించాలనుకునే యువత ఆకాంక్షలకు ప్రభుత్వం మరింత ఊతమిచ్చినట్లయింది.

– జి. యోగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్

మరింత ముందుచూపుతో కార్యాచరణ

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

తుఫాన్లు అంటే ఆపలేము కానీ, అవి తెచ్చే నష్టాన్ని ముందస్తు ప్రణాళికతో ఎంతో కొంత మేర తగ్గించవచ్చు. ఏపీ ప్రభుత్వం 2022 గోదావరి వరద నష్టం అనుభవంతో ఈ ఏడాది మే నెలలోనే అందుకు సంబంధించిన ముందస్తు కార్యాచరణతో సిద్ధమయింది. గత ఏడాది దీని తీవ్రత దుష్పరిణామాలు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టిలోకి రావడంతో, ముందుగా ఇటువంటి అప్రమత్తత ఇప్పుడు సాధ్యమయింది. గత ఏడాది జులై 25–26 తేదీల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వర్షం ముసురు మధ్య తాడేపల్లి నుంచి బయల్దేరి గోదావరి పరీవాహక ప్రాంతాలకు చేరుకున్నారు. ఆయన అక్కడ రాత్రి బసకు సిద్ధపడి వెళ్లడంతో అందుకు తగినట్టుగా అప్పట్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు సీఎం పర్యటన 'ప్లాన్' చేశారు.

దాంతో కోనసీమ జిల్లాల్లో ముంపు గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలు, విభజన తర్వాత భద్రాచలం డివిజన్ నుంచి ఏపీలో కలిసిన గ్రామాల్లోనూ రోడ్డు మార్గం లేనిచోట 'పంటు' మీద వెళుతూ; మోకాళ్లలోతు బురదలో ఆయన బాధితుల్ని పరామర్శిస్తూ ఊరూరా తిరిగారు. అప్పట్లో– కొన్ని గ్రామాలకు 'మొదటిసారి వచ్చిన ముఖ్యమంత్రి' అంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఎందుకీ గతం అంటే, గతం నుంచి ఈ 'సీజన్' నాటికి మనం నేర్చుకున్న పాఠం ఏమిటి అనే సమీక్ష కోసం. పరిపాలనలో సూక్ష్మం తెలిసిన అధికారుల బృందం ప్రభుత్వాధినేతకు తోడుగా ఉన్నప్పుడు – 'లీడర్' వారి సలహాలు విన్నప్పుడు, ఆ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ప్రజలకు మేలు కలుగుతుంది.

సీఎంఓలో వేర్వేరు శాఖల కార్యకలాపాలను చూసే కార్యదర్శి సందర్భాన్ని బట్టి తన వెంట క్షేత్ర పర్యటనలో ఉండేలా ముఖ్యమంత్రి జగన్ మొదటి నుంచి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సీఎంఓ సెక్రెటరీలకు క్షేత్రస్థాయి పర్యటన సమయంలో తమ అధికారిక విధులు తప్ప రాజకీయపరమైన– 'ఎసైన్మెంట్స్' ఇప్పుడు ఉండడం లేదు. దాంతో– వారు 'క్యాంప్' నుంచి తిరిగి రాగానే, ముఖ్యమంత్రి – 'ఫీల్డ్ నోట్స్' యధాతథంగా జీఓలుగా మారి, అమలులోకి వస్తున్నాయి. దీనివల్ల తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతూ పరిపాలనలో సాంద్రత (ఇంటెన్సిటీ) బాగా పెరుగుతోంది. అయినా నాయకులు తమ అంత



ర్యాన్ని ఇదమిత్థంగా పైకి చెప్పకపోయినా వారి 'మోటివ్స్'ను పసిగట్టే సహజ లక్షణం– 'బ్యూరోక్రసీ'కి ఎక్కువ. నాయకుల అంతర్యాల్లో ఉండే స్వచ్ఛతను బట్టి వారి పనితీరు ఉంటుంది.

పైకి మనకు చెప్పకపోవచ్చు గానీ, నాన్న 'డైరీ' నుంచి జగన్ మోహన్ రెడ్డి– 'డూస్' అండ్ 'డోంట్స్' ముందే నేర్చుకుని ఉండవచ్చు. ఎందుకీ మాట అనడం అంటే – నాలుగేళ్లలో ఇన్ని విధానపరమైన నిర్ణయాలు అమలులోకి రావడం కష్టం. మునుపటికి భిన్నమైన 'మెకానిజం' ఏదో అక్కడ అమలులో ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. అలాగని అన్నీ మనకు తెలియాల్సిన అవసరం కూడా లేదు. నిజానికి ఇప్పటి యువ రాజకీయ నాయకులు ఇటువంటివి కూడా పట్టించుకుంటున్నారా?! అని విస్తుపోయే నిర్ణయమిది.

ఈ నెలలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో 'నాడు–నేడు' కార్యక్రమం అమలు పూర్తి అయిన 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 'నైట్ వాచ్‌మెన్' పోస్టులు మంజూరు చేయడాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించాలి. సూక్ష్మ స్థాయి విషయాల లోతుల్లోకి వెళ్లి మరీ ఈ ప్రభుత్వం ఎంతగా 'ఇన్వాల్వ్' అవుతున్నదీ ఇది స్పష్టం చేస్తున్నది. చానాళ్లుగా ఈ తరహా పోస్టుల్లో పనిచేసేవారు 'రిటైర్' అయితే, తిరిగి వాటిని భర్తీ చేయడం లేదు. ఇప్పుడు తీసుకున్న ఈ నిర్ణయంతో ఇన్నాళ్లూ చీకటిపడితే, అనాథల్లా కనిపించే ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణాలకు మళ్ళీ పచ్చని చెట్లతో భద్రతతో కొత్త కళ వస్తుంది.

అటువంటిదే ఇది కూడా – 2022 జులైలో గోదావరికి 40 ఏళ్ల తర్వాత మళ్ళీ ఇంత వరద వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. రోజులు తరబడి వరద కనుక తగ్గకపోతే, గ్రామస్థులు ఉగ్ర గోదావరి దాటి వెళ్లి తమ పశువులకు గడ్డి తీసుకుని రావాల్సి ఉంటుంది, అది ప్రమాదంతో కూడుకున్న పని. కోనసీమ జిల్లాలోని 18 మండలాల్లో, ముంపునకు గురయ్యే లంకల్లో 65,774 పశువులు ఉన్నాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి మే నెల 15 నాటికే రెవెన్యూ – పశుగణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 463 మెట్రిక్ టన్నుల ఎండుగడ్డి సేకరించాయి. ఇందుకోసం చాలామంది రైతులు తమవద్ద ఉన్న గడ్డిని ఉచితంగా కూడా ఇస్తున్నారు అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. కాగా ఇప్పుడు ముందే అక్కడ గడ్డిపెడితే మంచిదని, ముంపునకు గురయ్యే లంక గ్రామాలకు ఈ 'స్టాకు' తరలిస్తున్నారు.

వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

దైవ ప్రార్థన

ఒక శిష్యుడు రామకృష్ణ పరమహంసను భగవంతుడి మీద మనసు ఎలా లగ్నం చెయ్యాలని ప్రశ్నించాడు. దానికాయన ఇలా చెప్పారు:

''ఎల్లప్పుడూ భగవన్నామ సంకీర్తనం, సత్సంగం చేస్తుండాలి. రాత్రి పగలు సంసారంలో మునిగిపోతే భగవంతుడి మీద మనసు లగ్నం కాదు. అప్పుడప్పుడూ ఏకాంత ప్రాంతాలకు వెళ్ళాలి. మొదట్లో భగవంతుడి మీద మనసు లగ్నం చేయడం కష్టమౌతుంది. మొక్క లేతగా ఉన్నప్పుడే చుట్టూ కంచె వేసి ఆవులు, మేకలు తినకుండా కాపాడినట్టు ఏకాంతమనే కంచె వేసి సాధన చేయాలి.

భగవంతుడొక్కడే సత్యమనీ (నిత్య వస్తువు), తక్కినదంతా అసత్యమనీ (అనిత్యం) విభజిస్తూ అనిత్య వస్తువుల నుండి మనస్సును దూరంగా ఉంచాలి.

ధనవంతుల ఇంట్లో పనిమనిషి పని చేస్తున్నా మనసు మాత్రం తన ఇంటి మీదనే ఉంచుకున్నట్టు, యజమాని పిల్లలను తన పిల్లల్లాగా పెంచుతున్నప్పటికీ తన బిడ్డలు కారని అనుకున్నట్టుగానే మనుషులు రోజు వారీ పనులను చేస్తూనే భగవంతుని ధ్యానిస్తుండాలి.



జ్యోతిర్మయం

భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ఉంటూనే, దేవుడు తప్ప మరెవ్వరూ తనవాళ్లు కాదని గుర్తించాలి. తాబేలు నీటిలో తిరుగాడుతున్నప్పటికీ ధ్యాసను గట్టు మీద పెట్టిన గుడ్ల మీదనే ఉంచుకున్నట్టు మనుషులు దేవుడి మీద మనసు నిలపాలి.

చేతికి నూనె రాసుకుని పనస తొనలను ఒలవకపోతే చేతికి జిగురు అంటుకున్నట్టే భగవంతుని పట్ల భక్తి రూపమైన నూనె రాసుకున్న తర్వాతనే సంసారంలో దిగాలి. లేదంటే సంసార వాసనలు పట్టి పీడిస్తాయి.

వెన్నను తీయాలంటే పాలను తోడు పెట్టి ఒక చోట ఉంచాలి. మాటిమాటికీ కలుపుతుంటే పెరుగు తోడు కోదు. తగినంత సమయమిచ్చిన తరువాతే పెరుగును చిలకాలి. అప్పుడే వెన్న దొరుకుతుంది. అట్లాగే దైవ ప్రార్థనకి కూడా తగినంత సమయం కేటాయించినప్పుడే భక్తి భావం కలుగుతుంది.

సంసారం నీళ్ల వంటిది. మనసు పాలవంటిది. పాలను నీళ్లలో పోస్తే పాలు, నీళ్లు కలిసి ఏకమైపోతాయి. అప్పుడు పాలను వేరు చేయలేము. అదే పాలను తోడుపెట్టి, పెరుగు చిలికి, వెన్న తీసి, ఆ వెన్నను నీళ్లలో వేస్తే అప్పుడు వెన్న తేలుతుంది. అలాగే ఏకాంత ప్రాంతంలో సాధన చేసినప్పుడే భక్తి జ్ఞానమనే వెన్నను పొందగలుగుతారు. ఆ వెన్నను సంసారమనే నేలలో జారవిడిచినా కలిసి పోదు. తేలుతుంది.'' ఇలా దేవుడి మీద మనస్సు ఎలా లగ్నం చేయాలో చెప్పారు రామకృష్ణ పరమహంస.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు. విదియ ఉ.11.08 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పునర్వసు రా.9.21 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.8.15 నుండి 10.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.56 వరకు తదుపరి రా.10.54 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** సా.6.44 నుండి 8.27 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

19 ఏళ్ల నాటి సమస్యకు స్పందనలో పరిష్కారం

రైతుకు పంట నష్ట పరిహారం చెక్కును అందజేసిన కలెక్టర్



రైతుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): పంట నష్టపరిహారం కోసం గత 19 ఏళ్లుగా ప్రభుత్వాలను వేడుకుంటున్న రైతుకు స్పందన కార్యక్రమంలో పరిష్కారం లభించింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు.. రైతు భోగిరెడ్డి బసవపూర్ణయ్యకు రూ.15 వేలు నష్టపరిహారం చెక్కును అందజేశారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కోసూరివారిపాలేనికి చెందిన భోగిరెడ్డి బసవపూర్ణయ్య 2004లో ఆరు ఎకరాల్లో బంగాళదుంప, కాకర పందిరి, వంగ వంటి పంటలు వేశారు. భారీ వర్షాలకు పంట దెబ్బతినగా నష్టపరిహారం ఇవ్వాలని ఉద్యాన శాఖ, కలెక్టర్లకు విన్నవించారు. అప్పటి నుంచి పలుమార్లు అర్జీ ఇచ్చినా ఫలితం లేకపోయింది. సోమవారం మరోసారి కలెక్టర్ రాజాబాబును కలిసి స్పందనలో అర్జీ ఇచ్చారు. మానవత్వంతో దీనిని ప్రత్యేక విషయంగా పరిగణించి చెక్కును బాధిత రైతు కుటుంబానికి అందజేశారు.

పడిపోయిన 'జీడి' ధర

ఉత్పత్తి పెరగడమే కారణం

కేజీకి రూ.100 వరకూ తగ్గిన జీడి పప్పు ధర

అయోమయంలో వ్యాపారులు, రైతులు



పరిశ్రమలో పప్పు తయారు చేస్తున్న కార్మికులు



ఉయ్యూరివారి మెరకలో ఆర బెట్టిన జీడి గింజలు

మలికిపురం: జీడి గింజల ధర భారీగా పతనమైంది. జీడి పప్పు ధర కూడా కేజీకి రూ.100 వరకూ పడిపోయింది. దీంతో వ్యాపారులు, రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రాజోలు, నరసాపురం నియోజకవర్గాల్లోని సముద్ర తీరంలో జీడిమామిడి సాగు జరుగుతోంది. ఇక్కడ గింజల ఉత్పత్తి చాలా తక్కువే. అయినప్పటికీ... మలికిపురం మండలం మోరి గ్రామంలో తయారయ్యే జీడి పప్పు ప్రసిద్ధి పొందింది. ఇక్కడి జీడి పప్పు పరిశ్రమకు విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఏజెన్సీ, తెలంగాణ నుంచి కూడా జీడి గింజల దిగుమతి అవుతాయి.

దిగుబడి పెరగడమే కారణం

ఈ ఏడాది జీడి గింజల ఉత్పత్తి అధికంగా ఉండటమే ధర పతనానికి ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. జీడి తోటలు కాపు మీద ఉన్న సమయంలో అదనంగా వర్షాలు కురిశాయి. దీంతో మరోసారి పూత పూసి, జీడి గింజల ఉత్పత్తి పెరిగింది. ఫలితంగా గత ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి కావాల్సిన జీడి గింజల ఉత్పత్తి జూన్‌లో కూడా కొనసాగుతోంది. దీంతో ధర పతనమైంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో రైతుల వద్ద 80 కేజీల జీడి గింజల బస్తాను వ్యాపారులు రూ.9,500కు కొనుగోలు చేశారు. ఈ ధర మే నాటికి రూ.7,500కు తగ్గింది. పంట చివరి దశ కావడంతో ధర తగ్గడం సాధారణమే అనుకున్నారు. కానీ.. జీడిచెట్లకు మరోసారి పూత రావడంతో మళ్లీ గింజలు ఉత్పత్తి అయ్యాయి. ప్రస్తుతం 80 కేజీల జీడి గింజల బస్తా రూ.5 వేలకే లభిస్తోంది. ఇందులో నాణ్యత తక్కువగా ఉండే చివరి రకం జీడి గింజలు రూ.3,500కు కూడా లభిస్తున్నాయి.

పేరుకుపోయిన నిల్వలు

ఈ కారణంగా జీడి పప్పు ధర కూడా గణనీయంగా పడిపోయింది. గత ఏప్రిల్, మే నెలల్లో కేజీ జీడి పప్పు ధర రూ.650 ఉండగా.. ప్రస్తుతం రూ.550కి పడిపోయింది. సంప్రదాయ రీతిలో కాల్చి తయారు చేసిన జీడి పప్పు ధర ఇలా ఉండగా.. ఫ్యాక్టరీల్లో తయారవుతున్న బాయిల్డ్ జీడి పప్పు ధర మరింత దారుణంగా ఏకంగా రూ.450కి తగ్గిపోయింది. సీజన్ మొదలైనప్పుడు ఎక్కువ ధరకు గింజలు కొనుగోలు చేసిన వ్యాపారులు.. తక్కువ ధరకు జీడి పప్పు అమ్మాల్సి రావడంతో ఉత్పత్తి నిలిపివేశారు. ధర లేక, కొనుగోలు చేసి గింజల నుంచి పప్పు ఉత్పత్తి నిలిపివేయడంతో వ్యాపారుల వద్ద.. ఉత్పత్తి పెరిగి, అమ్మకాలు తగ్గడంతో రైతుల వద్ద భారీ స్థాయిలో గింజలు పేరుకుపోయాయి. దీనికితోడు ప్రస్తుతం ఆషాఢం, శూన్య మాసాలు కావడంతో శుభకార్యాలు లేక జీడి పప్పు వినియోగం కూడా తగ్గింది. అన్ సీజన్ మరో రెండు నెలలు కొనసాగనుంది.

ఉత్పత్తి మానేశాం



ధర పడిపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. గత ఏప్రిల్‌లో 80 కేజీల జీడి గింజల బస్తా రూ.9,500కు కొన్నాం. అప్పట్లో చాలా సరకు నిల్వ చేశాం. ఇప్పుడు రూ.3,500కు కూడా లభిస్తోంది. దీంతో ఉత్పత్తి మానేశాం.

– కొడవటి ప్రసాద్, వ్యాపారి, మోరిపోడు

ధర నిలకడ లేదు



వర్షాలు అధికంగా కురిసి మరోసారి పూత రావడంతో ఈ ఏడాది గింజల ఉత్పత్తి పెరిగింది. ఫలితంగా ధర పడిపోయింది. ఈ సమయంలో పప్పు ఉత్పత్తి చేసి విక్రయించలేం. పైగా రెండు నెలలు శుభకార్యాలుండవు. దీంతో అమ్మకాలు కూడా ఉండవు.

– ముప్పర్తి నాని, జీడి గింజల దిగుమతిదారు, మోరిపోడు

ఎల్లో మీడియా సహకారంతో బాబు కుటిల పన్నాగాలు

995వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మోసం చేసేందుకు బాబు ఎల్లో మీడియా సహకారంతో కుటిల పన్నాగాలు పన్నుతూ తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 995వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో 3.50 కోట్ల ఓటు బ్యాంకు ఉన్న బహుజనులను అన్ని విధాలుగా మోసం చేస్తున్న బాబును రాజకీయాల నుంచి శాశ్వతంగా తరిమికొడతామని హెచ్చరించారు. అమరావతి పేరుతో రూ. 3.50 లక్షల కోట్ల అవినీతికి పాల్పడి, 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతున్న బాబును వెంటనే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. రెండు చోట్ల పోటీ చేసి గెలవలేని పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిని అవుతానని చెబుతుండడం హాస్యాస్పదమని, ఎన్నికల్లో బాబుకు లబ్ధి చేకూర్చాలనే ఏకైక లక్ష్యంతో ఆయన చేస్తున్న వారాహి యాత్ర అట్టర్ ఫ్లాప్ కావడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, కులిడి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇంజనీరింగ్ టెస్ట్' దరఖాస్తు గడువు పెంపు

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాల కోసం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఏఎన్‌యూ ఇంజనీరింగ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించామని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం సోమవారంతో గడువు ముగిసిందని, విద్యార్థుల వినతి మేరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. రూ.750 ఆలస్య రుసుముతో జూలై 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె సోమవారం వెల్లడించారు.

హాస్టల్ విద్యార్థినిపై టీడీపీ కార్యకర్త అఘాయిత్యం

- మద్యం తాగించి లైంగిక దాడి
- నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు..
- వార్డెన్ సస్పెన్షన్



ఆవుల సతీష్

మచిలీపట్నం (కోనేరు సెంటర్): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో టీడీపీ కార్యకర్త హాస్టల్ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ప్రేమ పేరుతో బాలికను పిలిచి.. ఆపై మద్యం తాగించి లైంగిక దాడికి తెగబడ్డాడు. అనంతరం మత్తులో ఉన్న ఆమెను ద్విచక్ర వాహనంపై వసతి గృహం వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో ఉన్న బాధితురాలి ప్రవర్తనపై అనుమానం వచ్చిన హాస్టల్ సిబ్బంది చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా జరిగిన ఘోరం బయటికి పొక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక మచిలీపట్నంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నాలుగు నెలల క్రితం మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామానికి చెందిన ఆవుల సతీష్ అనే టీడీపీ కార్యకర్త ఆమెను పరిచయం చేసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రేమలో దింపాడు. నాలుగు నెలలుగా యువతిని కళాశాలకు వెళ్లే సమయాల్లో కలుస్తుండటంతో పాటు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. కాగా.. ఈ నెల 18వ తేదీన సతీష్ ఆ బాలికకు ఫోన్ చేసి ఓసారి కలవాలని చెప్పాడు. అందుకు ఆమె సరేనంది. ఆదివారం భోజనం చేసిన అనంతరం సదరు యువతి హాస్టల్ వార్డెన్‌కు తెలియకుండా బయటికి వెళ్లింది. సతీష్ ఆమెను నగరంలోని విజయ రాఘవ లాడ్జికి తీసుకురమ్మని తన స్నేహితుడైన కళ్యాణ్‌కు బైక్ ఇచ్చి పంపాడు. సతీష్ చెప్పిన విధంగా కళ్యాణ్ రామానాయుడుపేట సెంటర్‌లో యువతిని బండి ఎక్కించుకుని లాడ్జి వద్ద దింపాడు. యువతి సతీష్ ఉన్న రూంలోకి వెళ్లింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సతీష్ యువతికి బలవంతంగా మద్యం తాగించాడు. దీంతో యువతి స్పృహ కోల్పోగా.. సతీష్ ఆమెను వివస్త్రను చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను బైక్‌పై హాస్టల్ వద్ద దింపి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో ఉన్న యువతి ప్రవర్తన వింతగా ఉండటం గమనించిన హాస్టల్ వార్డెన్ ఇతర సిబ్బంది సమీపంలోని సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్య సిబ్బంది ఆమెపై లైంగికదాడి జరిగినట్టు నిర్ధారించటంతో వార్డెన్ యువతిని మందలించింది. మద్యం మత్తు వీడిన అనంతరం విషయం తెలుసుకున్న యువతి సతీష్ తనకు బలవంతంగా తాగించి ఆపై లైంగిక దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు అందుకున్న సీఐ రవికుమార్ మచిలీపట్నం ఎస్సై వి.వెంకటేశ్వరరావు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. కాగా, సతీష్ స్నేహితులైన కళ్యాణ్, మణికంఠ ఆ బాలికను అర్ధనగ్నంగా సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీసినట్టు తెలుసుకున్న పోలీసులు వారిపైనా చర్యలకు ఉపక్రమించనున్నారు. సమాచారం అందుకున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సాహిద్‌బాబు వసతి గృహానికి చేరుకుని ఘటనపై విచారణ జరిపారు. యువతి హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన క్రమంలో అందుకు బాధ్యురాలిని చేస్తూ వార్డెన్ మల్లేశ్వరిని సస్పెండ్ చేసినట్టు డీడీ తెలిపారు.

ఆయిల్‌పామ్ గెలలకు గిట్టుబాటు ధర కల్పించండి

కేంద్రమంత్రి తోమర్‌కు ఆయిల్‌పామ్ రైతుల సంఘం వినతి



కేంద్ర మంత్రి తోమర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఆయిల్ ఫెడ్ చైర్మన్ చవల బాబూరావు తదితరులు

సాక్షి, అమరావతి: ఆయిల్ పామ్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని జాతీయ ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ సంఘం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రిని సంఘం జాతీయ అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు, ప్రధాన కార్యదర్శి కె.క్రాంతికుమార్‌రెడ్డి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు క్రూడ్ పామాయిల్‌పై తిరిగి ఇంపోర్ట్ డ్యూటీ విధించాలని కోరారు. 2022 మే నెలలో టన్ను రూ.1.45 లక్షలున్న క్రూడ్ పామాయిల్ ధర సెప్టెంబర్ నాటికి రూ.74 వేలకు పడిపోయిందని, దీంతో ఆయిల్‌పామ్ గెలల ధర టన్ను రూ.23,635 నుంచి రూ.13 వేలకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. క్రూడ్ పామాయిల్ ధర కనీసం టన్నుకు రూ.1.20 లక్షలకు తగ్గకుండా ఉండేలా ఇంపోర్ట్ డ్యూటీ విధించాలన్నారు.

'ఆయిల్‌పామ్ ప్లాంట్‌కు చేయూత ఇవ్వండి'

ఏపీ ఆయిల్ ఫెడ్‌ద్వారా ఏర్పాటు చేయతలపెట్టిన మోడరన్ న్యూ పామాయిల్ మిల్, ఎఫ్లూయింట్ హ్యాండలింగ్ ప్లాంట్‌కు ఆర్థిక చేయూత ఇవ్వాలని ఆయిల్‌ఫెడ్ ఎండీ చవల బాబూరావు కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు విజ్ఞప్తి చేశారు. 2009లో పెదవేగిలో ఏర్పాటు చేసిన ప్లాంట్ సామర్థ్యం తగ్గిపోయినందువలన నూతన ప్లాంట్ నిర్మించాలని సంకల్పించామన్నారు. కనీసం రూ.200 కోట్లకు పైగా ఖర్చవుతున్న ఈ ప్లాంట్‌కు నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌పామ్(ఎన్ఎంఈఓ–ఓపీ) కింద గ్రాంట్ రూపంలో మంజూరు చేయాలని కోరారు.

ఎంపీ భరత్‌కు ఇండో అరబ్ ఎక్సలెన్స్ అవార్డ్



అవార్డు స్వీకరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సా ర్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భర త్‌రామ్‌కు ఇండో అరబ్ ఇంటర్నే షనల్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించింది. దుబాయ్‌లో ని వరల్డ్ ట్రేడ్ సెంటర్ లో సోమవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జీ–20 ఇండి యా ప్రెసిడెన్సీ సెలబ్రేషన్స్‌లో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదు గా ఎంపీ భరత్‌కు ఈ అవార్డ్‌ను అందజేశారు. యువతా హరితా, గో గ్రీన్ చా లెంజ్ పేరుతో ఎంపీ భరత్‌రామ్ పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని గు ర్తించి ఈ అవార్డ్‌ను ప్రదానం చేసినట్లు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ తెలిపింది. ప్రతిష్టాత్మకమైన ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు రావడంపై ఎంపీ భరత్ సంతోషం వ్యక్తంచేశారు. ఈ అవార్డును రాజమహేంద్రవరం వి ద్యార్థులు, విద్యా సంస్థల యాజమాన్యాలకు అంకితమిస్తున్నానని తెలిపారు.

గుంటూరు వైద్య కళాశాల ప్రాంగణంలో బుల్లెట్లు!

గుంటూరు ఈస్ట్: గుంటూరు వైద్య కళాశాలలో తుపాకీ బుల్లెట్లు ప్రత్యక్షమవడం కలకలం రేపింది. పిస్టల్‌లో ఉండాల్సిన బుల్లెట్లు వైద్య కళాశాల ప్రాంగణంలో దొరకడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే .. ఆదివారం రాత్రి వైద్య కళాశాల ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి 5 బుల్లెట్లు కనిపించాయి. వారు వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ బుల్లెట్లు స్వాధీనం చేసుకుని జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి సోమవారం కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. బుల్లెట్లు ఎక్కడ దొరికింది ఆరా తీశారు. అయితే ప్రొఫెసర్ శశికాంత్ ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన పిస్టల్ కలిగి ఉన్నాడని తెలుసుకున్నారు. దీంతో బుల్లెట్లను ప్రొఫెసర్ శశికాంత్‌కు ఇచ్చివేశారు. అయితే పిస్టల్‌లో ఉండాల్సిన బుల్లెట్లు గది బయట ఎందుకున్నాయని అనేదానిపై పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు.

భారతనౌక ఐఎన్ఎస్ శివాలిక్‌లో ఓషన్ రింగ్ ఆఫ్ యోగా ప్రదర్శన



ఐఎన్ఎస్ శివాలిక్ నౌకపై యోగాసనాలు వేస్తున్న నేవీ ఉద్యోగులు

సింథియా: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇండోనేషియాలోని జకార్తాలో ఉన్న ఐఎన్ఎస్ శివాలిక్ నౌక వద్ద యోగాను నిర్వహించారు. ఓషన్ రింగ్ ఆఫ్ యోగా పేరుతో భారతీయ ప్రవాసులు, ఇండోనేషియాలోని నేవీ సిబ్బంది, ఇండియన్ ఎంబసీ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక పౌరులు ఉత్సాహంగా పాల్గొని యోగాను ప్రదర్శించారు. యోగాపై అవగాహన కలిగించడంతో పాటు ఆరోగ్యవంతమైన శరీరం, మనస్సు ప్రశాంతంగా ఉండడంలో యోగా ప్రముఖ పాత్ర వహిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

'మిషన్ ఫర్ లైఫ్' నినాదంతో పని చేస్తున్నాం

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : 'మిషన్ ఫర్ లైఫ్ ' నినాదంతో భారతదేశపు పర్యాటక రంగాన్ని ప్రపంచంలో అత్యుత్తమ పర్యాటక దేశంలో మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను రీయూజ్, రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణానికి మరింత హాని కాకుండా కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. గోవాలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న జీ20 పర్యాటక మంత్రుల స్థాయి సమావేశాల సైడ్ ఈవెంట్ సందర్భంగా 'మేకింగ్ సస్టేనబుల్ క్రూయిజ్ టూరిజం మోడల్ ఫర్ సస్టేనబుల్ అండ్ రెస్పాన్సిబుల్ ట్రావెల్', 'టువర్డ్స్ ఎ సర్క్యులర్ ఎకానమీ ఆఫ్ ప్లాస్టిక్ ఇన్ టూరిజం –ద గ్లోబల్ టూరిజం ప్లాస్టిక్ ఇనిషియేటివ్' అంశాలపై జరిగిన రెండు వేర్వేరు చర్చలను కేంద్రమంత్రి సోమవారం ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో పర్యాటకాభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలను, మరీ ముఖ్యంగా అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షిస్తున్న క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో క్రూయిజ్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం ఓమన్ పర్యాటక మంత్రి సలీమ్ బిన్ మహమ్మద్, ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ సెక్రటరీ జనరల్ జురాబ్ పోలోలీక్విలీతో ద్వైపాక్షిక సమావేశాల్లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'చేప'ట్టాల్సిందే..

మృగశిర కార్తెలో 'మీనం' దివ్యౌషధం

- వాతావరణ మార్పులతో రోగ నిరోధక శక్తిపై ప్రభావం
- చేపల ఆహారం తింటే పెరుగుదల
- గోదారి సీమలో దొరికే చేపలకు, ఆ కూరలకు ప్రత్యేక గుర్తింపు





చందువా వేపుడు

సాక్షి, అమలాపురం: భారతీయ సంప్రదాయం ప్రకారం ఒక్కో కార్తెలో ఒక్కో రకం ఆహారం తీసుకోవడం ఆనవాయితీ. ఇటువంటి ఆహారపు అలవాట్లు ప్రకృతిలో జరిగే మార్పులకు అనుగుణంగా ఆరోగ్యానికి మేలు చేసేవి కావడం విశేషం. ఒక్కో మాసంలో ఒక్కో రకం ఆహారం తీసుకోవడం గోదావరి వాసులకు సంప్రదాయంగా, ఆనవాయితీగా వస్తోంది. వీటిలో పండ్లు, కూరగాయల వంటి శాకాహారమే కాదు. చేపల వంటి మాంసాహారాలు కూడా ఉన్నాయి. ప్రస్తుత మృగశిర కార్తెలో చేపలు ఆహారంగా తీసుకోవడం కూడా ఈ ఆనవాయితీల్లో ఒకటి.

మృగశిర కార్తె రోజుల్లో చేపలు తినడం ఆరోగ్యానికి మేలని నమ్మకం. రోళ్లు పగిలే స్థాయిలో ఎండలను మోసుకొచ్చిన రోహిణీ కార్తె ముగిసిన వెంటనే మృగశిర మొదలవుతుంది. తొలకరి వర్షాలు ఆరంభమవుతాయి. ఈ క్రమంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఫలితంగా అనేక హానికర సూక్ష్మ క్రిముల వంటివి ఉత్పత్తి అవుతాయి. ఇటువంటి వాతావరణంలో రోగ నిరోధక శక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. చేపలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఇటువంటి అనారోగ్యాల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా కూడా నిరూపితమైంది. ఈ సీజన్‌లోనే హైదరాబాద్‌లో బత్తిని గౌడ్ సోదరులు 'చేప ప్రసాదం' ఇస్తుంటారు. దీనివల్ల ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయని విశ్వసిస్తారు.

చేపలు.. కోకొల్లలు

మాంసాహారులకు కార్తెతో సంబంధం లేదు. ఏడాది పొడవునా చేపలను ఆహారంగా తీసుకుంటారు. గోదావరి జిల్లాల్లో కూడా చేపలకు కొదవే లేదు. విస్తారమైన సముద్రం, అఖండ గోదావరితో పాటు నదీపాయలు, డెల్టా పంట కాలువలు, పల్లపుభూములు, మెట్టలో సాగునీటి చెరువులు, ప్రాజెక్టులు.. ఏజెన్సీని ఆనుకుని ఉండే సహజసిద్ధమైన చెరువులు (ఆవలు).. ఆపై వేలాది ఎకరాల్లో చేపల సాగు.. ఇలా ఎటు చూసినా రకరకాల చేపలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. కొన్ని రకాల చేపలు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతూ ఉంటాయి.

రుచిలో మిన్న.. గోదారి చేప

నెల్లూరు అంటే కేవలం చేపల పులుసు మాత్రమే గుర్తుకు వస్తుంది. అదే గోదారి జిల్లాలంటే పులస చేపల పులుసు ఒక్కటే కాదు.. ఇక్కడ దొరికే రకరకాల చేపలు.. వాటితో తయారు చేసే రకరకాల వంటలు గుర్తుకొస్తాయి. గోదావరి నీటి మాహాత్మ్యమో.. లేక వండటంలో గొప్పతనమో చెప్పలేం కానీ గోదావరి చేప కూరలు తినాల్సిందేనని మాంసాహార ప్రియులు లొట్టలు వేసుకుంటూ చెబుతారు. చందువా వేపుడు, పండుగొప్ప ఇగురు, కొర్రమేను కూర, కొయ్యింగల పులుసు, గుమ్మడి చుక్క, కోన చేపల డీప్ ఫ్రై వంటివి తింటే జిహ్వ వహ్వా అనాల్సిందే. పెద్ద చేపల్లోనే కాదు.. చిన్న వాటిల్లో పచ్చి మెత్తళ్ల మామిడి, ఎండు మెత్తళ్ల వేపుడు, కట్టి చేపలు, బొమ్మిడాయిల పులుసు, రామల ఇగురు, చింతకాయ చిన్న చేపలు, చీరమేను కూరలకు ఫిదా కాని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఈ చేపలతో పులుసులు, కూరలు, ఇగురులు, వేపుళ్ల వంటివి చేయడంలో గోదావరి వాసులు సిద్ధహస్తులు. ఇక ఉప్పు చేప పప్పుచారు, ఆర్చిన చేప ఇగురు, టమాటా రసం తినాలే కానీ వర్ణించేందుకు మాటలు చాలవు. ఇవే కాదు జెల్లలు, మాతలు, గొరకలు, బొచ్చు, శీలావతి, మోసు, గోదావరి ఎర్రమోసు, వంజరం, గులిగింతలు, మట్టకరస ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రకాలు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి నగరాల్లో నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు ఒక్కటే కాదు.. గోదారోళ్ల చేపల పులుసు, గోదావరి చేపల కూరల పేరుతో రెస్టారెంట్లు కూడా వెలిశాయంటే ఇక్కడ వండే రకాలకు ఉన్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు.



ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

చేపలతో ఎన్నో రకాలుగా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చేపల్లో ఉండే ప్రొటీన్ సులువుగా అరిగిపోతుంది. వృద్ధాప్యంలో సహజసిద్ధంగా వచ్చే రుగ్మతలు చాలా వరకూ దూరమవుతాయి. సహజసిద్ధంగా పెరిగే చేపల్లో మేలు చేసే ప్రొటీన్, ఇతర విలువలు ఉంటాయి.

– పిండి సాయిబాబు, విశ్రాంత జంతుశాస్త్ర విభాగాధిపతి, ఎస్‌కేబీఆర్ కాలేజీ, అమలాపురం

లెక్కకు మిక్కిలిగా ఔషధ గుణాలు

- చేపల్లో ఔషధ గుణాలు అపారంగా ఉంటాయి.
- ఇందులోని ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు ఆరోగ్యాన్నిస్తాయి. రక్తం గడ్డకట్టడాన్ని తగ్గిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి. గుండె జబ్బులు, ఆస్తమా తదితర అనారోగ్య సమస్యలకు అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాలని వైద్యులు చెబుతారు.
- మనిషి తన రోజువారీ కార్యకలాపాలు సాఫీగా సాగించేందుకు మెదడులో న్యూరాన్లతో కూడిన గ్రే మ్యాటర్ ఉంటుంది. చేపలు తింటే ఇది మరింత చురుకుగా పని చేస్తుంది.
- వయస్సు మీద పడుతున్న సమయంలో మెదడులోని కణాల క్షీణతను నిరోధించడానికి చేపల ఆహారం తోడ్పడుతుంది. దీనివల్ల అల్జీమర్స్ వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.
- టైప్–1 డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.
- చేపలు తింటే దృష్టి లోపాలు, అంధత్వం వంటివి తగ్గుతాయి.
- గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే స్త్రీలకు చేపలు తినడం ఎంతో మేలు.
- చిన్న పిల్లలకు సరిపడే స్థాయిలో పాలు ఇవ్వలేనప్పుడు బాలింతలకు మెత్తళ్ల కూర వండి పెట్టడం సర్వసాధారణం. అలాగే బైపాస్ ఆపరేషన్ చేయించుకున్న వారికి పచ్చి మెత్తళ్లతో పాటు, ఎండు మెత్తళ్లు, చిన్న చేపలు (చేదు చేపలు) పత్యంగా అందిస్తారు. సొరచేపల ద్వారా శృంగార సామర్థ్యం పెరుగుతుందని నిపుణులు చెబుతారు.

క్లుప్తంగా...

రూ. కోటి నగదు బహుమతి వద్దు: గీతా ప్రెస్

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లోని ప్రఖ్యాత ప్రచురణ సంస్థ గీతా ప్రెస్‌కు ప్రతిష్టాత్మక గాంధీ శాంతి బహుమతిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల రాజకీయ రగడ మొదలైంది. విపక్షాలు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బహుమతి కింద అందజేసే రూ.కోటి నగదును తాము స్వీకరించబోమని గీతా ప్రెస్ బోర్డు ట్రస్ట్ సోమవారం స్పష్టం చేసింది. 2021 సంవత్సరానికి గాను గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి ప్రకటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని వెల్లడించింది. విరాళాలు తీసుకొనే సంప్రదాయం తమ ప్రెస్‌కు లేదని, అందుకే ఈ బహుమతి కింద అందించే రూ.కోటి నగదును స్వీకరించబోమని గీతా ప్రెస్ మేనేజర్ లాల్‌మణి త్రిపాఠి పేర్కొన్నారు. బహుమతి మాత్రమే స్వీకరిస్తామని వివరించారు. ఇదిలా ఉండగా, గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన విమర్శలను వీహెచ్‌పీ ఖండించింది.

మధ్యప్రదేశ్‌లో పరువు హత్య




మొరెనా: కూతురు ప్రేమ వ్యవహారం నచ్చని ఓ తండ్రి ఘాతుకానికి ఒడిగట్టాడు. కన్నకూతురితోపాటు ఆమె ప్రియుడిని కూడా తుపాకీతో కాల్చి చంపి, మృతదేహాలను నదిలో పడేశాడు. మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. రతన్‌బసాయి గ్రామానికి చెందిన శివానీ(19), పొరుగూరు బాలుపురకు చెందిన రాధేశ్యామ్ తోమర్(21) ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీన వారిద్దరూ అదృశ్యమయ్యారు. అయితే, వారిని శివానీ తండ్రి చంపించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ రాధేశ్యామ్ తండ్రి లఖన్ తోమర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమికులు ఎటో వెళ్లిపోయి ఉంటారని పోలీసులు కూడా మొదట్లో భావించారు. అలాంటి జాడలేవీ లేకపోవడంతో శివానీ కుటుంబీకులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దారుణం వెలుగులోకి వచ్చింది. కూతురు తమ మాట విననందునే ఆమెతోపాటు, ప్రేమికుడిని చంపేసి చంబల్ నదిలో పడేసినట్లు శివానీ తండ్రి రాజ్‌పాల్ తోమర్ పోలీసు విచారణలో వెల్లడించాడు. అతడు చూపిన ప్రాంతంలో మృతదేహాల కోసం చంబల్ నదిలో గజ ఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు. నదిలో ఎక్కువగా మొసళ్లుంటాయని, మృతదేహాలు దొరికేందుకు ఆస్కారం లేదని గ్రామస్తులు అంటుండగా, మృతదేహాలు దొరికితేనే నిబంధనల ప్రకారం రాజ్‌పాల్‌పై హత్య కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

తంపులమారి చైనా

పొరుగు దేశాలతో సరిహద్దు వివాదాలు

- భూభాగాలు, దీవులు, సముద్ర జలాల విషయంలో 15 దేశాలతో కయ్యం
- భారత్‌లోని పలు కీలక భూభాగాలు తమవేనని వాదిస్తున్న డ్రాగన్ దేశం
- మధ్య యుగాల నాటి రాజుల పాలనా క్షేత్రాన్ని రుజువుగా చూపుతూ జగడాలు



దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

చైనా పీపుల్స్ రిపబ్లిక్ దేశంగా ఏర్పడిన నాటి నుంచి సరిహద్దుల విషయంలో భారత్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుంటూనే ఉంది. రెండు దేశాల మధ్య ఉన్న 3,488 కిలోమీటర్ల సరిహద్దుకు సంబంధించి అనేక చోట్ల వివాదాలు సృష్టిస్తోంది. మన దేశంలో చైనాతో సరిహద్దు ఉన్న జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో అనేక భూభాగాలు తమవేనంటూ చైనా వాదిస్తోంది. 1950లో టిబెట్‌ను ఆక్రమించుకున్న చైనా అటుపిమ్మట భారత్‌లోని అనేక భాగాలు టిబెట్‌కు చెందినవని, వాటిని తమకు అప్పగించాలని ఒత్తిడి చేస్తూనే ఉంది. 1962లో భారత్‌తో జరిపిన యుద్ధం ఫలితంగా ప్రస్తుత కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లోని భాగమైన 37,244 చదరపు కిలోమీటర్ల అక్సాయ్‌చిన్ ప్రాంతాన్ని చైనా ఆక్రమించుకుంది. అంతేకాదు జమ్మూకశ్మీర్ లోయలోని మరో 5,300 చదరపు కిలోమీటర్ల భూభాగం కూడా తమదేనంటూ ఘర్షణలకు దిగుతూనే ఉంది. 2020 మే నెలాఖరులో చైనా సైన్యం గల్వాన్ లోయ ప్రాంతంలో భారత భూభాగంలోకి చొరబడినప్పుడు జరిగిన ఘర్షణలో ఇరువైపులా అనేకమంది సైనికులు మరణించారు. 1967లో సిక్కింలోని నాథులా, చోవా ప్రాంతాల్లో కూడా చైనా సైన్యం సరిహద్దుల వెంబడి అనేక చోట్ల భారత సైన్యంతో ఘర్షణలకు దిగింది. ఆ తరువాత కూడా చైనా ఘర్షణలకు పాల్పడుతూనే ఉంది. మరోవైపు అరుణాచల్‌ప్రదేశ్ తమ దేశ అంతర్భాగమని డ్రాగన్ దేశం వాదిస్తోంది. మొదట్లో దాదాపు 90,000 చదరపు కిలోమీటర్లు.. అంటే మొత్తం అరుణాచల్‌ప్రదేశ్ తమదేనని అని వాదించిన చైనా ఇప్పుడు తొలుత 8,000 చదరపు కిలోమీటర్ల భూభాగంపై వివాదాన్ని పరిష్కరించుకుందామని భారత్‌తో బేరాలాడుతోంది. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని 15 ప్రాంతాల పేర్లను చైనా భాష మాండరిన్‌లోకి మార్చేసింది. వీటిలో 8 పేర్లు పట్టణాలు, 2 పేర్లు నదులు, 5 పేర్లు పర్వతాలకు సంబంధించినవి ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్‌ను చైనా తన భూభాగమైన జంగ్‌నన్‌గా సంబోధిస్తోంది.

అర్థం లేని ఆధారాలు

పొరుగు దేశాలతో నెలకొన్న వివాదాలకు చైనా ప్రత్యక్ష ఆధారాలు చూపడం లేదు. తన విస్తరణవాదానికి పూర్వకాలం నాటి రాజవంశస్తుల పాలనా క్షేత్రాన్ని రుజువుగా చూపిస్తోంది. మధ్య యుగాలనాటి హన్, తంగ్, యువాన్, క్వింగ్ రాజవంశీకులు పరిపాలించిన ప్రాంతాలంటూ ఇతర దేశాలతో సరిహద్దుల విషయంలో జగడానికి దిగుతోంది. అందుకోసం ఆయా ప్రాంతాల పేర్లను పూర్వకాలంలో పేర్కొన్న పేర్లుగా మార్చేస్తోంది. అంతర్జాతీయంగా జరిగిన ఏ ఒక్క ఒప్పందాన్ని కూడా చైనా అంగీకరించడం లేదు. దక్షిణ చైనా సముద్ర జలాలపై, ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలపై ఆధిపత్యం తమదేనంటూ తాను సృష్టించిన గీతల మ్యాప్‌లను చారిత్రక ఆధారాలుగా చూపుతోంది.

ఆరు మహాయుద్ధాలు!

2020 నుంచి 2050 మధ్యకాలంలో ఆరు మహాయుద్ధాలు జరుగుతాయని చైనాకు చెందిన సోహు అనే పోర్టల్‌లో గతంలో పేర్కొన్నట్లు యురేషిన్ టైమ్స్ అనే ఆన్‌లైన్ పత్రిక వెల్లడించింది. దాని ప్రకారం 2025 నాటికి తైవాన్, 2030 నాటికి అన్ని దీవులను, 2040 నాటికి అరుణాచల్‌ప్రదేశ్‌ను, 2050 నాటికి జపాన్‌కు చెందిన దీవులను స్వాధీనం చేసుకోవడానికి యుద్ధాలు జరుగుతాయని పోర్టల్ చెబుతోంది. తంపులమారి చైనా మాదిరిగానే భారతదేశం కూడా మౌర్య, చోళ వంశస్తుల పరిపాలనా క్షేత్రాన్ని ఆధారంగా చూపితే అనేక దేశాలను అఖండ్ భారత్‌లో అంతర్భాగంగా చెప్పొచ్చు. మౌర్య, చోళ వంశస్థుల పరిపాలనకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

అందరితోనూ తగువే

భారత్ మాత్రమే కాకుండా 15 దేశాలతో చైనాకు సరిహద్దు తగాదాలు కొనసాగుతున్నాయి. వీటిలో తైవాన్, ఫిలిప్పైన్స్, ఇండోనేసియా, వియత్నాం, జపాన్, ద.కొరియా, ఉ. కొరియా, సింగపూర్, బ్రూనై, నేపాల్, భూటాన్, లావోస్, మంగోలియా, మయన్మార్ తదితర దేశాలు ఉన్నాయి. దక్షిణ చైనా సముద్రం అంతా తమ ఏలుబడిలోనే ఉండాలంటూ అంతర్జాతీయ సమాజాన్ని డ్రాగన్ సవాలు చేస్తోంది.

- తైవాన్ విషయంలో ఆ దేశమంతా తమకు చెందినదేనన్నది చైనా వాదన. అయితే, ప్రస్తుతానికి మెకలిస్ బ్యాంక్, చైనా ఆక్రమణలో ఉన్న దీవులు, సౌత్‌చైనా సముద్రంలో కొంత భూభాగం విషయంలో రెండు దేశాలు ఘర్షణ పడుతున్నాయి.
- ఫిలిప్పైన్స్ విషయంలో కూడా స్కార్‌బరో కొండలు, మరికొన్ని దీవులపై చైనా వివాదం సృష్టించింది. వీటివిషయంలో ఫిలిప్పైన్స్‌తో తరచుగా ఘర్షణలకు పాల్పడుతోంది.
- ఇండోనేసియాకు సంబంధించి నతునా దీవులు, సౌత్ చైనా సముద్రంలో కొంతభాగం తమదేనంటూ చైనా తగువులు సృష్టిస్తోంది.
- వియత్నాం విషయానికి వస్తే అనేక భాగాలను తమకు అప్పగించాలని చైనా ఒత్తిడి పెంచుతోంది. పలు ద్వీపాలతోపాటు సముద్ర జలాల్లో ఆధిపత్యం కోసం కాలుదువ్వుతోంది. చైనా నౌకాదళం ఇటీవల వియత్నాంకు చెందిన చేపల వేట పడవను సముద్రంలో ముంచేసింది.
- మలేసియాతోనూ కొన్ని దీవులు, సముద్ర జల్లాల విషయంలో చైనా జగడం ఆడుతోంది. మలేషియా చమురు అన్వేషణ నౌకలను అడ్డుకుంటోంది. ఇటీవల అమెరికా, ఆస్ట్రేలియా యుద్ధనౌకలు మలేషియాకు అండగా రావడంతో చైనా నౌకాదళం తోకముడిచి వెనక్కి వెళ్లిపోయింది.
- జపాన్‌కు చెందిన రెండు ద్వీప సముదాయాలపై చైనా కన్నుపడింది. అవి సెన్కాకు దీవులు, ర్యూక్యు దీవులు. ఈ దీవుల్లో చమురు నిక్షేపాలు బయటపడినప్పటి నుంచి చైనా వీటి విషయంలో జపాన్‌తో తగువు పడుతోంది.
- దక్షిణ చైనా సముద్రంలో కొంతమేరకు మునిగిపోయిన సొకొత్రా రాక్‌పై దక్షిణ కొరియాతో వివాదానికి దిగింది చైనా. ఈ రాక్ కొరియాకు 149 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చైనాకు 287 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- దాదాపు 1,400 కిలోమీటర్ల సరిహద్దు ఉన్న ఉత్తర కొరియాతో సీ ఆఫ్ జపాన్ సముద్ర జలాల్లో హద్దుల అంశంపై చైనా వివాదం సృష్టించింది.
- దక్షిణ చైనా సముద్ర జలాల విషయమై సింగపూర్‌తో చైనా తగువులాడుతోంది.
- అతిచిన్న ఇస్లామిక్ దేశమైన బ్రూనైతో కూడా కొన్ని దీవులు, సముద్ర జలాలపై చైనా గొడవ పెట్టుకుంది.
- తమ భూభాగంలో కొంత భాగాన్ని చైనా ఆక్రమించుకున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఇటీవలే గుర్తించింది. పశ్చిమ నేపాల్‌లోని హుమ్లా జిల్లాలో చైనా ఆక్రమణలకు పాల్పడింది.
- దాదాపు 290 మైళ్లకుపైగా సరిహద్దు ఉన్న భూటాన్‌తో అనేక చోట్ల హద్దుల విషయంలో చైనా వివాదాలు సృష్టించింది. 1980 నుంచి వీటి విషయంలో రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి.
- లావోస్‌లో అత్యధిక భాగం తమదేనని చైనా వాదిస్తోంది. అందుకు యువాన్ రాజవంశ పరిపాలనను రుజువుగా చూపిస్తోంది.
- సరిహద్దు వివాదం కారణంగా తమ దేశంలోని ఓ చెక్‌పాయింట్‌పై దాడి జరిగిందని చైనా చెబుతోంది. ఈ ప్రాంతం విషయంలో మంగోలియాకు, చైనాలోని గాన్సు ప్రాంత ప్రజలకు మధ్య వివాదం ఉంది.

ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హతం

కెనడాలోని గురుద్వారా వద్ద కాల్చిచంపిన గుర్తుతెలియని ఆగంతకులు



న్యూఢిల్లీ: కెనడాలో సిక్కు వేర్పాటువాద ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌లో మోస్ట్–వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) అధిపతి హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఆదివారం రాత్రి కాల్చిచంపారు. కెనడాలోని సుర్రీ నగరంలోని గురునానక్ సిఖ్ గురుద్వారా పార్కింగ్ ప్రాంగణంలో నిజ్జర్ కారులో ఉండగా ఇద్దరు వ్యక్తులొచ్చి తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. దీంతో బుల్లెట్ గాయాలతో కారులోనే నిజ్జర్ కన్నుమూశారు. కెనడా పారిపోయిన నిజ్జర్‌ను పట్టిచ్చే సమాచారమిస్తే రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గత ఏడాది జులైలో ప్రకటించడం తెల్సిందే. కఠిన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం కింద ఉగ్రవాదిగా పేర్కొంటూ ఇతని ఆస్తులను జప్తుచేసింది. 2021లో పంజాబ్‌లోని జలంధర్‌లో ఒక హిందూ పూజారిపై దాడి ఘటనలో నిజ్జర్‌కు ప్రమేయముంది. ఖలిస్తాన్ డిమాండ్‌తో భారత్‌లో ఏర్పాటైన సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థకు సాయపడుతూ దాని విద్వేష అజెండాను కెనడాలోనూ ఇతను ప్రచారంచేసేవాడు.

ఎవరీ నిజ్జర్?

45 ఏళ్ల నిజ్జర్ సొంతూరు పంజాబ్‌లోని భార్‌సింగ్‌పూర్. కెనడాకు వెళ్లాక అక్కడి గురునానక్ సిఖ్ గురుద్వారాకు చీఫ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 2010లో పటియాలాలో హిందూ ఆలయం వద్ద పేలుడు ఘటనలో నిజ్జర్‌కు ప్రమేయముందని కేసు నమోదైంది. కేటీఎఫ్‌కు చెందిన జగ్తార్ సింగ్ తారాను కలిసేందుకు నిజ్జర్ 2013–14కాలంలో పాకిస్తాన్‌కూ వెళ్లి వచ్చాడు. నిజ్జర్‌పై కాల్పుల ఘటన జరిగిన సుర్రీ నగరంలో సిక్కుల జనాభా అధికం. ఇక్కడి వైరి ఖలిస్తానీ గ్రూప్‌తో శత్రుత్వం వల్లే ఈ కాల్పుల ఉదంతం చోటుచేసుకుందనే వార్తలు కెనడా మీడియాలో ప్రసారమయ్యాయి. పంజాబ్‌కు గతంలో కెప్టెన్ అమరీందర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నిజ్జర్ పేరును 'వెతుకుతున్న నేరగాళ్ల జాబితా'లో చేర్చారు. తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 2018లో భారత్‌లో పర్యటించినపుడు ఆయనకు ఈ జాబితాను అందజేశారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఐఎన్ఎస్ దీపక్ యుద్ధ నౌకపై యోగాసనాలు వేస్తున్న నేవీ సిబ్బంది

'ఉమ్మడి పౌరస్మృతి మత స్వేచ్ఛకు వ్యతిరేకం'

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అనేది మత స్వేచ్ఛకు పూర్తి వ్యతిరేకమని దేశంలోని ప్రముఖ ముస్లిం సంస్థ జమియత్ ఉలేమా–ఈ–హింద్ సోమవారం వ్యాఖ్యానించింది. ఈ మేరకు సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ' రాజ్యాంగం భారతీయులకు మత స్వేచ్ఛను ప్రసాదించింది. కానీ ఉమ్మడి పౌరస్మృతి అనేది ఈ మత స్వేచ్ఛకు వ్యతిరేకం .వీధుల్లో నిరసన కార్యక్రమాల ద్వారా యూసీసీని వ్యతిరేకించదల్చుకోలేదు. చట్ట ప్రకారమే ఒక్కో అడుగూ ముందుకేస్తూ వెళతాం. ఈ మేరకు యూసీసీని వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానాన్ని జమియత్ కమిటీ ఆమోదించింది' అని సంస్థ పేర్కొంది.

రేపే అమెరికాకు మోదీ

- పర్యటనకు పూర్తయిన ఏర్పాట్లు
- అమెరికావ్యాప్తంగా భారతీయ–అమెరికన్ల ఐక్యతా ప్రదర్శనలు



వాషింగ్టన్/హూస్టన్: ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన ఈ నెల 21 నుంచి 24వ తేదీ దాకా అమెరికాలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, జిల్ దంపతుల ఆహ్వానం మేరకు అగ్రరాజ్యంలో మోదీ పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మోదీ పర్యటన కోసం భారత–అమెరికన్లు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు సన్నద్ధమవుతున్నారు. మోదీకి స్వాగత సందేశాన్ని పంపించడానికి రాజధాని వాషింగ్టన్ డీసీ సహా అమెరికావ్యాప్తంగా 20 నగరాల్లో భారత–అమెరికన్లు తాజాగా ఐక్యతా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో వందలాది మంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్‌లో మోదీ హాజరయ్యే కార్యక్రమంలో పాల్గొనేందుకు టికెట్ల కోసం భారత–అమెరికన్లు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పుడు అమెరికా అంతటా మోదీ పర్యటనపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

రక్షణ బంధాలకు పెద్దపీట

రక్షణ రంగంలో పరస్పర సహకారం కోసం భారత్–అమెరికా చేతులు కలుపుతున్నాయి. మోదీ అమెరికా పర్యటనలో ఇదే అంశంపై విస్తృతంగా చర్చలు జరుగనున్నాయి. రక్షణ రంగంలో సహకారంపై ఇరుదేశాలు కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. ఓ రోడ్డు మ్యాప్‌ను సైతం ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఇకపై కలిసి పనిచేయాలని భారత్–అమెరికా ఇప్పటికే నిర్ణయించుకున్నాయి.

24, 25న మోదీ ఈజిప్టు పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 24, 25న ఈజిప్టులో పర్యటిస్తారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన తలపెట్టారు. 1997 తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. 11వ శతాబ్దం నాటి చారిత్రక అల్–హకీం మసీదును మోదీ సందర్శిస్తారు. దావూదీ బోహ్రా ముస్లిం సామాజికవర్గం సహాయంతో ఈ మసీదును ఇటీవలే పునరుద్ధరించారు. ఈజిప్టులో మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన భారత సైనికులకు హెలియోపోలిస్ వార్ సెమెట్రీలో మోదీ నివాళులర్పిస్తారు. ఈజిప్టు అధ్యక్షుడితో చర్చలు జరుపుతారు. ఈజిప్టులోని భారతీయులతో సమావేశమవుతారు.

వెస్ట్‌బ్యాంక్‌లో భీకర పోరు

ఐదుగురు పాలస్తీనీయులు మృతి



జెనిన్ శరణార్థి శిబిరంపై దాడి దృశ్యం

జెనిన్: ఇజ్రాయెల్ సైనిక దళాలు సోమవారం వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిపిన దాడి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శిబిరంలోని తీవ్రవాదులను పట్టుకునేందుకు ఆర్మీ ప్రయత్నించింది. ఇస్లామిక్ జిహాద్ శ్రేణులు బాంబులను పేల్చడంతో ఆర్మీకి చెందిన అయిదు వాహనాలు ధ్వంసమయ్యాయి. వాటిలో చిక్కుకున్న జవాన్లను కాపాడేందుకు హెలికాప్టర్ రంగంలోకి దిగింది. గన్‌షిప్ కాల్పుల్లో బాలుడు సహా ఐదుగురు పాలస్తీనీయులు చనిపోయారు. 90 మందికి పైగా గాయపడ్డారు.

ఎల్‌ఏసీ వద్ద పరిణామాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. చైనాతో సరిహద్దు వివాదంపై పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చ జరపాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ తివారీ సోమవారం మీడియాతో మాట్లాడారు. 'సరిహద్దులు దాటి మన భూభాగంలోకి ఎవరూ ప్రవేశించలేదు. మన ఆర్మీ పోస్టులను ఎవరూ స్వాధీనం చేసుకోలేదని మూడేళ్ల క్రితం గల్వాన్ ఘర్షణలు జరిగాక అఖిలపక్ష భేటీలో ప్రధాని మోదీ చెప్పారు. చైనా సైనికులు సరిహద్దులు దాటి చొచ్చుకొచ్చేందుకు, మన భూభాగంలో టెంట్లు వేసేందుకు ప్రయత్నించడంతో గల్వాన్ ఘటన జరిగిందంటూ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇవి రెండూ పరస్పర విరుద్ధ ప్రకటనలు'అని తివారీ తెలిపారు. అందుకే భారత్–చైనా సరిహద్దు వివాదంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపడంతోపాటు గత మూడేళ్లుగా ఎల్ఏసీ వెంట జరుగుతున్న వాస్తవ పరిణామాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ కోరుతోందన్నారు. 'ఎల్ఏసీ వెంట ఉన్న 65 పెట్రోలింగ్ పాయింట్లకు గాను 26 వరకు మన ఆర్మీ నియంత్రణలో లేవన్న విషయం నిజమా? చైనా ఆక్రమణలను మనం ఎందుకు ఆపలేకపోయాం?'అని తివారీ కేంద్రాన్ని నిలదీశారు.

రా చీఫ్‌గా రవి సిన్హా నియామకం

న్యూఢిల్లీ: దేశం వెలుపల గూఢచర్య కార్యకలాపాలు నడిపే నిఘా సంస్థ.. రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా)కు అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి రవి సిన్హా(59) నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన రవి సిన్హా రెండు దశాబ్దాలుగా 'రా'లో నంబర్ టూగా వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన 'రా' ఆపరేషన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. గూఢచర్యంలో ఆధునిక సాంకేతికత వినియోగంలో సిద్ధహస్తుడిగా ఆయనకు పేరుంది.

నిర్దిష్టమైన అంశాలపై ఒప్పందం

అమెరికా విదేశాంగ మంత్రితో భేటీ తర్వాత జిన్‌పింగ్ ప్రకటన



బీజింగ్: దాదాపు ఐదేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రితో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య కొన్ని నిర్దిష్టమైన అంశాలపై ఒప్పందం కుదిరిందని జిన్‌పింగ్ ప్రకటించారు. అయితే ఆ ఒప్పందాల వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల అమెరికా గగనతలంలో చైనా నిఘా భారీ బెలూన్లు చక్కర్లు కొట్టడం, వాటిని అమెరికా వాయుసేన కూల్చేయడం వంటి ఘటనలతో ఇరుదేశాల మధ్య సత్సంబంధాల్లో సందిగ్ధత నెలకొన్న విషయం తెల్సిందే. ''ఇటీవల బాలీలో బైడెన్‌తో కుదిరిన 'కనీస అవగాహన'కు కొనసాగింపుగా చైనా తన వైఖరిని స్పష్టంచేసింది. ప్రత్యేకంగా కొన్ని అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇరు దేశాలు ఉమ్మడిగా పురోగతి సాధించాయి. పరస్పర గౌరవం, నమ్మకాల మీదనే చర్చలు సఫలమవుతాయి'' అని భేటీ తర్వాత జిన్‌పింగ్ వ్యాఖ్యానించారని చైనా అధికార వార్తాసంస్థ సీజీటీఎన్. ' బ్లింకెన్ పర్యటనతో ఇరుదేశాల బంధం కీలక కూడలికి చేరుకుంది. అయితే చైనాపై అమెరికా విధిస్తున్న ఏకపక్ష ఆంక్షలను ఎత్తేయాల్సిన అవసరం ఉంది' అని చైనా విదేశాంగ మంత్రి క్విన్ చెప్పారు. చైనాతో దౌత్య ద్వారాలు ఎప్పటికీ తెరిచే ఉండాలనే లక్ష్యంతో బ్లింకెన్ పర్యటన సాగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

లొంగేది లేదు: ఇమ్రాన్

లాహోర్: దేశంలో న్యాయబద్ధమైన పాలన కోసం తన పోరు కొనసాగుతుందని పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. 'ప్రభుత్వం నన్ను జైలులో పెట్టినా లొంగను'అంటూ కరాఖండిగా తేల్చారు. యూట్యూబ్‌లో ఆయన సోమవారం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశం కోసం, ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసమే తన పోరాటమని చెప్పారు. అంతకుముందు ఆయన లాహోర్ నుంచి ఇస్లామాబాద్ వెళ్లి తనపై ఉన్న 19 కేసులకు సంబంధించిన బెయిల్ గడువును పొడిగించాలని కోర్టును కోరారు. ఇమ్రాన్‌పై 140కి పైగా కేసులున్నాయి.

జగదీశ్ షెట్టార్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ టిక్కెట్



బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటక శాసనమండలికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసే ముగ్గురు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ ప్రకటించింది. మాజీ సీఎం జగదీశ్ షెట్టార్, మంత్రి ఎన్ఎస్ బోస్ రాజు, తిప్పన్నప్ప కమక్నూర్‌లను బరిలోకి దించుతున్నట్లు సోమవారం తెలిపింది. వీరి అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వీలుగా బాబూరావ్ చించనస్సూర్, ఆర్.శంకర్, లక్ష్మణ్ సవాదిలు రాజీనామా చేయడంతో ఈ మూడు సీట్లు ఖాళీ అయ్యాయి. ఈ ముగ్గురిలో సవాది మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొందగా మిగతా ఇద్దరు ఓటమి పాలయ్యారు.

గుజరాత్‌ను వీడని బిపర్‌జోయ్

అస్సాం, తమిళనాడుల్లోనూ వానలు

అహ్మదాబాద్/జైపూర్/గువాహటి/ సాక్షి, చెన్నై: బిపర్‌జోయ్ తుపాను వాయుగుండంగా మారడంతో గుజరాత్, రాజస్తాన్‌ల్లోని పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిశాయి. గుజరాత్ బనస్కాంత జిల్లా ధనేరా తాలుకాలో వరదలు సంభవించాయని అధికారులు సోమవారం తెలిపారు. 20 వరకు పశువులు కొట్టుకుపోయాయన్నారు. వచ్చే రెండు రోజుల్లో సౌరాష్ట్ర ప్రాంతంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొంది. అదేవిధంగా, రాజస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో గత రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. సంబంధిత ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే 15 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాలి, సిరోహి, బర్మేర్, జలోర్ జిల్లాల్లో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న 265 మందిని యంత్రాంగం కాపాడింది. అజ్మేర్‌లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వానకు స్థానిక జేఎల్ఎన్ ఆస్పత్రిలోకి వరద ప్రవేశించింది. 18 మంది రోగులను ఇతర వార్డులకు అధికారులు తరలించారు. రాజస్తాన్ మీదుగా ఏర్పడిన అల్పపీడనం బుధవారం కల్లా బలహీనపడుతుందని ఐఎండీ తెలిపింది. అస్సాంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో పంట పొలాలు, గ్రామాలు, పట్టణాలు నీటి ముంపునకు గురయ్యాయి. లఖింపూర్‌లోని 25,200 మంది సహా మొత్తం 33,400 మంది వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గురువారం వరకు రాష్ట్రంలో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలకు కురుస్తాయంటూ ఐఎండీ హెచ్చరించింది.

చెన్నైలో స్కూళ్లకు సెలవు

ఆదివారం రాత్రి నుంచి తమిళనాడు రాజధాని చెన్నైలో భారీ వర్షాలు కురుస్తుండటంతో యంత్రాంగం సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతోపాటు చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది.

గుర్బానీ ప్రసారాలు ఉచితం

చండీగఢ్: సిక్కులు పఠించే పవిత్ర శ్లోకం గుర్బానీ ఇకపై ఉచితంగా ప్రఖ్యాత స్వర్ణదేవాలయం నుంచి ప్రసారం కానుంది. ఇందుకు సంబంధించిన బ్రిటిష్‌కాలంనాటి చట్టానికి చేసిన సవరణ ప్రతిపాదనలకు పంజాబ్ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. మంగళవారం శాసనసభలో ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం ప్రకటించారు. ఇన్నాళ్లు గుర్బానీని రాష్ట్రంలో శక్తివంతమైన శిరోమణి అకాలీదళ్ పార్టీకి చెందిన ప్రైవేట్ చానెల్ పీటీసీ ప్రసారం చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ(ఎస్‌జీపీసీ) మండిపడింది. 'ఆ చట్టాన్ని పార్లమెంట్ చేసింది. దీనికి సవరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. సిక్కుల మత సంబంధ వ్యవహారాలకు ఆప్ ప్రభుత్వం రాజకీయ రంగు పులుముతోంది' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'చట్ట పరిధిపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఇది రాష్ట్ర పరిధిలోనిది' అని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ' గుర్బానీ వినిపించేటపుడు అడ్వర్టైజ్‌మెంట్లు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రత్యక్షంగా ఉచితంగా ఆడియో, వీడియో ప్రసారాలు చేస్తున్నాం' అని ప్రభుత్వం ప్రకటించింది. పీటీసీ ప్రైవేట్ చానెల్‌కు అధిపతి అయిన శిరోమణి అకాలీదళ్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకే సర్కార్ ఈ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది.

భోజనం బాగుందా బుజ్జీ



ముఖ్యమంత్రి మధ్యాహ్నం భోజన పథకం తనిఖీలో భాగంగా సోమవారం తిరుచిరాపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థినితో కలిసి భోజనం చేస్తున్న తమిళనాడు యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 20 : జూన్ : 2023


ధార్వాడ చేరిన రైలు

బెంగళూరు టు ధార్వాడ

- విజయవంతంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్

యశవంతపుర: బెంగళూరు–ధార్వాడ మధ్య తిరిగే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం తెల్లవారు 5:45 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.40 గంటలకు ధార్వాడకు చేరనుంది. మధ్యాహ్నం 1:15కు ధార్వాడలో బయలుదేరి రాత్రి 8:10 గంటలకు బెంగళూరుకు చేరుకోనుంది. వారంలో ఆరు రోజుల పాటు బెంగళూరు–ధార్వాడల మధ్య తిరుగుతుంది. లాంఛనంగా ఈ నెల 26న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. 6 గంటల 55 నిమిషాల వ్యవధిలో ధార్వాడకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఎనిమిది బోగీలు ఉండగా 530 మంది ప్రయాణికులను తీసుకెళ్లే దీన్ని మినీ వందే భారత్ రైలుగా పిలుస్తారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైల్వే అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

లారీ కదిలి... ఢీకొట్టింది



మైసూరు: కబిని జలాశయం వద్ద ఉన్న పోలీస్ ఔట్‌పోస్టుని లారీ ఢీకొట్టింది. ఆ సమయంలో డ్రైవర్ అందులో లేరు. ఈ సంఘటన జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలోని బీచనహళ్ళి గ్రామం వద్ద చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ లారీని నిలిపి దిగివచ్చి ఎవరినో చిరునామా అడుగుతున్నారు. ఇంతలో లారీ తగ్గుగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లిపోయి ఎదురుగా ఉన్న ఔట్‌పోస్టును ఢీకొంది. ఎవరికీ ఏమీ కాలేదు. కబిని డ్యాం అధికారులు వచ్చి పరిశీలించారు.

ఉచిత ప్రయాణంలో మార్పులు చేస్తాం

- మంత్రి రామలింగారెడ్డి

శివాజీనగర: ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణాల పథకంలో స్వల్ప మార్పు చేస్తామని రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి అన్నారు. సోమవారం విధానసౌధలో మాట్లాడుతూ... 15 రోజులు పాటు చూసి ఆ తరువాత అవసరమైన మార్పులు చేస్తామన్నారు. ఈనెల 11న 5 లక్షల 70 వేల మంది బస్సుల్లో ప్రయాణించారు. ఇప్పటికే మూడు కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారు. అయితే ఒకేసారి ఇంతమంది వెళ్లరాదని కోరారు. పుణ్యక్షేత్రాలకు అంటూ పెద్ద ఎత్తున తరలివస్తున్నారని, దీని వల్ల ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వారంలో రూ. 70 కోట్ల విలువ చేసే ఉచిత ప్రయాణాలపై స్పందించిన ఆయన ప్రారంభంలో కాబట్టి రద్దీ ఉంటుందని, రోజు వెళ్లరని అన్నారు. ప్రైవేట్ బస్సులకు నష్టం జరుగుతున్న విషయంపై మాట్లాడిన ఆయన, ప్రైవేట్ బస్సువారు కూడా ట్యాక్స్ చెల్లిస్తున్నారు. వారి జీవితము గడవాలి. ప్రస్తుతం ఉత్సాహంలో మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ముందు రోజుల్లో మహిళల సంఖ్య తగ్గుతుందోమో చూడాలని అన్నారు.

మండ్య జిల్లాలో హిట్ అండ్ రన్

- ఇద్దరు యువకుల దుర్మరణం




మండ్య: మండ్య జిల్లా కేఆర్ పేటె తాలూకా చన్నరాయ పట్టణ మెయిన్ రోడ్డులో హిరికళెల్ గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. హిరికళెల్ గ్రామానికి చెందిన సందేష్ (23), మరడహళ్లి గ్రామానికి చెందిన భరత్ (21) మృతి చెందారు. కొబ్బరి బోండాల వ్యాపారం చేసే వీరు ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని బైక్‌పై కేఆర్‌పేట నుంచి హిరికళెల్ గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్‌లో పోరు తప్పదు: అశోక్

శివాజీనగర: సీఎం సిద్దరామయ్య అందరినీ ఆడించిన దేవేగౌడనే అణచివేశారు, ఆయన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను అణచివేయకుండా విడిచిపెట్టరు. డీకేశి కి ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు ముగిసిన తరువాత సీఎం కుర్చీని ఇవ్వరు అని బీజేపీ మాజీ మంత్రి ఆర్.అశోక్ అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లో సీఎం పదవి కోసం వీధి పోరాటాలు జరగక తప్పదని అన్నారు. సోమవారం జాలహళ్లిలో నివాసంలో ఆయన మాట్లాడుతూ మంత్రుల మాటలను బట్టి ఇదే చెబుతున్నా, డీకే సీఎం అవుతానని కలలు కంటున్నారు, దేవేగౌడనే ఆటాడించిన సిద్దరామయ్య శివకుమార్‌ను విడిచిపెడతారా అని అన్నారు. సీఎంగా సిద్దరామయ్యే ఐదేళ్లు కొనసాగే ప్రయత్నం చేస్తారన్నారు.

ఆ మంత్రికి చిల్లర కాసులే: ఎంపీ

మైసూరు: భారీ పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్‌కు దక్కేది చిల్లర కాసులని, నోట్ల కట్టలు వచ్చే శాఖ లేకపోవడంతో ఆయన అల్లాడిపోతున్నారని మైసూరు ఎంపీ ప్రతాపసింహ అన్నారు. ప్రతాపసింహ చిల్లర రాజకీయాలు మాట్లాడటం మానేయాలి అని మంత్రి. పాటిల్ చెప్పడంపై ఎంపీ సోమవారం మండిపడ్డారు. ఇప్పుడున్న శాఖ వల్ల మంత్రికి చిల్లర తప్ప ఏమీ రావడం లేదు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య వద్ద చెప్పుకుని బాధపడ్డారని ఎద్దేవా చేశారు. తుపాకీకి ఎద చూపిండమే నీ పనా? అని సిద్దరామయ్య అన్నారు తప్ప మరే సమాధానం ఇవ్వకపోవడంతో మంత్రి నిరాశకు గురైనట్లు తెలిసిందన్నారు.

వర్షాభావం.. సేద్యం భారం

- రాష్ట్రంలో 10 శాతం కూడా పడని విత్తులు
- ఇప్పటికీ జాడ లేని నైరుతి వర్షాలు
- పొలం వైపు చూడని అన్నదాతలు
- కృష్ణా, ఉప నదులు ఖాళీ



మలెనాడులో కటకట


వర్షం లేక అన్నదాత విలవిల

బనశంకరి: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముఖం చాటేయడంతో పొలం పనులకు బ్రేక్ పడింది. మే నెలలో కురిసిన కొద్దిపాటి వర్షానికి చాలా తక్కువమంది రైతులు దుక్కి దున్ని ఈ నెల మొదటివారం విత్తనాలు వేశారు. కానీ వర్షం రాకపోవడంతో ఆ పంటలు కాపాడుకోవడం ఎలా ఆలోచనలు రైతులు ఉన్నారు. బెంగళూరు రూరల్ పరిధిలో నైరుతిలో 71,246 హెక్టార్లలో వివిధ పంటలు వేయాల్సి ఉంది. 59,100 హెక్టార్లలో రాగి, 8,136 హెక్టార్లలో జొన్నలు, 948 హెక్టార్లలో కంది, 215 ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేస్తారని అంచనావేశారు. చిక్కబళ్లాపురలో ప్రస్తుతం 1.54 లక్ష హెక్టార్లలో పంటలు పడాలి, కానీ 152 హెక్టార్లలో మాత్రమే విత్తనం వేశారు. ఇక భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లు పనిచేయడం లేదు.

కోలారులో 53 హెక్టార్లలో..

కోలారులో 10,980 హెక్టార్లలో వేరుశనగ వేయాలన్నది లక్ష్యమైతే 53 హెక్టార్లలో మాత్రమే విత్తనాలు పడ్డాయి. తుమకూరులో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నా వాన లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. రామనగర జిల్లాలో 92,655 హెక్టార్లలో విత్తనాలు పడలేదు. మండ్య జిల్లాలో 9 శాతం రైతులు మాత్రమే విత్తనాలు చల్లారు. చెరుకు పంట కోసం కేఆర్ఎస్ డ్యాం నుంచి కాలువలకు స్వల్పంగా నీరు వదిలారు. మైసూరుప్రాంతంలో కరువు పరిస్థితి నెలకొంది.

శివమొగ్గ జిల్లా లో 77,640 హెక్టార్లలో వరి, 48,770 హెక్టార్లలో మొక్కజొన్న, 490 హెక్టార్లలో ఏకదళ, 415 హెక్టార్లలో ద్విదళ ధాన్యం, 1,223 హెక్టార్లలో నూనె విత్తనాల పంటలను పండించాలి. రైతులు వాన లేక పొలాల వైపు వెళ్లడం లేదు. జూన్ ముగుస్తున్నా నైరుతి వర్షాలు మలెనాడులో ఇంకా అడుగుపెట్టలేదు.


టీబీ డ్యాం సహా అన్ని జలాశయాలు ఖాళీ

చిక్కమగళూరులోనూ అదే పరిస్థితి. పొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. కొడగు జిల్లా సోమవారపేటే, కుశాలనగర తాలూకా పరిధిలో వేసిన మొక్క జొన్న విత్తనం ఎండకు వాడుతోంది. హాసన్‌లో ఎక్కడా విత్తనాలు పడలేదు.

రాయచూరు, బళ్లారిలో..

రాయచూరుజిల్లాలో ఇంకా విత్తన కార్యక్రమం ప్రారంభం కాలేదు. 5.41 లక్షల హెక్టార్లపైకి 10 శాతం కూడా విత్తనం వేయలేదు. కృష్ణా నది నుంచి నీళ్లు వచ్చే సూచనల్లేవు. బళ్లారిలో ముంగారు విత్తనం నిలిచిపోగా 1.73 లక్ష హెక్టార్లలో సాగు ప్రశ్నార్థకమైంది. విజయనగర జిల్లాలో 2.89 లక్షల హెక్టార్లలో విత్తనం టార్గెట్‌గా పెట్టుకోగా 3,325 హెక్టార్లలో మాత్రమే విత్తారు. కొప్పళలో 11 శాతం విత్తనం రైతులు వేశారు. వర్షాధారమైన చిత్రదుర్గ జిల్లాలో రైతులు ఆశలు వదిలేశారు. బాగల్‌కోటే జిల్లాలో 2.65 లక్షల హెక్టార్లలో విత్తనమే పడలేదు. బెళగావి జిల్లాలో ఉద్యానవన పంటలు వాడిపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటితో తడుపుతున్నారు. కృష్ణా తీర ప్రాంత చిక్కోడి ప్రదేశంలో ప్రజలు, పశువులకు నీటి కొరత ఏర్పడింది. కలబురిగి జిల్లాలో ఇదే వర్షాభావం నెలకొంది.

బావురుమంటున్న నదులు

ధార్వాడలో రానున్న రోజుల్లో వర్షం కురవకపోతే కరువు ఏర్పడే అవకాశం ఉంది. హుబ్లీ– ధార్వాడ అవళినగరతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తాగునీరు సరఫరాచేసే సవదత్తి రేణుకాసాగర జలాశయంలో 4.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. హావేరిలో పెసర పంట ఎండుతుండగా గదగలో పొలం పనులు మొదలే కాలేదు. విజయపురలో ఇంకా వర్షం పడలేదు. మహారాష్ట్రలోని కృష్ణా, బీమా పరివాహ ప్రాంతాల్లో వర్షం పడని కారణంగా కృష్ణా, మలప్రభ, ఘటప్రభ, భీమా, మార్కండేయ తదితర నదులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలమట్టి జలాశయంలో నీటి మట్టం పడిపోయింది.

ప్లాస్టిక్ కవర్‌కు చిక్కిన సర్పం



మైసూరు: ప్లాస్టిక్ కవర్ల వల్ల జంతుజాలం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. నాగుపాము ఒకటి కప్పతో పాటు ప్లాస్టిక్ కవర్‌ను మింగి అవస్థ పడుతుండగా పాముల నిపుణుడు సపర్యలు చేసి కాపాడాడు. ఈ సంఘటన కొడగు జిల్లా కుశాలనగ దగ్గర గొంది బసవనహళ్ళి గ్రామంలో జరిగింది. చెందిన శశి అనే వ్యక్తి ఇంటిలోకి వచ్చిన నాగుపాము ఇంటిలో దాక్కున్న కప్పతో పాటు ప్లాస్టిక్ కవర్‌ను పొరపాటును మింగేసింది. కవర్ గొంతులో అడ్డం పడి పాము విలవిలలాడసాగింది. అది చూసి పాములు నిపుణుడు అయిన గఫూర్‌కు కొందరు సమాచారమిచ్చారు. ఆయన దానికి నీటిని తాగించి కప్పతో పాటు ప్లాస్టిక్ కవర్‌ను బయటకు తీసి పామును దూరంగా విడిచిపెట్టాడు.

గూడ్స్ నుంచి విడిపోయిన వ్యాగన్లు


విడిపోయి దూరంగా ఉన్న వ్యాగన్లు

రాయదుర్గం: బెంగళూరు నుంచి బళ్లారి వైపు బొగ్గు లోడు తో వెళుతున్న గూడ్సు రైలు సోమవారం అనంతపురం జిల్లా రాయదుర్గం పరిధిలో డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామం వద్ద ఇంజిన్ నుంచి 46 వ్యాగన్లు విడిపోయాయి. ఇంజిన్ ఐదు వ్యాగన్లతో వెళ్లిపోయింది. బొగ్గులోడుతో ఉన్న 46 వ్యాగన్లు కంట్రోల్ కాక పట్టాలు తప్పేలా కనిపించాయి. కిలోమీటర్ దూరం వెళ్లి నిలిచిపోయాయి. గార్డు వాకీటాకీ ద్వారా ఇంజిన్ డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో రైలు మళ్లీ వెనక్కు వచ్చి వ్యాగన్లను తగిలించుకుని వెళ్లిపోయింది. ఎలాంటి ప్రమాదం సంభవించక పోవడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫుడ్ డెలివరీ బాయ్ దుర్మరణం

- ఢీకొని వంద మీటర్లు లాక్కెళ్లిన కారు

యశవంతపుర: కారు ఢీకొని ఫుడ్ డెలివరి బాయ్ మృతి చెందిన ఘటన బెంగళూరు బ్యాటరాయనపుర పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. మృతుడిని మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాకు చెందిన ప్రసన్నకుమార్ (25)గా గుర్తించారు. ప్రసన్న ఆదివారం అర్ధరాత్రి వరకు ఓ సంస్థలో క్యాషియర్‌గా పనిచేసి , తెల్లవారుజామున ఫుడ్ డెలివరీకి బయలుదేరాడు. ఫుడ్ ఇవ్వడానికి బైక్‌పై మైసూరు రోడ్డులో వెళ్తుండగా వాయు వేగంతో వచ్చిన ఓ కారు ప్రసన్నను బలంగా ఢీకొంది. దాదాపు వంద మీటర్ల వరకు బైక్‌ను కారు లాక్కెళ్లడంతో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని వ్యక్తులు పారిపోతుండగా ఆర్‌ఆర్‌నగర మెట్రో స్టేషన్ వద్ద స్థానికులు అడ్డగించి కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారును నడుపుతున్న వినాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

ఉద్రిక్తత మధ్య కూల్చివేతలు


మహదేవపురలో దొడ్డనెక్కుంది వద్ద ఫెర్న్స్ సిటీలో కట్టడాల కూల్చివేత


అంజనాపుర జేపీ.నగర 9వ ఫేజ్‌లో కట్టడాలు తొలగిస్తున్న దృశ్యం

- దొడ్డనెక్కుంది ఫెర్న్స్ సిటీలో అడ్డుకున్న స్థానికులు
- క్లబ్‌హౌస్, ఈతకొలను నేలమట్టం

బనశంకరి: ఐటీ సిటీలో ఆక్రమణల తొలగింపు సోమవారం కూడా కొనసాగింది. మహదేవపురలో దొడ్డనెక్కుంది ఫెర్న్స్ సిటీ వద్ద రాజకాలువపై కబ్జాల తొలగింపు చేపట్టారు. ఆ సమయంలో కొందరు స్థానికులు తమకు కోర్టు స్టే ఉందని అడ్డుకోబోయారు. రాజకాలువలను కబ్జా చేసి భారీ కట్టడాలు నిర్మించుకున్న బడా బాబులను ఏమీ చేయలేక పోయారని, కానీ పేదల ఇళ్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. కబ్జాలను చివరి భాగం నుంచి తొలగించాలి కానీ మధ్యలో నుంచి తొలగించాలని వచ్చారా, మీకు బుద్ధి లేదా అని ఫెర్న్స్ సిటీవాసులు దుయ్యబట్టారు. ముందుగా ధనవంతుల ఆక్రమణలను తొలగించి ఇక్కడికి రండి అని స్థానికులు నిలదీయడంతో అధికారులతో ఘర్షణ జరిగింది. తీవ్ర ఉద్రిక్తత మధ్యనే ఆక్రమణలు తొలగించారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్యే నందీశ్‌రెడ్డి కూడా అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆక్రమణ తొలగింపు రాజకీయ కుట్ర అని, ముందుగా దొడ్డనెక్కుంది చెరువు వద్ద ఆక్రమణలు తొలగించకుండా మధ్యలో ఎందుకు కూల్చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో బీజేపీకి ఓట్లు పడ్డాయని కూల్చేస్తున్నారా? అని ధ్వజమెత్తారు. జేసీబీ యంత్రం తాళం లాక్కున్నారు. ఆయనకు స్థానికులు మద్దతు తెలపడంతో పోలీసులు రాగా తోపులాట జరిగింది. తరువాత జేసీబీ యంత్రం తాళం వెనక్కి ఇవ్వడంతో ఆక్రమణలు తొలగింపు కొనసాగించారు.

నిర్మాణాలు నేలమట్టం

ఫెర్న్స్ సిటీకి అనుకుని వెళ్లే రాజకాలువ మీద సుమారు 200 మీటర్లు పొడవునా నిర్మించిన ప్రహరీగోడ, క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్, మురుగునీరు సంస్కరణకేంద్రం, ఇతర కట్టడాలను నేలమట్టం చేశారు. గౌడ్రు రాజణ్ణ హోటల్ షెడ్‌ను తొలగించారు. అలాగే కేఆర్ పురం హొరమావు హొయ్సళ నగర మెయిన్‌రోడ్డు పక్కన వెళ్లే రాజకాలువపై 200 అడుగుల పొడవునా ఆక్రమించి కట్టిన 4 షాపులు, కారు సర్వీస్ స్టేషన్‌ను కూల్చేశారు. బొమ్మనహళ్లి అంజనాపుర వార్డులో పార్కు స్థలంలో కట్టిన 6 దుకాణాలను పడగొట్టారు.

అడ్డుపడితే చర్యలు తప్పవు

ఆక్రమణలు తొలగింపు గురించి బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ కబ్జాల తొలగింపునకు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 600 చోట్ల ఆక్రమణలు గుర్తించి, 110 చోట్ల కూల్చివేతలకు అనుమతించినట్లు తెలిపారు. గొడవలు జరగకుండా పోలీసు భద్రతను కోరినట్లు చెప్పారు. స్పేస్ గార్డెన్‌లో అక్రమ కట్టడాలకు అనుమతించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు.


ఫెర్న్స్ సిటీలో కబ్జా స్థలంలో కట్టిన ఈత కొలనును ధ్వంసం చేస్తున్న జేసీబీ

పరిషత్ ఎన్నికల్లో నలుగురి పేర్లు

శివాజీనగర: విధాన పరిషత్ ఎన్నికలకు నలుగురి పేర్లు కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, మంత్రి ఎన్.ఎస్.బోసురాజుతో పాటు మరో ఇద్దరి పేర్లను పరిశీలిస్తున్నారు. మూడు ఎమ్మెల్సీ సీట్లలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, మాజీ మంత్రి బాబురావ్ చించనూర్, మంత్రి ఎన్.ఎస్.బోసురాజ్, వెంకటేశ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. జగదీశ్ శెట్టర్, చించనూర్‌ను విధాన పరిషత్‌కు ఎంపిక చేసేందుకు హైకమాండ్ ఆమోదించినట్లు సమాచారం.

వనితలకు భద్రకోటగా ఐటీ సిటీ

- హోంమంత్రి పరమేశ్వర్ హామీ

బనశంకరి: బెంగళూరు నగరాన్ని సేఫ్ సిటీగా చేస్తామని, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని హోం మంత్రి పరమేశ్వర్ చెప్పారు. ఆయన మొదటిసారిగా పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. మహిళల సురక్షత కోసం బెంగళూరు పోలీసులు అనేక కఠిన చర్యలు తీసుకున్నారు. స్త్రీలు సమస్యల్లో ఉన్నట్లయితే 112 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే హొయ్సళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంటారు, సైబర్ నేరాలకు గురైతే తక్షణం 1930 లేదా 112 కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు మహిళా పోలీస్ స్టేషన్లను శివాజీనగర, బసవనగుడిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల సమస్యలు ఇబ్బందులను ఆలకించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

నేడు ఢిల్లీకి సీఎం, మంత్రులు

- నెలరోజుల పాలనపై రేపు సమీక్ష

శివాజీనగర: సీఎం సిద్దరామయ్య సర్కారు ఏర్పడి త్వరలో ఒక నెల పూర్తవుతుండగా సీఎం, అలాగే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులకు ఈ నెల 21న ఢిల్లీలో హైకమాండ్ దిశా నిర్దేశం చేయనుంది. మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అన్ని జిల్లాల్లో అన్నభాగ్యకు కేంద్రం బియ్యం ఇవ్వాలని ధర్నా చేసి, తరువాత ఢిల్లీకి బయల్దేరతారు. బుధవారం జరిగే హైకమాండ్ నీతి బోధన సమావేశంలో పాల్గొంటారు. సీఎం, డీసీఎం కూడా సాయంత్రంలోగా హస్తినకు వెళ్తారు. గత నెల రోజుల్లో పరిపాలన ఎలా జరిగింది, మంత్రుల పనితీరు తదితరాలపై చర్చిస్తారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీనియర్లు ఇందులో పాల్గొంటారు.

హైకోర్టులో మురుఘస్వామి బెయిలు అర్జీ

యశవంతపుర: బాలికలపై అత్యాచారం (పోక్సో) కేసులో జైలు పాలైన చిత్రదుర్గ మురుఘ మఠం శివమూర్తిస్వామి బెయిల్ పిటిషన్‌ను రోస్టర్ ప్రకారం విచారిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎం నవాజ్ పేర్కొన్నారు. సోమవారం పిటిషన్‌ను విచారించిన ఆయన రోస్టర్ ప్రకారం సమయం కేటాయించాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఆశ్రమంలోని హాస్టల్‌లో ఉండే ఇద్దరు బాలికలు తమపై స్వామీజీ అత్యాచారం చేశారని ఆరోపించగా, 2022, ఆగస్టు 26న మైసూరు నజరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సెప్టెంబర్ ఒకటిన ఆయనను అరెస్ట్ చేసి చిత్రదుర్గ జైలుకు తరలించారు.

సోప్స్ సంస్థలో లోకాయుక్త తనిఖీలు

- అక్రమాలపై పలు ఫిర్యాదులు


కేఎస్‌డీఎల్ ఆఫీసులో సోదాల దృశ్యాలు

బనశంకరి: కర్ణాటక ప్రభుత్వ సోప్స్ డిటర్జెంట్స్ (కేఎస్‌డీఎల్) సంస్థలో తీవ్రమైన అవినీతి చోటుచేసుకుందని ఫిర్యాదులు రావడంతో లోకాయుక్త అధికారులు సోమవారం కేఎస్‌డీఎల్ ప్రధాన కార్యాలయంపై దాడిచేశారు. కేఎస్‌డీఎల్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప, ఆయన తనయుడు ప్రశాంత్ ఎన్నికలకు ముందు భారీ మొత్తంలో లంచాలు తీసుకుంటూ దొరికిపోవడం తెలిసిందే. సంస్థలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకుని సోమవారం లోకాయుక్త డీఎస్పీతో పాటు 10 సీఐలు, సిబ్బంది ప్రధాన ఆఫీసులో తనిఖీలు ప్రారంభించారు.

విరూపాక్షప్ప కేసులో ల్యాబ్ నివేదిక పెండింగ్

ఇక మాడాళ్ విరూపాక్షప్ప కేసులో ప్రాథమిక విచారణ పూర్తిచేసిన లోకాయుక్త పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక కోసం వేచిచూస్తున్నారు. నిందితులు మాట్లాడిన ధ్వని నమూనాలు, చేతిరాత నమూనాల గురించి ల్యాబొరేటరీ నుంచి నివేదిక అందిన వెంటనే చార్జిషీట్ వేయనున్నారు. విరూపాక్షప్పపై ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని లోకాయుక్త అధికారులు తెలిపారు.

చిత్రలేఖనాలు భళా


పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న చిత్రకారిణులు


చిత్రలేఖన ప్రదర్శనలో పాల్గొన్న వర్ధమాన చిత్రకారిణులు

బనశంకరి: బసవనగుడిలోని ఐడబ్ల్యూసీ ఆర్ట్ గ్యాలరీలో మేజిక్ క్రషస్ పేరుతో చిత్రకారుడు కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ప్రదర్శన కళాప్రియులను ఆకర్షిస్తోంది. ప్రకృతి, భక్తి, సామాజిక అంశాలపై 15 మంది వర్ధమాన చిత్రకారులు నవ్యమైన చిత్రాలకు జీవం పోశారు. గౌతమ బుద్ధుడు, గ్రామీణ మహిళలు, పరమేశ్వరుడు, శ్రీకృష్ణుడు, పుష్పించిన చెట్లు వంటి చిత్రలేఖనాలను అబ్బురపరుస్తాయి. ఇందులో పాల్గొన్న వారిలో ఎక్కువమంది మహిళా చిత్రకారులే ఉండడం విశేషం. ఈ ప్రదర్శన 20 తేదీ మంగళవారం సాయంత్రంతో ముగుస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

యోగాపై శ్రద్ధ అవసరం



జాతాను ప్రారంభించిన అధికారులు

రాయచూరు రూరల్: ఆరోగ్య రక్షణకు యోగాపై శ్రద్ధ పెట్టాలని అసిస్టెంట్ కమిషనర్ రజనీకాంత్ చౌహాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన యోగా జాగృతి జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవ శిబిరాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. జాతా నగర వీధుల్లో గుండా సాగింది. జాతాలో శాంతమల్ల శివాచార్యులు, ఆయుష్ అధికారి శంకర్‌గౌడ పాటిల్, జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్ర బాబు, రుతురాజ్‌గౌడ, రేఖలున్నారు.

రిమ్స్‌లో అవ్యవస్థపై ధర్నా



ఆందోళనలో పాల్గొన్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) పాలనాధికారిని సస్పెండ్ చేయాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి సంచాలకుడు నరసింహులు మాట్లాడారు. పాలనాధికారి బసవరాజ్ హీరాపూర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ 750కి పైగా పడకలున్నా రోగులకు మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. కొంత మంది వైద్యులు రోగులకు బయటి మందులకు చీటీలు రాసిస్తున్నా నియంత్రించడం లేదన్నారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

విద్యుత్ చార్జీలను తగ్గించండి



ఆందోళన చేస్తున్న వినియోగదారులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో గృహ, వాణిజ్య అవసరాలకు కర్ణాటక విద్యుత్ నియంత్రణ మండలి(కేఈఆర్‌సీ) పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ వినియోగదారుల వేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో సంచాలకుడు వీరేష్ మాట్లాడారు. ఉన్నఫళంగా విద్యుత్ చార్జీలను ఐదింతల మేర పెంచడంతో పేదలు, వ్యవసాయ కూలీ కార్మికులు, మధ్య తరగతి కుటుంబాలు పలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. అనంతరం స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

కండక్టర్‌పై విద్యార్థుల దాడి

యశవంతపుర: విద్యార్థులు బస్ ఎక్కి లోపలకు వెళ్లాలని తోసినందుకు బస్‌ను నిలిపి విద్యార్థులు కండక్టర్‌పై దౌర్జన్యం చేసిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా చార్మాడి చెక్‌పోస్ట్ వద్ద జరిగింది. శనివారం ఉజిరెలో కాలేజీకి వెళ్లే విద్యార్థులు మంగళూరు-మూడిగెరె బస్ తలుపుల వద్ద నిలబడ్డారు. లోపలకి వెళ్లాలని కండక్టర్ వారిని తోయడంతో ఆగ్రహించిన విద్యార్థులు... బస్‌ను ఆపి కండక్టర్‌పై దౌర్జన్యం చేశారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు విద్యార్థులను ధర్మస్థళ పోలీసులు అరెస్ట్ చేశారు.

మత మార్పిడి చట్టం రద్దు తగదు



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మత మార్పిడి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌లు సోమవారం జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టాయి. సంచాలకుడు శరణబసవ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి హిందువులు కూడా ఓట్లు వేశారన్నారు. అలాంటప్పుడు మతమార్పిడి చట్టాన్ని రద్దు చేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

సులభంగా రిజిస్ట్రేషన్లు: మంత్రి

శివాజీనగర: రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో కావేరి- 2 సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలో 256 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు, నకిలీ ఖాతా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. సోమవారం నగరంలో వికాససౌధలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఆలస్యం కాకుండా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, వివాదాలకు తావు ఉండబోదని అన్నారు. ఆఫీసుల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేయడానికి కూడా కావేరి-2 సహాయపడుతుందన్నారు.

హంపీలో అక్రమ రిసార్ట్‌లపై కొరడా



జేసీబీతో రిసార్ట్ భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం



అక్రమ హోం స్టేను చూపుతున్న అధికారులు



హంపీలో అక్రమ రిసార్ట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: ప్రముఖ ప్రేక్షణీయ స్థలం హంపీ చుట్టు పక్కల వెలిసిన అక్రమ రిసార్ట్స్, హోం స్టేల తొలగింపునకు సోమవారం హంపీ అభివృద్ధి ప్రాధికార నడుం బిగించింది. ఈ విషయంపై అధికారులు ముందుగానే హంపీ, కడ్డిరాంపుర, కమలాపురల్లో అక్రమ రిసార్ట్స్, హోం స్టేల యజమానులకు తొలగింపుపై నోటీసులను అందించారు. ఆమేరకు అథారిటీ కమిషనర్ సిద్దరామేశ్వర్, తహసీల్దార్ విశ్వజిత్ మెహ్తా తదితరులు జేసీబీ యంత్రాలతో హంపీలోని అక్రమ రిసార్ట్స్, హోం స్టేలను తొలగించారు. దీంతో కొందరు రిసార్ట్స్, హోం స్టేల యజమానులు తమ భవనాలను స్వయంగా తొలగించుకునేందుకు ముందుకు వచ్చారు. అదే విధంగా కొప్పళ జిల్లాలోని ఆనెగొంది చుట్టుపక్కల ప్రదేశాల్లో కూడా వేళ్లానుకున్న అక్రమ రిసార్ట్‌లు, హోం స్టేలను తొలగించేందుకు అథారిటీ అధికారులు ముందుకొచ్చారు.

బియ్యానికి కేంద్రం అడ్డు: సీఎం

శివాజీనగర: కేంద్ర ప్రభుత్వం అన్నభాగ్య పథకం బియ్యం సరఫరాకు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడకుండా అమలు చేస్తామని సీఎం సిద్దరామయ్య చెప్పారు. బియ్యం అందకుండా కేంద్ర ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తోందన్నారు. వివిధ చోట్ల నుండి బియ్యం కొనుగోలుకు శక్తికి మించి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కేజీ రూ.36.50 చొప్పున పంపిణీకి టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు.

అల్లర్ల బాధిత కుటుంబాలకు సాయం

చట్టాన్ని చేతిలోకి తీసుకునే మతపిచ్చివాదులకు, నైతిక పోలీసింగ్ చేసేవారికి గుణపాఠం తప్పదని సీఎం సిద్దరామయ్య అన్నారు. గత ఐదేళ్లలో మత కలహాలలో మరణించిన ఆరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు పరిహారం చెక్కును సీఎం కృష్ణా కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం ఒక కులం, మతానికి చెందినది కాదన్నారు. గత ప్రభుత్వం చేసిన తారతమ్యాన్ని నేడు సరిచేశామని అన్నారు. హత్యలకు గురైన ఇద్రీష్ పాషా, మహమ్మద్ ఫాజిల్, అబ్దుల్ జలీం, దీపక్‌రావు తదితరుల కుటుంబాలకు ఈ సాయం అందజేశారు.

అధికారులూ అలసత్వం వీడండి

- మంత్రులు శరణప్రకాష్ పాటిల్, బోసురాజు
- కేడీపీ సమావేశంలో తాగునీటి సమస్యపై వాడీవేడిగా చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శరణప్రకాష్ పాటిల్, చిత్రంలో మంత్రి బోసురాజు, అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సరిగా స్పందించని అధికారులపై చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్, వైద్య విద్యా శాఖామంత్రి శరణ ప్రకాష్ పాటిల్, చిన్న నీటి పారుదల, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసురాజు పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేడీపీ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణ, మట్కా,జూదం, నకిలీ మద్యం వంటి అంశాలపై మంత్రి పాటిల్ ఎస్పీ, ఎక్సైజ్ శాఖాధికారులపై మండిపడ్డారు. పనులు చేయకుండానే బోగస్ బిల్లుల చెల్లింపునకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. దేవదుర్గ, మాన్వి, రాయచూరు గ్రామీణ నియోజకవర్గాల్లో అక్రమాలు కొనసాగుతున్నా ఎస్పీ ఏం చేస్తున్నారని మంత్రి నిలదీశారు. దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ సమావేశంలో మంత్రికి తాలూకా సమస్యలను ఏకరువు పెట్టారు. తాలూకాలో మట్కా జూదం, అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యం దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. అధికారులు తమ మాట వినడం లేదని వాపోయారు. జిల్లాలో తాగునీటి సమస్యపై, జేజేఎం, జలనిర్మల పథకాల్లో జరిగిన అక్రమాలపై వాడీవేడి చర్చ జరిగింది. రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూడాలని, నకిలీ విత్తన సమస్యపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పని చేయని అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, శివరాజ్ పాటిల్, బసనగౌడ తుర్విహాళ, హంపనగౌడ బాదర్లి, ఎమ్మెల్సీ శరణేగౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్‌లున్నారు.

పేదలకు బియ్యం పంపిణీపై నాటకాలు వద్దు

రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసే బియ్యం పథకంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణప్రకాష్ పాటిల్ ఆరోపించారు. ఆయన సోమవారం నగరంలోని వీఐపీ సర్క్యూట్ హౌస్‌లో మరో మంత్రి బోసురాజు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో నిరాశాపరులైన బీజేపీ నేతలు ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యం ఎఫ్‌సీఐ గోదాములో ముగ్గిపోతున్నాయన్నారు. రాష్ట్రానికి బియ్యం కోటా ఇస్తామని ముందు చెప్పిన ఎఫ్‌సీఐ అధికారులు కేంద్రంలోని బీజేపీ నేతల మాటలు విని చివరికి చేతులెత్తేసి పేదల కడుపు కొట్టడాన్ని ఖండించారు. జూలై నుంచి ప్రతి ఒక్కరికీ తలా 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రంలోని బీజేపీ నేతలు ఈ విషయంలో మౌనం వహించడం తగదన్నారు. ఆగస్టు 1 నుంచి గృహలక్ష్మి, 15 నుంచి గృహజ్యోతి పథకాల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించాలని సీఎం సిద్దరామయ్య కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఎయిమ్స్ మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. నగరంలో జిల్లా ఆస్పత్రి, ఒపెక్ ఆస్పత్రులను ప్రారంభిస్తామన్నారు.

గంజాయి రహిత బళ్లారిగా తీరిదిద్దుదాం

- పోలీస్ అధికారులకు ఇన్‌చార్జ్ మంత్రి సూచన



సమావేశంలో పాల్గొన్న మంత్రి నాగేంద్ర, చిత్రంలో ఐజీపీ, ఎస్పీ, మేయర్ తదితరులు

సాక్షిబళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా గంజాయికి పూర్తి అడ్డుకట్ట వేయడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఐజీ లోకేష్, ఎస్పీ రంజిత్‌కుమార్, డీఎస్పీ, నగర మేయర్ త్రివేణి తదితరులతో కలిసి పాల్గొన్న ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నివారణకు, ముఖ్యంగా గంజాయి రహిత బళ్లారిగా చేయడంపై పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. పోలీసులు తీసుకునే ఎలాంటి చర్యలకైనా తన సహకారం ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీని ముమ్మరం చేయాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణపై దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లపై నిర్దాక్షిణ్యంగా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాభివృద్ధికి సలహాలు తప్పనిసరి

బళ్లారిటౌన్: జిల్లా అభివృద్ధికి తనకు విలేకరుల సలహాలు అవసరమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా పదాధికారులతో మాట్లాడారు. నగరంలో విలేకరులు రెండు గ్రూపులుగా విడిపోవడం సరికాదన్నారు. అందరూ ఏకతాటిపై నిలిచి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. తనకు జిల్లా అభివృద్ధిపై ఎన్నో కలలు ఉన్నాయన్నారు. అన్ని నియోజకవర్గాల ప్రజలు కూడా తనపై ఆశలు పెట్టుకున్నారన్నారు. తనకు బాధ్యతల ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నారు. అభివృద్ధిలో లోపాలుంటే తన దృష్టికి తెచ్చి సహకరించాలన్నారు. త్వరలో జరిగే పత్రికా దినోత్సవానికి తాను హాజరవుతానన్నారు. సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు వీరభద్రగౌడ, జిల్లాధ్యక్షుడు వలీబాష, పదాధికారులు రవి, బజారప్ప, రఘురాం, వెంకటేష్ దేశాయి, ఇమాం గోడేకర్, జంబునాథ్, వెంకోబి తదితరులు పాల్గొన్నారు.

రాఘవ అమృత మహోత్సవానికి ఆహ్వానం

బళ్లారి అర్బన్: ఆగస్ట్ 2న బళ్లారి రాఘవ జయంతితో పాటు అమృత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుండటంతో సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్రను శాలువాతో సన్మానించి రాఘవ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షులు కే.చెన్నప్ప, రమేష్‌గౌడ పాటిల్, ప్రకాష్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి ఆహ్వానించారు.

విమ్స్‌లో సమస్యలను పరిష్కరించండి

విమ్స్ ఆస్పత్రిలో పేరుకున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్రకు ఏఐయూటీయూసీ కార్యదర్శి ఏ.దేవదాసుతో పాటు పదాధికారులు సోమవారం మంత్రి ఇంటి వద్ద వినతిపత్రాన్ని అందించారు. విమ్స్ ఆస్పత్రిలో ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్యను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తిని అస్వస్థత

- కలబుర్గి జిల్లా సేడంలో 30 మందికి పైగా హాస్టల్ విద్యార్థినులు ఆస్పత్రిలో చేరిక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సాక్షి,బళ్లారి: కలుషిత ఆహారం తినడంతో పలువురు విద్యార్థినులు ఆస్పత్రి పాలైన ఘటన కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి కలబుర్గి జిల్లా సేడం తాలూకా కోడ్లా గ్రామ సమీపంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి నిలయంలో విద్యార్థినులు భోజనం చేసిన అనంతరం ఉన్నఫళంగా రాత్రి 10 గంటల తర్వాత దాదాపు 30 మందికి పైగా విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు కావడంతో పాటు విపరీతమైన తలనొప్పి కూడా రావడంతో తక్షణం సంబంధిత వసతి నిలయ సిబ్బంది విద్యార్థినులను చికిత్స నిమిత్తం సేడం ఆస్పత్రికి తరలించారు. సంబంధిత హాస్టల్ వార్డెన్ విద్యార్థినులకు ఆహారం సక్రమంగా అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినులు అస్వస్థత గురయ్యారని విద్యార్థినుల బంధువులు వాపోయారు. వసతి నిలయంలో కలుషిత నీరు కూడా సరఫరా కావడంతో విద్యార్థినులకు తరుచూ ఆరోగ్యం దెబ్బ తింటోందని స్థానికులు ఆరోపించారు.

విలేకరుల మృతికి కారకులను శిక్షించండి

బళ్లారిఅర్బన్: ఇటీవల హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా అంకసాపుర గ్రామం వద్ద మెయిన్ రోడ్డులో టిప్పర్‌తో విలేకరుల కారును ఢీకొని ఇద్దరు విలేకరుల మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సోమవారం జిల్లా కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ వాయ్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు జిల్లాధికారి పవన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

కోలారు జిల్లాధికారిగా అక్రంపాషా

- కొడగుకు వెంకటరాజ బదిలీ

కోలారు: కోలారు నూతన జిల్లాధికారిగా అక్రంపాషా నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లాధికారిగా ఉన్న వెంకటరాజ కొడగు జిల్లాధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నియమితులైన అక్రంపాషా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

లలితారాణికి సన్మానం



లలితారాణిని పూలమాలతో సత్కరిస్తున్న దృశ్యం

గంగావతి: ఆనెగుంది జీపీ ఎస్టీ మహిళ స్థానానికి జీపీ ప్రథమ అవధిలో పంచాయతీ అధ్యక్షులు కే.తిమ్మప్ప భార్య కే.మహాదేవికి రిజర్వేషన్ సౌకర్యం లభించడంతో సోమవారం ఆ కేటగిరీ వారు పంచాయతీ అధినేత్రి లలితారాణిని కలిసి శాలువా కప్పి సత్కరించారు.

పథకాలతో ప్రగతి సాధించండి

కంప్లి: వివిధ శాఖల పథకాలు పొంది వీధి వ్యాపారులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప తెలిపారు. సోమవారం మున్సిపల్ సభాంగణంలో ఏర్పాటు చేసిన స్వనిధి సమృద్ధి మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేకించి వీధి వ్యాపారులు తమ కుటుంబాల పోషణకు బ్యాంకు సౌకర్యం కూడా పొందవచ్చన్నారు. బ్యాంకుల నుంచి రుణసదుపాయం పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. ప్రధానమంత్రి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి ఎంతో సహకరిస్తుందన్నారు. ఇక ఎస్‌బీఐ కెనరా, తుంగభద్ర గ్రామీణ, కర్ణాటక, కేసీటీ బ్యాంక్‌ల అధికారులు ఈ సమ్మేళనంలో పాల్గొని వీధి వ్యాపారులకు అనేక సూచనలు అందించారు. కార్యక్రమంలో పీఎం సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి, జన్‌ధన్, ఒన్ నేషన్ ఒన్ కార్డ్, జనని సురక్ష, పీఎం మాతృవందన యోజనల అధికారులు పాల్గొన్నారు.

జీపీ-2 రిజర్వేషన్లు ఖరారు

గంగావతి: తహసీల్దార్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో జీపీ రెండవ అవధి అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించారు. వివరాలు.. ఆనెగుంది, సంగాపుర, మరళి, వడ్డరహట్టి జీపీల అధ్యక్ష- ఎస్టీ మహిళ, ఢణాపుర, బసాపట్న, అగోలి, చిక్కబెణకల్, హణవాళ, సణాపుర అధ్యక్ష సామాన్య, మల్లాపుర, చిక్కజంతకల్, శ్రీరామనగర్ అధ్యక్ష- ఎస్సీ, వెంకటగిరి అధ్యక్ష- ఎస్టీ, ఆనెగుంది, సంగాపుర, చిక్కజంతకల్, మరళి, వడ్డరహట్టి, వెంకటగిరి, హొసకెరా ఉపాధ్యక్ష- సామాన్య, మల్లాపుర, ఢణాపుర, శ్రీరామనగర్ ఉపాధ్యక్ష-సామాన్య మహిళ, బసాపట్న, చిక్కబెణకల్, కెసరహట్టి ఉపాధ్యక్ష-ఎస్టీ మహిళ, అగోలి ఉపాధ్యక్ష- ఎస్సీ, కెసరహట్టి, హేరూరు, హొసకెరా అధ్యక్ష- సామాన్య మహిళ, హేరూరు, జంగమర కల్గుడి ఉపాధ్యక్ష స్థానం ఎస్టీ, హణవాళ, సణాపుర ఉపాధ్యక్ష స్థానం ఎస్సీ మహిళ, జంగమర కల్గుడి అధ్యక్ష స్థానం కేటగిరి ఏ మహిళకి రిజర్వేషన్లు ప్రకటించారు.

ఆర్టీసీ బస్టాండ్లు రద్దీ



మహిళలతో కిటకిటలాడుతున్న బస్టాండ్



బస్సెక్కడానికి గుమికూడిన మహిళలు

హొసపేటె: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత శక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన సంగతి విదితమే. సోమవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ మహిళలతో నిండిపోయింది. నగరం నుంచి ధర్మస్థళ, మంత్రాలయ, చిత్రదుర్గ, బెంగళూరు, శృంగేరి, హుబ్బళ్లి, మైసూరు, రాయచూరు, బీదర్, విజయపుర, బెళగావి తదితర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు మహిళలతో నిండిపోయాయి.

కోలారు వార్తలు...

కార్యవర్గానికి సన్మానం



సన్మానం అందుకున్న అధ్యక్షుడు నారాయణస్వామి, పదాధికారులు

కోలారు: యాదవ సముదాయ అభివృద్ధికి సీనియర్ల సహకారంతో నగరంలో విద్యార్థినులకు హాస్టల్ సౌలభ్యాన్ని కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా యాదవ సముదాయం అధ్యక్షుడు వక్కలేరి నారాయణస్వామి తెలిపారు. సోమవారం నగరంలోని యాదవ సముదాయ భవనంలో నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తరువాత సముదాయ ప్రముఖుల నుంచి సన్మానం స్వీకరించి మాట్లాడారు. మాజీ అధ్యక్షుడు గోకుల నారాయణస్వామి చూపిన మార్గంలో నడిచి సముదాయ అభివృద్ధికి శ్రమిస్తానన్నారు. సముదాయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. మాజీ అధ్యక్షుడు గోకుల నారాయణస్వామి, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సురేష్ బాబు, జెడ్పీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ మంత్రిపై నిరసన



పొలంలో మంత్రి ఫోటోలతో నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం కార్యకర్తలు

కోలారు: రైతులు, కూలి కార్మికుల సమస్యలపై స్పందించే వ్యక్తిని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ డిమాండ్ చేశారు. సోమవారం మంగసంద్ర గ్రామంలో నకిలీ విత్తనాలు, మందుల వల్ల టమాటా పంట నష్ట పోయిన రైతు పొలంలో సాంకేతికంగా చేపట్టిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచినా ఒక్కరికీ మంత్రివర్గంలో చోటు లేదన్నారు. జిల్లా సమస్యలపై అవగాహన లేని ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా మహిళా సంఘాల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబల్లి మంజునాథ్, మంగసంద్ర తిమ్మణ్ణ, కుప్పణ్ణ, వెంకటేశప్ప పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు అమర్చరూ

కోలారు: మెక్కె సర్కిల్ నుంచి బంగారుపేట రోడ్డు బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు, అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు ఉన్న ద్విపద రహదారికి విద్యుత్ దీపాలను అమర్చాలని గౌరీపేట సామాజిక కార్యకర్త కె ఎస్ రవీంద్రనాథ్ సోమవారం ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రోడ్డులో ఇంతవరకు విద్యుత్ దీపాలను అమర్చకపోవడంతో రాత్రిళ్లు నగర ప్రజలకు, విద్యార్థులకు రహదారిలో సంచారం కష్టకరంగా మారిందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న అమ్మవారు

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో పురాతన కరగదమ్మ దేవి ఆలయంలో 48 రోజుల మండలోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కూర్చుండ బెట్టి ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తుల సమక్షంలో ఉదయం ఆలయంలో అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి కుంభాభిషేకం తదితర పూజలను నెరవేర్చారు.

యోగా దినోత్సవంపై జాతా

కోలారు: నగరంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి సోమవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతాను జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రమేష్ ప్రారంభించారు. జాతాలో యోగా ప్రాధాన్యత, ప్రయోజనాలపై అవగాహన కల్గించే ప్లకార్డులను ప్రదర్శించారు. డాక్టర్లు ఉమా, బసవరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

కోలారు: ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధుల కంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని ఎంపీ ఎస్.మునిస్వామి అన్నారు. సోమవారం కేజీఎఫ్ తాలూకా క్యాసంబళ్లిలో ఎంపీ ఆదర్శ గ్రామం-అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు ప్రజా భాగస్వామ్యంతోనే సఫలం అవుతాయన్నారు. జీపీ అధ్యక్షురాలు విజయమ్మ, ఉపాధ్యక్షురాలు అంజలి, జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్, ఉప కార్యదర్శి వెంకటాచలపతి పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం



క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

కోలారు: జిల్లాలో ఇకపై క్రీడాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. సోమవారం పాత్రికేయుల భవనంలో 2022-23లో మైసూరులో జరిగిన 41వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల విజేతలకు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు తగిన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. నగర సభతో చర్చించి క్రీడా సంఘానికి స్థలం చూపిస్తామన్నారు. ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెప్ప, కోముల్ మాజీ డైరెక్టర్ రామకృష్ణేగౌడ, యువ సబలీకరణ క్రీడాశాఖ ఏడీ శశికళ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షా శిబిరం

కేజీఎఫ్: సుందరపాళ్యలో సోమవారం ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని పంచాయతీ అధ్యక్షుడు రాంబాబు ప్రారంభించి మాట్లాడుతూ మారుతున్న జీవన శైలిలో ఒత్తిడి మధ్యన జీవిస్తున్న ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సకాలంలో పరీక్షలు చేయించుకొని ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శిబిరంలో 500 మందికి పైగా ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. జీపీ సభ్యుడు ప్రసాద్‌స్వామి, వెంకట్రామప్ప, ఎంఎస్ రామయ్య ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

మైసూరు: బైక్ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీ.కోటె తాలూకా నంజనాయకనహళ్లి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. తాలూకాలోని సొగ్గళ్లి గ్రామానికి చెందిన ఎస్.టి. మను (28) మృతుడు. ఇతను హెచ్.డి.కోటె నుంచి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా నంజనాయకన క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాలేజీలో రక్తదాన శిబిరం

బొమ్మనహళ్లి: అన్ని దానాల్లో రక్తదానం చాలా గొప్పదని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తందానం చేయడం ద్వారా ప్రమాదాల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అగర లయన్స్ క్లబ్, జీవా బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వందమందికిపైగా యువత రక్తమిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేస్తూ, మొక్కలను నాటుతూ అందరూ సమాజానికి సేవ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అగర కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఫ్రీడం పార్కులో అంబేడ్కర్ విగ్రహం

శివాజీనగర: ఉద్యమకారుల ప్రతిరూపంగా నగరంలోని స్వతంత్ర ఉద్యానవనంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 17 అడుగుల కంచు విగ్రహం ప్రతిష్ఠించనున్నారు. మహారాష్ట్రంలోని నాసిక్‌లో అంబేడ్కర్ విగ్రహం సిద్ధమవుతోంది. త్వరలోనే విగ్రహం ప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకొంటామని సంఘం అధ్యక్షుడు అమృత్‌రాజ్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మైసూరు: కుటుంబ గొడవల కారణంగా ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరులోని కెర్గళ్లిలో చోటు చేసుకుంది. ఇక్కడ న్యాయాలయ లేఔట్‌లో నివాసం ఉంటున్న షాలిని (35), ఆటోడ్రైవర్ భాస్కర్‌కు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు, హాస్టల్లో ఉంటున్నారు. దంపతులు మధ్య ప్రతి రోజు గొడవలు జరిగేవి. దీంతో ఆదివారం సాయంత్రం కూడా గొడవ జరిగింది. తీవ్ర ఆవేదన లోనైన షాలిని ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పిల్లలకు మంచి మార్గం చూపాలి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న స్వామీజీ

చిక్కబళ్లాపురం: తల్లితండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనె మంచి మార్గాన్ని చూపించాలని ఆదిచుంచనగిరి పీఠాధ్యక్షులు శ్రీశ్రీ నిర్మలానందనాథస్వామీజీ అన్నారు. సోమవారం ఆదిచుంచనగిరి ట్రస్టు శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో బీజీఎస్ విద్యా సంస్థల నేతృత్వంలో జరిగిన చిన్నారుల అక్షరభ్యాసం కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారిని బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర, శ్రీ మంగళానందనాథ స్వామీజీ, ప్రిన్సిపాల్ రాజు, మఠం సభ్యుడు నాగరాజు, బీజీఎస్ ప్రిన్సిపల్ మోహన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పులి దాడిలో గేదె మృతి

మైసూరు: దక్షిణ కొడగులో పులి దాడిలో గేదె మృతి చెందిన ఘటన పోన్నంపేట తాలూకా బాడగరకెరె గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌కు చెందిన గేదెపై దాడి చేసి చంపేసింది. నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతు డిమాండ్ చేస్తున్నాడు.

ఆవును చంపితిన్న పులి :

మైసూరు జిల్లాలోని గుండ్లుపేట తాలూకా కుందకెరె గ్రామానికి చెందిన రైతు శివ ప్రకాశ్‌కు చెందిన ఆవును పులి చంపి తినింది. వ్యవసాయ స్థలంలో మేస్తుండగా పులి దాడి చేసి గొంతు వరకు తినేసిందని బాధితుడు వాపోయాడు. అటవీ అధికారులు పరిశీలించి నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కోల్పోయాం.. రోడ్డున పడ్డాం

- ప్రైవేట్ బస్సు యజమానుల ఆవేదన
- పన్నులు ఎలా చెల్లించాలి, కుటుంబాలను ఎలా పోషించాలి
- ఉచిత ప్రయాణాల పర్యవసానం



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న ప్రైవేట్ బస్సులు

గౌరిబిదనూరు: ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి యోజన పథకం తమను పూర్తిగా రోడ్డున పడేలా చేసిందని పలువురు ప్రైవేట్ బస్సు యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల వైపే మొగ్గు : గతంలో గ్రామీణ ప్రదేశాలలో నగరానికి ప్రైవేట్ బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అని ప్రకటించడంతో ఎంత సేపైనా ఆ బస్సుల కోసం మహిళలు వేచి ఉంటున్నారు. సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి వస్తుందని బస్సుల నిర్వాహకులు చెబుతున్నారు.

అమ్మదామన్నా కొనేవారే లేరు :

బస్సులను అమ్మేస్తామన్నా కొనేవారు లేరు. రెండేళ్ల క్రితం కరోనా పూర్తిగా దెబ్బతీసింది. ఇప్పుడు ఊహించని పరిణామం ఎదురైంది. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి, సిబ్బందికి జీతాలు ఎలా చెల్లించాలని అని బస్సుల యజమానులు నిరాశలో ఉన్నారు. మూడు నెలలకు రూ.7,952 రోడ్డు ట్యాక్స్ కట్టాలి, ఏడాదికి రూ. 72,202 బీమా ప్రీమియం, ఎఫ్‌సిలు చేయించాలి, వ్యాపారాలే లేకున్నప్పుడు ఇంత మొత్తం ఎలా చెల్లించాలి అంటూ బస్సుల ఆపరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిపై వేటు : కేవలం యజమానులే కాదు బస్టాండ్లలో టికెట్లు ఇచ్చే లోడర్లు, డ్రైవర్, కండక్టర్లు, వారి కుటుంబాలు వీధిన పడాల్సిన పరిస్థితి వచ్చింది. పెద్దల కాలం నుంచి బస్సులపైనే జీవితాలు నడుస్తున్నాయి. ప్రభుత్వం తాజా నిర్ణయం ట్రావెల్ నిర్వాహకులకు అశనిపాతంలా మారింది.

కష్టంగా మారింది



మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాలు కల్పించడంతో ప్రైవేట్ బస్సులు ముఖం చూసే వారే కనిపించలేదు, దీంతో ఎలా నెట్టుకు రావాలో అర్థం కావడం లేదు. జీతాలు చెల్లించలేని పరిస్థితి వస్తోంది.

– ప్రదీప్, బస్సు యజమాని

ఎలా బతకాలి



నాలుగైదు బస్టాండ్లలో టికెట్లు విక్రయించి రోజుకు రూ. 200 నుంచి 300 సంపాదించే వారం, ప్రభుత్వం ఇప్పుడు మా పొట్ట కట్టింది. ప్రయాణికులే లేకుంటే మాకు కమీషన్ ఎలా వస్తుంది, కుటుంబాలను ఎలా పోషించాలి. గౌరిబిదనూరు బస్టాండులో 15 మందికిపైగా ఏజెంట్లు ఉన్నారు.

– నాగేశ్, బస్ ఏజెంట్

హేమావతి కాలువ పరిశీలన



అధికారులతో కలిసి కాలువను పరిశీలిస్తున్న హోం మంత్రి

తుమకూరు: తుమకూరు జిల్లా ప్రజలకు తాగునీరు అందించే గుబ్బి తాలూకాలోని హేమావతి కాలువను హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్ పరిశీలించారు. సోమవారం ఆయన గుబ్బి తాలూకాలోని ఈడకనహళ్లి గ్రామంలో ఉన్న హేమావతి కాలువ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. అంతకు ముందు బుగుడనహళ్లి చెరువును కూడా పరిశీలించారు. హేమావతి కార్య నిర్వహణ ఇంజనీర్ వరదయ్యతో మాట్లాడి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టిప్పర్ లారీ ఢీకొని పూజారి మృతి



తుమకూరు: ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీకొన్న ఘటన తుమకూరు జిల్లా హులియూరులోని రామగోపాల్ సర్కిల్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. యళనాడు గ్రామ సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో పూజారిగా పనిచేసే షడాక్షరయ్య (60) మృతి చెందాడు. ఇతను ఫుట్‌పాత్‌పై తన వాహనంపై కూర్చొని ఉండగా వెనుక నుంచి వేగంగా ఇసుకలోడ్‌తో వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ రద్దీపై డేగ కన్ను



యశవంతపుర దీన్ దయాల్ పై వంతెన వద్ద ట్రాఫిక్ రద్దీ (ఫైల్)

- డ్రోన్ల ద్వారా బెంగళూరు ట్రాఫిక్ నియంత్రణకు నాంది

బనశంకరి: బెంగళూరు నగరాన్ని విపరీతమైన ట్రాఫిక్ రద్దీ పీడిస్తోంది. కిలోమీటరు ప్రయాణానికి కూడా గంటలు పడుతోంది, దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండగా ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అమలు చేస్తున్నప్పటికీ ఫలితం అంతంతమాత్రంగా ఉంటోంది.

ఈ నేపథ్యంలో డ్రోన్ కెమెరాలను ఆశ్రయిస్తున్నారు. ప్రజల రద్దీ, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి పర్యవేక్షించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ప్రయోగాత్మతంగా వినియోగించారు. హెబ్బాల, గురగుంటెపాళ్య, టిన్ ఫ్యాక్టరీ బ్రిడ్జి, బనశంకరి, సారక్కి జంక్షన్, ఇబ్బలూరు, ట్రినిటి సర్కిల్‌తో పాటు 20 పైగా జంక్షన్లను గుర్తించారు.

ఎలా పనిచేస్తుంది?

సేఫ్ సిటీ పథకం కింద ఇప్పటికి 8 డ్రోన్ కెమెరాలను కొనుగోలు చేశారు. 4 డ్రోన్ కెమెరాలను ట్రాఫిక్‌కి కేటాయించారు. ఆకాశం నుంచి కూడళ్లను గమనిస్తే ఎక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంది అనేది స్పష్టంగా తెలుస్తుంది, దానిని బట్టి తక్కువ ఉన్న ప్రాంతాల వైపు మళ్లించడానికి వీలుంటుంది. అదే రీతిలో డ్రోన్లను ఎగరేసి ట్రాఫిక్ ఎక్కడ ఎక్కువ, తక్కువగా ఉందో గమనిస్తారు. అలాగే ఎంత దూరం వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది అనేది తెలుస్తుంది. ఇదే సమాచారాన్ని ట్రాఫిక్ నిర్వహణ కేంద్రానికి చేరవేస్తారు. అక్కడ నుంచి ట్రాఫిక్ డైవర్షన్ చేస్తారు.



డ్రోన్ ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణతోనైనా సత్ఫలితాలు రావాలి

3 నెలల్లో రద్దీ పరిష్కారం

డ్రోన్ వినియోగం పట్ల ట్రాఫిక్ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చామని నగర ట్రాఫిక్ విభాగం డీఐజీ ఎం ఎన్.అనుచేత్ తెలిపారు. మూడునెలల్లోగా నగర ట్రాఫిక్ రద్దీ పూర్తిగా నిర్మూలిస్తామని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. ఇందుకోసం పోలీసులు పీక్ అవర్స్‌లో కచ్చితంగా రద్దీ ప్రాంతాల్లో ఉండాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఐబీసీ పెట్టుబడులు

బనశంకరి: ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన లిథియం తయారీకి పేరుపొందిన ఇంటర్నేషనల్ బ్యాటరీ కంపెనీ (ఐబీసీ) రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతోందని, దీనికి సంబంధించి భారీ మధ్య తరహా పరిశ్రమల శాఖమంత్రి ఎంబీ.పాటిల్ కంపెనీ ఉన్నత ప్రతినిధులతో సోమవారం ప్రాథమిక చర్చలు జరిపారు. నగరంలోని ఖనిజ భవన్‌లో మంత్రి ఎంబీ.పాటిల్ మాట్లాడుతూ... ఎలక్ట్రిక్ వాహనాల రంగం జనప్రియమౌతుంది. కానీ మనం లిథియం ఉత్పత్తి చేయడం లేదు, ఐబీసీ కంపెనీ ఈ దృష్టితో ముందుకు రావడాన్ని స్వాగతించారు. కంపెనీ అడిగిన సౌలభ్యాలను కల్పించడం పట్ల పరిశీలించి ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చిస్తామని తెలిపారు. ఐబీసీ కంపెనీ అధ్యక్షుడు వెంకటేశ్ వల్లూరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రాణం తీసిన జాలీరైడ్

యశవంతపుర: నలుగురు విద్యార్థులు కారులో జాలీరైడ్‌కు వెళ్లగా వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పీణ్యా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఆచార్య కాలేజీలో బీబీఎం చివరి సంవత్సరం చదువుతున్న ప్రక్యాత్ (22) మృతి చెందగా, నటరాజ్, రక్షిత్, బసవగౌడలు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున హెసరఘట్ట రోడ్డులో వేగంగా కారులో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభం ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రక్యాత్ మృతి చెందగా ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

యశవంతపుర: ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన బెంగళూరు విజయనగర ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పట్టిగారపాళ్య వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పట్టిగారపాళ్యకు చెందిన ఆటో డ్రైవర్ సంతోష్ (33) మృతి చెందారు. రాత్రి 10 గంటల సమయంలో మాగడి రోడ్డులో వేగంగా వెళ్తుండగా ఆటో అదుపుతప్పి బ్రిడ్జిని ఢీకొని బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సంతోశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. విజయనగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యూనిఫాం పంపిణీ



తుమకూరు: తుమకూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, హోం గార్డులకు నూతన వస్త్రాలు, షూలు అందజేశారు. నగరంలో ఉన్న హోం గార్డుల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హోం గార్డుల కమాండెంట్ పాతణ్ణ సిబ్బందికి నూతన యూనిఫారం అందజేశారు.

విద్యావేత్త గిరిగౌడ మృతి

యశవంతపుర: బెంగళూరు గంగోత్రి విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం గిరిగౌడ (73) సోమవారం తెల్లవారుజామున బెంగళూరు సుంకదకట్టలోని తన నివాసంలో కన్నుమూశారు. విద్యా, సాంస్కృతిక రంగంలో నిరుపమాన సేవలందించారు.

ఆస్తి తగాదాల్లో వ్యక్తి దారుణ హత్య

- పట్టపగలే ఘాతుకం
- భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు



హత్యకు గురైన తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కొడుకు

కెలమంగలం: ఆస్తి తగాదాల్లో ఏర్పడిన విబేధాల్లో ఓ వ్యక్తిని పట్టపగలే నరికి చంపారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...డెంకణీకోట తాలూకా కర్ణాటక సరిహద్దు గ్రామమైన గుమ్మళాపురంకు చెందిన కోటప్ప కొడుకు రమేష్ (45). పెదనాన్న కెంపణ్ణ కొడుకు కోటప్ప (38)ల మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కోటప్ప తన అనుచరులతో రమేష్ ఇంటికెళ్లి ఘర్షణకు దిగారు. వారి నుంచి తప్పించుకొని రమేష్, భార్య సుధ (32), కొడుకు రవి(20)లు పరుగెత్తారు. ఈ సమయంలో కోటప్పతో పాటు అతని వర్గీయులు రమేష్‌పై వేటకొడవళ్లతో దాడి చేశారు. అడ్డొచ్చిన భార్య, కొడుకుపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనలో రమేష్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. తళి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన తల్లీ, కొడుకును కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ ఆస్పత్రికి తరలించారు. రమేష్ శవాన్ని స్వాధీనం చేసుకుని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

తుమకూరు జిల్లా అధికారిగా శ్రీనివాస్



తుమకురు: తుమకూరు జిల్లా అధికారిగా కే శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ సీఈఓ విద్యాకుమారి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బాలికల ఆచూకీ లభ్యం

యశవంతపుర: ఈనెల 16న అదృశ్యమైన అక్క, చెల్లి ఆచూకీ లభించింది. కోణనకుంటె పోలీసులు సురక్షితంగా బెంగళూరుకు తీసుకొచ్చారు. వివరాలు.... గొట్టిగెరెకి చెందిన ఆటో డ్రైవర్‌కు ఇద్దరు కుమార్తెలు. వీరు 9,10 తరగతులు చదువుతున్నారు. ఈనెల 16న వీరు బెంగళూరులోని ఓ స్టోర్‌కు వెళ్లారు. అక్కడ చాక్లెట్లు తీసుకోవడానికి డబ్బులు పంపాలని తండ్రిని కోరారు. దీంతో ఆయన డబ్బులు లేవంటూ తీవ్రస్థాయిలో మందలించారు. తండ్రి దెబ్బకు భయపడిన ఇద్దరు బస్సు ఎక్కి ధర్మస్థలకు బయలుదేరారు. సాయంత్రమైన ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు భయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా వీరిద్దరు ధర్మస్థల బస్సు ఎక్కినట్లు గుర్తించారు. బెంగళూరు పోలీసులు ధర్మస్థల వెళ్లి బాలికలను గాలించి సురక్షితంగా బెంగళూరు తీసుకువచ్చారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

సమాజ సేవకులకు భగవంతుడు తోడు

బనశంకరి: సమాజసేవ, నిరుపేదల కన్నీరు తుడిచే ప్రజలకు భగవంతుడు ఎప్పుడూ తోడుగా ఉంటారని కనకగురు పీఠ శ్రీ ఈశ్వరానందస్వామి తెలిపారు. సోమవారం లగ్గెరెలో అర్పిత సేవా ట్రస్ట్ మాజీ బీబీఎంపీ సభ్యురాలు మంజుల నారాయణస్వామి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరం, ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో 90కి పైగా మార్కులు సాధించిన 500 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 50 మంది నిరుపేద విద్యార్థులకు ల్యాప్‌టాప్ వితరణ కార్యక్రమాన్ని ఈశ్వరానంద స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. కోవిడ్ లాంటి సమయంలో మంజుల నారాయణస్వామి, అనేక సేవలందించిన కాంగ్రెస్ నాయకురాలు హెచ్.కుసుమాకు దేవుడు ఆయురారోగ్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామదేవత దుగ్గమ్మ దేవతను ఊరేగించారు. పూర్ణకుంభాలతో మహిళలు పాల్గొన్నారు. ఎంపీ డీకే.సురేశ్, స్వామీజీలు పాల్గొన్నారు.

చోరీ కేసులో డ్రైవర్ అరెస్ట్

యశవంతపుర: పని కల్పించిన ఇంటిలోనే చోరీకి పాల్పడిన డ్రైవర్‌ను రాజరాజేశ్వరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ. 4 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రెస్టిజ్ భాగమనే టెంపల్‌బెల్ట్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కార్తీక్ కిరణ్ ఇంటిలో బంగారు అభరణాలను చోరీకి గురయ్యాయి. ఆ ఇంటి డ్రైవర్ అదృశ్యమయ్యాడు. అనుమానంతో ఇంటి యజమాని రాజరాజేశ్వరినగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రైవర్‌ను అరెస్ట్ చేసి 67 గ్రాముల బంగారం, కారును స్వాధీనం చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



వరిధాన్య గిడ్డంగిని పరిశీలిస్తున్న కలెక్టర్ శరయు

హోసూరు: హోసూరు అందివాడి సమీపంలోని ధాన్యం గిడ్డంగిలో ఆదివారం సాయంత్రం కలెక్టర్ శరయు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ అందివాడి చెక్‌పోస్ట్ వద్ద వినియోగదారుల సంక్షేమ శాఖ ద్వారా వరి గిడ్డంగిని ఆరు బయట నిర్వహిస్తున్నారు. సుమారు ఏడు ఏకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గిడ్డంగిలో వర్షాలు కురిసి సేకరించిన వరి మొలకెత్తిందని ఆదివారం ఉదయం నుంచి జనమాధ్యమాలలో వీడియోలు ప్రచారం కావడంతో విషయం తెలుసుకొన్న కలెక్టర్ ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ గిడ్డంలో సుమారు 16 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని నిలువ ఉంచారని, ఇప్పటి వరకు 8500 మెట్రిక్ టన్నుల వరిని మిల్లుకు తరలించినట్లు, మిగిలిన 7500 టన్నుల ధాన్యం భద్రంగా ఉందని, ఈ ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో జిల్లాలోని 62 మిల్లులకు పంపుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట మండల మేనేజర్ శక్తిసారల్, తహసీల్దార్ సుబ్రమణి తదితరులు ఉన్నారు.

వినికిడి యంత్రాలు అందజేత

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో నలుగురు దివ్యాంగులకు రూ. 35 వేల విలువ చేసే ఉపకరణాలను కలెక్టర్ శరయు అందజేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, మురుగు కాల్వల ఏర్పాటు, వృద్ధాప్య పెన్షన్, రోడ్ల వసతి, విద్యుత్ కనెక్షన్, వీధిదీపాల ఏర్పాటు, ఉచిత కుట్టు యంత్రాలు, చలువపెట్టెలు, ఆర్థిక సాయం కోరుతూ 247 వినతులు అందజేశారు. స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అంగవికల సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, త్రిచక్ర వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, వేడియప్పన్, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

హోసూరు: తన ప్రేమను అంగీకరించ లేదని కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న ఘటన హోసూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... పట్టణంలోని రాజగణపతి నగర్ ప్రాంతానికి చెందిన కుమరవేల్ కొడుకు అరుణ్ (20). ప్రైవేట్ కళాశాలలో బికాం చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. అతని ప్రేమను ఆమె నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెందిన అరుణ్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ల దొంగలు అరెస్ట్

హోసూరు: పాదచారుల వద్ద సెల్‌ఫోన్‌లు లాకెళ్తున్న మహిళతో పాటు 7 మంది దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు, బేరికె, సూళగిరి ప్రాంతాల్లో పాదచారులను అడ్డగించి కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్‌లు దోచుకెళ్లుతున్నారని పోలీసులకు ఫిర్యాదులందాయి. ఫిర్యాదుల మేరకు పోలీసులు తీవ్ర విచారణ చేపట్టి దారిదోపిడీలకు పాల్పడుతున్న సూళగిరి ప్రాంతానికి చెందిన దిలీప్, పార్థిభన్, హానెస్ట్‌రాజ్, సుధాకర్, శరణ్య, బాలుడు, హోసూరు రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మంజులను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 20 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

హెచ్ఎంకు ఘనంగా వీడ్కోలు

హోసూరు: డెంకణీకోట తాలూకా బాలతోటనపల్లి ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) శ్రీరాములరెడ్డి పదవీ విరమణ ఘనంగా జరిగింది. సహచర ఉపాధ్యాయులు ఆయనను సన్మానించి విద్యాభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ పాఠశాలలో గత ఏడేళ్లుగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం నళిననేత్ర, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ చెత్త తొలగింపు

హోసూరు: అటవీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను హోసూరుకు చెందిన విత్ యూ కల్వి సభ్యులు అటవీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా కుందుకోట గ్రామంలో చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించి, వాహనదారులకు కరపత్రాలు పంచిపెట్టి చైతన్యం కల్పించారు. కుందుకోట నుంచి అంచెట్టి వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం వివిధ ప్రాంతాల నుంచి హొగేనక్కల్‌కు వెళ్లే పర్యాటకులు ఆహారం తిని ప్లాస్టిక్ సంచులను పడేస్తుంటారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను వన్యప్రాణులు ఆహారంగా తీసుకోవడంతో అనారోగ్యానికి గురవుతాయని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా సుమారు 2500 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి నిప్పంటించారు. అటవీశాఖాధికార్లు బాలమురుగన్, సుకుమార్, వీరశెట్టిపేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్యమధు

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలో వివిధ అభివృద్ధి పనులకు యూనియన్ చైర్‌పర్సన్ లావణ్య మధు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణంలోని అన్నానగర్, వానియర్ వీధి తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీడీవో విమల్ రవికుమార్, ఇంజనీర్ సుమతి, యూనియన్ కౌన్సిలర్ తమిళ్ సెల్వి రాజారామ్, గోవిందస్వామి, రవికుమార్, సెల్వరాజ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు దరఖాస్తుల స్వీకారం సాగుతోంది. సోమవారం బెంగళూరులో ఎన్ఆర్ కాలనీలో ఓ సేవాకేంద్రం వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు



సోమవారం గుల్బర్గాలోని గుల్బర్గా విశ్వవిద్యాలయం 41వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. పీజీ, ఇతర కోర్సుల పట్టభద్రులకు గవర్నర్ గెహ్లాట్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మెడల్స్ పొందిన ప్రతిభావంతుల ఆనందం

ఏపీ విధానాలు ప్రపంచానికే ఆదర్శం

ఇథియోపియా ప్రతినిధి బృందం ప్రశంస

తమ దేశంలోనూ వీటి అమలుకు తగిన సహకారమందించాలని వినతి

గన్నవరం కాల్ సెంటర్, ఆర్బీకే స్టూడియోను సందర్శించిన బృందం

సాక్షి, అమరావతి: 'రైతులకు సాంకేతికతను చేరువ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కృషి బాగుంది. మీ ఆలోచన విధానాలు ప్రపంచానికే ఆదర్శం. మాది వ్యవసాయాధారిత దేశం. మీ విధానాలు, సాంకేతికత అందిపుచ్చుకోవాలని ఆశిస్తున్నాం. అందుకు తగిన సహకారం అందించండి' అని ఇథియోపియా దేశ ప్రతినిధి బృందం ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఐదు రోజుల పర్యటన కోసం సోమవారం రాష్ట్రానికి విచ్చేసిన ఇథియోపియా బృందానికి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ స్వాగతం పలికారు. అనంతరం కృష్ణా జిల్లా గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం(ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్), ఆర్బీకే చానల్ స్టూడియోలను ఇథియోపియా బృందం సందర్శించింది. ఆర్బీకేలు, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వల్లూరు శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఆర్బీకే యూట్యూబ్ చానల్ స్టూడియోలో శాస్త్రవేత్తలతో ముఖాముఖీ, వివిధ పంటల సాగులో అభ్యుదయ రైతుల అనుభవాలతో పాటు తెగుళ్లు, పురుగుల నివారణకు వ్యవసాయ విశ్వవిద్యాలయ, వ్యవసాయ పరిశోధన స్థానాల శాస్త్రవేత్తల సూచనలతో రూపొందిస్తున్న వీడియోలను వారు పరిశీలించారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేస్తున్న తీరును పరిశీలించడంతో పాటు ఆర్బీకేల ద్వారా అందిస్తున్న రైతు భరోసా సచిత్ర మాస పత్రిక గురించి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ కృషిని ఇథియోపియా బృందం ప్రశంసించింది. తమ దేశంలోనూ రైతులకు ఈ తరహా విధానాలను అందుబాటులోకి తెచ్చేందుకు తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది. బృందంలో ప్రపంచ బ్యాంకు సలహాదారు హిమ్మత్ పటేల్, ఇథియోపియా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు డా.ఆదిషు బెజ్ బెహ్ అలి, అన్ దువాలేమ్, అబ్రహాం టేస్ పాయె, ఆరెగా సేమెగా, ఎల్ షాడే బెలేటే తదితరులున్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, గన్నవరం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ అధికారి వై.అనురాధ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం సమీకృత రైతు సమాచార కేంద్రంలో రైతుల నుంచి వచ్చే కాల్స్‌కి శాస్త్రవేత్తలు, అధికారులు సమాధానాలు ఇస్తున్న తీరును పరిశీలిస్తున్న ఇథియోపియా ప్రతినిధి బృందం

నేడు గొల్లపూడి ఆర్బీకే సందర్శన

ఇథియోపియా ప్రతినిధి బృందం మంగళవారం గొల్లపూడి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించనుంది. ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించి.. సంబంధిత సిబ్బంది, రైతులతో మాట్లాడనుంది. అనంతరం సమీప గ్రామాల్లో పర్యటిస్తుంది.

ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియపై హైకోర్టులో పిల్

- కౌంటర్లు దాఖలు చేయాలని ఈసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా మచిలీపట్నం శాసనసభా నియోజకవర్గం పరిధిలో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను పారదర్శకంగా, చట్ట నిబంధనలకు అనుగుణంగా చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల అధికారి తదితరులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 3కి వాయిదా వేసింది. ఒకే ఇంట్లో నివసిస్తున్న ఓటర్లందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కల్పించేలా ఆదేశాలు జారీ చేయడంతోపాటు అర్హులకు ఓటు హక్కు నిరాకరించకుండా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మచిలీపట్నంకు చెందిన వ్యాపారి ఇమదాబత్తుల దిలీప్‌కుమార్ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎంవీ రమణకుమారి వాదనలు వినిపిస్తూ.. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కల్పించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదన్నారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం మాన్యువల్ ప్రకారం ఓటరు నివసించే ప్రాంతానికి 2 కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ బూత్ ఉండాలన్నారు. అయితే దీన్ని అధికారులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.



మొబైల్స్ సహా అన్ని గ్యాడ్జెట్స్‌కు ఒకే చార్జింగ్ కేబుల్ కావాలంటున్న వినియోగదారులు

దీనిపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు వెల్లడి

లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో 78 శాతం మంది అభిప్రాయం ఇదే

సింగిల్ చార్జర్‌కే జై

సాక్షి, హైదరాబాద్: నేటి సాంకేతిక ప్రపంచంలో దాదాపు అందరి ఇళ్లలోనూ ఒకటికన్నా ఎక్కువే మొబైల్ ఫోన్లు ఉంటున్నాయి. అలాగే చాలా మంది ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగానే వినియోగిస్తున్నారు. కానీ మొబైల్‌ఫోన్లు, ట్యాబెట్లు ఒక్కోటి ఒక్కో కంపెనీది, ఒక్కో తరహాది కావడంతో వాటికి వాడే చార్జర్లు సైతం అదే సంఖ్యలో ఉంటున్నాయి. దాని బదులు అన్ని రకాల గ్యాడ్జెట్స్ కోసం ఒకే తరహాలో ఉండే చార్జింగ్ కేబుల్స్‌ను తయారు చేస్తే ఈ-వేస్ట్‌ను అరికట్టడంతోపాటు ఇళ్లలోనూ చార్జర్ల సంఖ్యను తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇందుకోసం ఒకే తరహా చార్జింగ్ కేబుల్స్ ఉండాలని నిర్ణయించింది. అన్ని మొబైల్ డివైస్‌లు, ట్యాబ్లెట్లకు ఒకే తరహా యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్ పోర్ట్ కేబుల్ ఉండేలా అన్ని తయారీ కంపెనీలు వాటి ఉత్పత్తుల తయారీలో మార్పులు తేవాలని ఇప్పటికే ఆదేశించింది. 2025 మార్చి నాటికి ఈ విధానాన్ని అమల్లోకి తేనున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. కేంద్రం నిర్ణయాన్ని మొబైల్ వినియోగదారులు స్వాగతిస్తున్నట్లు లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 78 శాతం మంది ఒకే తరహా చార్జింగ్ కేబుల్‌కే జై కొట్టారు. దేశవ్యాప్తంగా మొత్తం 303 జిల్లాల నుంచి 23 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు సంస్థ వెల్లడించింది. సర్వేలో వెల్లడైన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి..



మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లకు ఒకే తరహా యూఎస్‌బీ చార్జింగ్ కేబుల్ ఉండాలి:	కేవలం మొబైల్‌ఫోన్లకు ఒకే తరహా యూఎస్‌బీ చార్జింగ్ కేబుల్ ఉండాలి:	ఒకే కంపెనీ మొబైల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు ఒకే తరహా చార్జింగ్ కేబుల్ ఉండాలి:
78 శాతం మంది	9 శాతం మంది	4 శాతం మంది
ఇప్పుడున్నట్టుగానే చార్జింగ్ కేబుల్స్ ఉంటేనే మేలు: 6 శాతం మంది		ఏమీ చెప్పలేం: 3 శాతం

మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌ల తయారీ కంపెనీలు వేర్వేరు రకాల చార్జింగ్ కేబుల్స్ ఎందుకు తయారు చేస్తున్నాయి?		
వారి ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకొనేందుకు: 32 శాతం మంది	సరైన అవగాహన లేకపోవడం: 6 శాతం మంది	ప్రభుత్వం నుంచి ఎలాంటి నిబంధనలు లేకపోవడం: 13 శాతం మంది
పై అన్ని కారణాలతో: 38 శాతం మంది		
ఇతర కారణాలు: 4 శాతం మంది	ఏం చెప్పలేం: 7 శాతం మంది	

దేశంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్

హనుమంతునిపాడు

- ప్రకటించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ



డీజీపీ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని అందుకుంటున్న ప్రకాశం జిల్లా ఎస్పీ, పోలీస్ సిబ్బంది

సాక్షి, అమరావతి/ఒంగోలు టౌన్: పనితీరు ఆధారంగా ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్‌ను 2022కు ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ప్రకటనలో తెలిపింది. నేర నియంత్రణ, చట్టాల అమలు, కేసుల దర్యాప్తు, కోర్టు సమన్ల పర్యవేక్షణ, ప్రోయాక్టివ్ పోలీసింగ్, కమ్యూనిటీ మేనేజ్మెంట్, పెట్రోలింగ్ నిర్వహణ, పచ్చదనం-పరిశుభ్రత అంశాలను ప్రమాణాలుగా తీసుకుని ఈ ఎంపిక జరిపింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ జారీ చేసిన ప్రశంసా పత్రాన్ని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్, హనుమంతునిపాడు ఎస్సై కృష్ణ పావనికి మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రదానం చేశారు. ఎస్పీకి రూ.25 వేలు, ఎస్సైకు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు.

బీమా కవరేజ్‌లో ఏపీ అద్భుతం

- పీఎంఎఫ్‌బీవై సీఈవో రితీశ్ చౌహాన్
- అన్నమయ్య జిల్లా దొడ్డిపల్లి ఆర్బీకే సందర్శన



దొడ్డిపల్లి ఆర్బీకేలో సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న రితీశ్ చౌహాన్

సాక్షి, అమరావతి: కేంద్రం నోటిఫై చేసిన పంటలకు రైతులపై పైసా భారం పడకుండా.. సాగు చేసిన ప్రతి ఎకరాకు యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర వ్యవసాయ కుటుంబ, సంక్షేమ శాఖ సహాయ కార్యదర్శి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) సీఈవో, నాఫెడ్ ఎండీ రితీశ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ పరిధిలోని దొడ్డిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆర్బీకే ద్వారా అందిస్తోన్న సేవలను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ-క్రాప్ నమోదు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు తీరుపై ఆరా తీశారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించిన రశీదులను పరిశీలించి, ఎలా నమోదు చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతంలో సాగు చేసిన పంటలకు కేంద్రం నిర్దేశించిన ప్రీమియం చెల్లించిన వారికే పరిహారం దక్కేదని రైతులు ఆయనకు తెలిపారు. అయితే తమ రాష్ట్రంలో ప్రస్తుతం నోటిఫై చేసిన ప్రతి పంటకు, ప్రతి ఎకరాకు బీమా సదుపాయం లభిస్తోందని చౌహాన్‌కు వివరించారు. దీంతో ఈ తరహా యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పించడం నిజంగా అద్భుతమని ఆయన కొనియాడారు. అందువల్లే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకొని ఫసల్ బీమా యోజన నిబంధనల్లో పలు మార్పులు చేశామన్నారు. ఖరీఫ్-22 సీజన్ నుంచి రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పంటల బీమా పథకంతో పీఎంఎఫ్‌బీవైను అనుసంధానం చేసి అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆర్‌బీఐ గవర్నర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాము ఏప్రిల్ 24న ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని స్పష్టం చేసింది. జూలై 7లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది. బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో బ్యాంక్ జారీచేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ ఏపీ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ షేర్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ సాగుతోంది. ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులు, వాటాదారుల ప్రయోజనాలను రక్షించడంతోపాటు బ్యాంకు రోజువారీ లావాదేవీలను యథావిధిగా కొనసాగించేందుకు రిజర్వు బ్యాంక్ చర్యలు చేపట్టాలని హైకోర్టు ఏప్రిల్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం ఆర్‌బీఐ తనకు నచ్చిన అధికారిని నియమించుకోవచ్చని తెలిపింది. అయితే ఇప్పటి వరకు నియమించకపోవడంతో మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ షేర్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

పూర్తిస్థాయిలో 'స్విమ్స్' అభివృద్ధి

- రూ.97 కోట్లతో కార్డియో న్యూరో బ్లాక్..
- రూ.7.75 కోట్లతో సెంట్రలైజ్డ్ గోడౌన్.. రూ.7 కోట్లతో సెంట్రలైజ్డ్ వంటశాల నిర్మాణం
- రూ.4.15 కోట్లతో తిరుమల అదనపు లడ్డూ కౌంటర్ నిర్మాణానికి ఆమోదం
- టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయాలు..



ధర్మకర్తల మండలి సమావేశంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి తదితరులు

తిరుమల: స్విమ్స్ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మరింత మెరుగైన వైద్యం అందిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం చైర్మన్ అధ్యక్షతన తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వైవీ మీడియాకు వెల్లడించారు. వాటిలో ముఖ్యమైనవి..

- స్విమ్స్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు రూ.97 కోట్లతో కార్డియో న్యూరో బ్లాక్, రూ.7 కోట్లతో సెంట్రలైజ్డ్ వంటశాల, రూ.7.75 కోట్లతో సెంట్రలైజ్డ్ గోడౌన్ నిర్మాణానికి టెండర్లు ఆమోదం.
- రూ.4.15 కోట్లతో తిరుమలలో అదనపు లడ్డూ కౌంటర్ల నిర్మాణానికి టెండర్ల ఆమోదం.
- రూ.2.35 కోట్లతో తిరుమల హెచ్‌వీసీ ప్రాంతంలోని 18 బ్లాకుల్లో గల 144 గదుల అభివృద్ధి పనులు..
- రూ.40.50 కోట్లతో తిరుమలలో వెస్ట్ ప్యాకేజీకి గాను మూడేళ్ల కాలపరిమితికి ఎఫ్‌ఎంఎస్ సేవలను ముంబైకి చెందిన సంస్థకు అప్పగించేందుకు టెండర్ల ఆమోదం.
- అదేవిధంగా.. రూ.29.50 కోట్లతో శ్రీవారి సేవాసదన్, వకుళమాత విశ్రాంతి గృహం, పీఏసీ 3, 4, బి-టైప్, డి-టైప్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంఎస్ సేవలను అదే సంస్థకు అప్పగించేందుకు టెండర్ల ఆమోదం.
- గుజరాత్‌లోని గాంధీనగర్, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు ప్రణాళిక.

శ్రీవాణి నిధులపై శ్వేతపత్రం

శ్రీవాణి ట్రస్టు నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని.. ఈ అంశంపై రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీటీడీపై దుష్ప్రచారం చేసేవారి మీద చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. అలాగే, టీటీడీలో పూర్తి పారదర్శక పాలన జరుగుతోందని.. ఇందుకు సంబంధించి టీటీడీ ఆస్తులపై 2021 జూన్ 21న, బంగారు, నగదు డిపాజిట్లపై 2022 నవంబరు 5న శ్వేతపత్రాలు విడుదల చేశారని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం ప్రతి నెలా ఆయా ఆలయ కమిటీల బ్యాంకు ఖాతాలో రూ.5 వేలు జమచేయాలని పాలకమండలి నిర్ణయించిందన్నారు. టీటీడీ నుంచి ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంచేశారు.

పూతలపట్టు ఎస్సై సహా ఆరుగురిపై అత్యాచారం కేసు నమోదు

ఎస్సై, సీఐపై బదిలీ వేటు.. విచారణకు ఆదేశించిన చిత్తూరు ఎస్పీ

చిత్తూరు అర్బన్: చోరీ కేసులో అరెస్టైన మహిళల్లో ఒకరు తనపై పోలీసులు లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఇచ్చిన ఫిర్యాదుతో పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ సహా ఆరుగురిపై చిత్తూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు, చిత్తూరు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలకు పాల్పడిన ముఠాలోని వ్యక్తులు తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లె తాలూకాలోని పులియాంబట్టి గ్రామానికి చెందిన వారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలసి గత వారం క్రిష్ణగిరి వెళ్లారు. అక్కడ అయ్యప్ప, అతని భార్య పూమతి, మరికొందరిని అదుపులోకి తీసుకుని పూతలపట్టు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయ్యప్ప, అతని భార్య పూమతి గతంలో నేరాలు చేసినట్టు నిర్ధారణ కావడంతో వారిద్దరినీ ఎస్ఐ రిమాండ్‌కు పంపారు. మిగిలిన నిందితులకు 41 (ఏ) నోటీసులు జారీచేసి, వారి న్యాయవాది సమక్షంలో స్టేషన్ బెయిల్ ఇచ్చి వారిని క్రిష్ణగిరికి పంపేశారు.

ఓ మహిళ ఫిర్యాదుతో..

అయితే.. రెండు రోజుల క్రితం క్రిష్ణగిరి వెళ్లిన వారిలో నలుగురు మహిళలు అక్కడి ప్రభుత్వాస్పత్రిలో చేరారు. వారిలో ఓ మహిళ తనపై పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలం, మరో నలుగురు చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ) వద్ద ఓ గదిలో బంధించి హింసించడంతో పాటు తనపై లైంగిక దాడికి పాల్పడి, శరీరంపై కారం పొడి చల్లారని, అందువల్లే తాను ఆస్పత్రిలో చేరానని వైద్యులకు తెలిపింది. అదే విషయాన్ని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫోన్‌లో ఆ మహిళ ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ నగరి మహిళా సీఐ వాసంతిని క్రిష్ణగిరికి పంపించి.. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. దాని ఆధారంగా ఎస్ఐ హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలం, మరో నలుగురిపై చిత్తూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్ఐ, సీఐలపై బదిలీ వేటు

ఎస్సై హరిప్రసాద్, సీఐ ఆశీర్వాదంపై బదిలీ వేటు వేస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత మహిళ ఎస్టీ కావడంతో ఈ కేసులో వాస్తవాలను లోతుగా విచారించి, నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ చిత్తూరు ఏఎస్పీ సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'చోరీ ఘటనకు సంబంధించి ఆరుగురిపై పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చే సమయంలో వాళ్ల న్యాయవాది కూడా అక్కడే ఉన్నారు. తమను ఎవరూ కొట్టలేదని స్టేట్‌మెంట్ కూడా తీసుకున్నట్టు ఎస్ఐ చెబుతున్నారు. అయినా.. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ, ఇతర సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేశాం. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నాం' అని చెప్పారు.

జీ-20లో ఆకట్టుకున్న 'ఏపీ ఫౌండేషనల్ స్కూల్'

- కేంద్ర ప్రభుత్వ అధికారిక ట్విట్టర్‌లో ఏపీ వీడియో
- ఏపీ విద్యాభివృద్ధి కార్యక్రమాలపై విదేశీ ప్రతినిధుల ఆసక్తి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా అమలు చేస్తున్న 'ఏపీ ఫౌండేషనల్ స్కూల్' స్టాల్ జీ-20 సదస్సులో ఆకర్షణగా నిలిచింది. కేంద్రంతోపాటు, విదేశీ ప్రతినిధులను సైతం ఆకట్టుకుంది. జీ-20 సదస్సుల్లో భాగంగా పూణెలో 'జన్ భాగీదారి' కార్యక్రమం జరుగుతోంది. ఇందులో ఏపీ పాఠశాల విద్యాశాఖ 'ఫౌండేషనల్ స్కూల్' నమూనాను ఏర్పాటు చేసింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఫౌండేషనల్ లెర్నింగ్, డిజిటల్ ఎడ్యుకేషన్ ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరిట ఏపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించామని, వివిధ రాష్ట్రాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, సమగ్ర శిక్షా ఎస్పీడీలు ఏపీ స్టాల్‌ను సందర్శించి ప్రశంసించారని తెలిపారు. 'నిపుణ్ ఆంధ్ర గీతం' వీడియో ప్రదర్శనకు అన్ని రాష్ట్రాల ఉన్నతాధికారులు కితాబిచ్చారన్నారు. 7వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీల ఏర్పాటు, బైజూస్, ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన ఈ-కంటెంట్ గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. 'పునాది విద్య సాధన కోసం డిజిటల్, తరగతి గది మాధ్యమం' అంశంపై చర్చించామన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు 29 దేశాలకు చెందిన విద్యాశాఖ మంత్రులు, విద్యా నిపుణులు ఏపీలో అమలు చేస్తున్న విద్యావిధానాలపై హర్షం వ్యక్తం చేశారన్నారు. అంతేకాకుండా మన పాఠశాలలను సందర్శించేందుకు ఆసక్తి చూపినట్టు చెప్పారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలపై రూపొందించిన వీడియోను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఏపీని ప్రశంసిస్తూ పోస్ట్ చేసిందన్నారు. జీ-20లో రాష్ట్రం తరఫున పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్‌తో పాటు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు నేతృత్వం వహించారు.



కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఏపీని ప్రశంసిస్తూ చేసిన పోస్టు

శరవేగంగా డబుల్‌లైన్



ఆకివీడులోని ఎన్‌హెచ్ 165 రహదారి

నాలుగు జిల్లాల్ని అనుసంధానించే ఎన్‌హెచ్-165కు మోక్షం

రెండు ప్రాజెక్టులుగా నిర్మాణ పనులు 107 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ

ఆకివీడు: నాలుగు జిల్లాల్ని అనుసంధానం చేసే ఎన్‌హెచ్ 165 డెల్టా ప్రాంతానికి కీలకంగా మారింది. పామర్రు-(పీపీ) రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారుల శాఖ రెండు దశాబ్దాల క్రితం విలీనం చేసుకుంది. అయితే రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. తొమ్మిదేళ్ల క్రితం ఈ రోడ్డు అభివృద్ధికి అప్పటి కేంద్ర మంత్రి ఆకివీడులో భూమి పూజ చేశారు. పామర్రు నుంచి దిగమర్రు వరకూ 107 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు లైన్లగా విస్తరించేందుకు రూ.1,275 కోట్లు కేటాయించారు. రహదారి విస్తరణ కోసం సరిహద్దు భూముల సేకరణపై కొంత మంది రైతులు, స్థల యజమానులు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

90 కల్వర్టుల నిర్మాణం

పామర్రు నుంచి ఆకివీడు ఉప్పుటేరు వరకూ రహదారి విస్తరణ పనుల్ని వేగవంతం చేశారు. నిర్మాణ పనుల్ని రెండు ప్రాజెక్టులుగా విడదీసి, పామర్రు-ఆకివీడు వరకూ రూ.273 కోట్లతో పనుల్ని ప్రారంభించారు. కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో 90 కల్వర్టులు, 16 వంతెనలు, 2 మేజర్ బ్రిడ్జిల నిర్మాణం వేగంగా జరుగుతుంది. పలు చోట్ల రహదారి విస్తరణ పనుల్ని చేపట్టారు. గుడివాడ, ఆకివీడు వద్ద ఉప్పుటేరుపై మేజర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

ఉప్పుటేరు నుంచి దిగమర్రుపై కోర్టు వివాదం

ఆకివీడు ఉప్పుటేరు నుంచి దిగమర్రు వరకూ రహదారి విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణపై కోర్టు వివాదం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న రహదారికి రెట్టింపు భూమి సేకరించాల్సి ఉంది. కొన్ని చోట్ల మూడు లైన్లకు అనుకూలంగా జాతీయ రహదారి భూమి ఉంది. మరికొన్ని చోట్ల రెండు లైన్ల రోడ్డే ఉంది. దీంతో ఆకివీడు, ఉండి, భీమవరం, వీరవాసరం, లంకలకోడేరు ప్రాంతాల్లో భూసేకరణకు ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు. భూ యజమానులకు, ఎన్‌హెచ్ అధికారుల మధ్య అంగీకారం కుదరకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఎన్‌హెచ్ 165 నాలుగులైన్ల రహదారి విస్తరణ పనులు ఈ ప్రాంతంలో చేపట్టడం ద్వారా రహదారి మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు. దిగమర్రు వరకు రహదారి పనులు పూర్తయితే అక్కడ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు రహదారి అనుసంధానమవుతుందని పేర్కొంటున్నారు. దీని ద్వారా పశ్చిమ, కృష్ణా డెల్టా ప్రాంతాలు అనుసంధానమయ్యే అవకాశం ఉంది.

దిగమర్రు నుంచి వేగంగా పనులు

కృష్ణా జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్-165 రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో పామర్రు నుంచి ఆకివీడు ఉప్పుటేరు వంతెన వరకూ రూ.273 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 90 కల్వర్టుల నిర్మాణం, రెండు మేజర్ వంతెనల నిర్మాణం జరుగుతుంది.

–ఎం.సత్యనారాయణరావు, డీఈ, ఎన్‌హెచ్, కృష్ణా జిల్లా

కోర్టు అనుమతి రావాలి

ఎన్‌హెచ్ 165 రహదారికి ఉప్పుటేరు నుంచి దిగమర్రు వరకూ రహదారి విస్తరణ పనులకు కోర్టు అనుమతి ఇవ్వాల్సి ఉంది. పలు చోట్ల రహదారి విస్తరణకు అవసరమయ్యే స్థల సేకరణపై సంబంధిత యజమానులు కోర్టుకు వెళ్లారు. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. నాలుగు జిల్లాల్ని అనుసంధానం చేసే 165 రహదారి వల్ల ప్రజలకు అనేక ఉపయోగాలున్నాయి.

–శ్రీనివాసరావు, డీఈ, ఎన్‌హెచ్, పశ్చిమ జిల్లా, భీమవరం

కార్తీక వీకే... ఎంతోమంది సాహిత్యాభిమానులకు సుపరిచితమైన పేరు.

'క్వీన్ ఆఫ్ ఇండియన్ పబ్లిషింగ్'గా కీర్తి అందుకున్న వెస్ట్ ల్యాండ్ బుక్స్ (అమెజాన్ కంపెనీ) పబ్లిషర్‌గా ఎంతోమంది రచయితలను ప్రపంచానికి పరిచయం చేసింది. పాఠకుల నాడి పట్టుకుంది. మారుమూల పల్లె నుంచి హైటెక్ సిటీ వరకు ఏ చిన్న మెరుపు మెరిసినా ఆ మెరుపును అందుకోగలిగింది.

కారణాలపై స్పష్టత ఇవ్వకపోయినా అమెజాన్ కంపెనీ వెస్ట్‌ల్యాండ్ బుక్స్‌ను మూసి వేసింది.

ఆ తరువాత ఏమైంది?

కార్తీక 2.ఓ



'ప్రతిలిపి'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది కార్తీక. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'ప్రతిలిపి' దేశంలోని పన్నెండు భాషలకు సంబంధించిన సృజనాత్మక రచనలకు, సాహిత్యాభిమానుల మధ్య చర్చలకు వేదిక అయింది.

బెంగళూరు కేంద్రంగా పని చేసే 'ప్రతిలిపి' వెస్ట్‌ల్యాండ్ పబ్లిషింగ్, ఎడిటోరియల్, మార్కెటింగ్, సేల్స్ టీమ్‌ను యథాతథంగా తీసుకొని కొత్త ప్రయాణం మొదలు పెట్టింది.

ఈ కొత్త వెంచర్‌ని 'వెస్ట్ ల్యాండ్ 2.ఓ' అని పిలుస్తున్నారు.

దేశంలోని మోస్ట్ పవర్‌ఫుల్ ఎడిటర్‌లలో ఒకరిగా పేరుగాంచిన కార్తీకకు వెస్ట్‌ల్యాండ్‌లాగే 'ప్రతిలిపి'ని పాపులర్ చేయాల్సిన బాధ్యత ఉంది.

'ప్రతిలిపి పేపర్‌బ్యాక్స్' శీర్షికతో తమ యాప్‌లో పాపులర్ అయిన రచనలను కార్తీక నేతృత్వంలో పుస్తకాలుగా తీసుకురానుంది ప్రతిలిపి.

'గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడు పాపులర్ రచనలను పుస్తకాలుగా ప్రచురించేదాన్ని. ఇప్పుడు యాప్‌లో పాపులర్ అయిన రచనలను పుస్తకంగా ప్రచురించబోతున్నాను' అంటుంది కార్తీక.

'పుస్తకం అంటే కొన్ని పేజీల సముదాయం కాదు. అదొక ప్రపంచం' అని చెప్పే కార్తీకకు 'సంప్రదాయ పబ్లిషర్' అని పేరు ఉంది. అయితే ఇప్పుడు ఈ సంప్రదాయ పబ్లిషర్ ఆడియో బుక్, యాప్, పాడ్‌కాస్ట్... మొదలైన ఫార్మాట్‌లలో సాహిత్యాభిమానులకు చేరువ కావడానికి కొత్తదారిలో ప్రయాణం చేస్తుంది.

'కాలంతోపాటు నడవాలి. కొత్త ఫార్మాట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇది సవాలు మాత్రమే కాదు ఎంతో ఉత్సాహం ఇచ్చే పని కూడా' అంటుంది కార్తీక.

కార్తీకతో కలిసి మరోసారి పనిచేయడానికి రచయితలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఆ ఉత్సాహమే ఆమె బలమని చెప్పాల్సి అవసరం లేదు కదా!



వైవిధ్యమే బలం

ప్రచురణ రంగానికి వైవిధ్యమే ప్రధాన బలం. అందుకే ఎప్పటికప్పుడు పాఠకుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుంటాను. పాఠకులకు ఎలా చేరువ కావాలనేదానిపై రకరకాలుగా ఆలోచిస్తాను. పాఠకులకు చేరువ కావాలనే లక్ష్యం కోసం వక్రమార్గాల్లో పయనించడం నా సిద్ధాంతం కాదు. సమాజానికి హాని చేసే కంటెంట్‌ను దగ్గరికి రానివ్వను. వ్యాపారానికి నైతికత అనేది ముఖ్యం. విలువలకు ప్రాధాన్యత ఇస్తాను. ఎంపికకు సంబంధించిన విషయంలో కూడా 'నాదే రైట్' అనే ధోరణితో కాకుండా ఇతరులతో విస్తృతంగా చర్చిస్తాను. సోకాల్ట్-మెయిన్ స్ట్రీమ్ ఆలోచనలకు పక్కకు జరిగితే ఎంతో అద్భుతమైన ప్రతిభను వెలుగులోకి తీసుకురావచ్చు. నా కెరీర్‌లో సంతోషకరమైన విషయం ఏమిటంటే యువతలో చదివే వారి సంఖ్య పెరగడం. 'కొత్త పాఠకులు ఎలాంటి కంటెంట్‌ను ఇష్టపడుతున్నారు?' అని తెలుసుకోవడం ముఖ్యం. శక్తిమంతమైన, సృజనాత్మకమైన ఆలోచనలు ఎక్కడో ఒక చోట ఉంటాయి. అవి ఎక్కడ ఉన్నాయో కనిపెట్టి వెలుగులోకి తీసుకురావడమే పబ్లిషర్ బలం.

- కార్తీక వీకే

'నీకు తెలియని వ్యాపారంలో పొరపాటున కూడా పెట్టుబడి పెట్టవద్దు'

'పెట్టుబడికి సంబంధించిన రెండు రూల్స్ ఏమిటంటే... ఒకటి నష్టం రాకుండా చూసుకోవడం. రెండోది మొదటి రూల్‌ను మరచిపోకపోవడం' అని పెద్దాయన వారెన్ బఫెట్(ప్రసిద్ధ ఇన్వెస్టర్, అపర కుబేరుడు) చెప్పిన మాటలను ఇష్టపడే బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్ ఇన్వెస్టర్‌గా కూడా 'రాణి'స్తోంది...

● అదర్ సైడ్

ఇన్వెస్టార్

తాజాగా క్రోమ్ ఆసియా హాస్పిటాలిటీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టింది భూమి పెడ్నేకర్. 'మంచి బ్రాండ్‌తో కలిసి ప్రయాణించడం ఆనందంగా ఉంది' అంటుంది భూమి. క్రోమ్ ఆసియా గ్రూప్ 'కయా' పేరుతో గోవాలో బోటిక్ హోటల్‌ను ప్రారంభించింది. భోజనప్రియురాలైన భూమికి ప్రయాణాలు అంటే ఇష్టం. అందుకే ఆ రంగాలకు సంబంధించిన కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంది.

'పెట్టుబడి పెట్టే ముందు లాభాల కంటే ముందు ఆ కంపెనీకి ఉన్న విశ్వసనీయత గురించి ఆలోచిస్తాను' అంటుంది భూమి.

'యష్ రాజ్ ఫిల్మ్స్'లో ఆరు సంవత్సరాలు అసిస్టెంట్ కాస్టింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన భూమి 'దమ్ లగా కే హైసా' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. తొలి సినిమాతో ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ తీసుకుంది. కమర్షియల్‌గా సక్సెస్ అయిన కామెడీ డ్రామా 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ'తో తన కెరీర్ ఊపందుకుంది.

ఫోర్బ్స్ ఇండియా–2018 '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించింది.

మూడు సంవత్సరాల క్రితం 'క్లైమెట్ వారియర్' క్యాంపెయిన్ మొదలుపెట్టి పర్యావరణ సంరక్షణకు సంబంధించిన అంశాలపై పనిచేస్తోంది.

ముంబైలో జన్మించిన భూమికి మొదటి నుంచి కళలు, పర్యావరణం, వ్యాపారం అంటే ఆసక్తి.

సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలపై ఆసక్తి మాట ఎలా ఉన్నా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది ఆమె కలలలో ఒకటి.

అందులో ఒక అడుగు... వివిధ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం. ఎవరో ఇచ్చిన సలహాల ఆధారంగా కాకుండా ఇన్వెస్ట్‌మెంట్‌పై భూమికి మంచి అవగాహన ఉంది.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించి నిర్మాణాత్మక ఆలోచనలు ఉన్నాయి. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్(వెప్) సమావేశంలో మహిళా వ్యాపారవేత్తల గురించి చేసిన ప్రసంగం భూమి పెడ్నేకర్ ఆలోచనలకు అద్దం పడుతుంది.

సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలపై ఆసక్తి మాట ఎలా ఉన్నా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది ఆమె కలలలో ఒకటి. అందులో ఒక అడుగు... వివిధ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం. ఎవరో ఇచ్చిన సలహాల ఆధారంగా కాకుండా ఇన్వెస్ట్‌మెంట్‌పై భూమికి మంచి అవగాహన ఉంది.


● భూమి పెడ్నేకర్

ఇంటిప్స్

1. పొడి తయారు చేసుకుందాం
అరకిలో వెల్లుల్లి రెబ్బలను పొట్టు వొలిచి చిన్నచిన్న ముక్కలుగా తరగాలి. కప్పు బొంబాయి రవ్వను బాణలిలో వేసి, వేడెక్కిన తరువాత రవ్వలో వెల్లుల్లి ముక్కలను వేసి వేయించాలి. రవ్వ, వెల్లుల్లి ముక్కలు గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి మారేంత వరకు వేయించి దించేయాలి. వెల్లుల్లి ముక్కలను రవ్వ నుంచి వేరుచేసి మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. ఈ పొడిని పిండి జల్లెడతో జల్లించుకుని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకుంటే ఆరు నెలలపాటు తాజాగా ఉంటుంది. ఇలా చేసుకుంటె మార్కెట్లో వెల్లుల్లి పొడి కొనే అవసరం ఉండదు. వెల్లుల్లి పేస్టుకు బదులు ఈ పొడిని కావాల్సిన కూరల్లో వేసుకోవచ్చు. ఈ పొడి ఉంటే తరచూ వెల్లుల్లి పొట్టు తీసి దంచే పని ఉండదు.



2. అన్నం మాడిపోతే ఒక ఉల్లిపాయను తీసుకుని నాలుగు ముక్కలుగా తరగాలి. మాడిన అన్నం గిన్నె మధ్యలో నాలుగు ముక్కలను నాలుగు చోట్ల పెట్టి పదిహేను నిమిషాలపాటు మూతపెట్టి ఉంచాలి. పావు గంట తరువాత మూత తీసి ఉల్లిపాయ ముక్కలను తీసేయాలి. ఇలా చేయడం వల్ల మాడు వాసన పోతుంది. అన్నం ఉల్లిపాయ వాసన కూడా రాకుండా చక్కగా ఉంటుంది.



3. ఇంట్లో అల్లం ఎక్కువగా ఉన్నప్పుడు... తొక్కతీసి కొద్దిగా నూనె వేసి పేస్టు చేసుకోవాలి. ఈ పేస్టుని ఐస్ ట్రేలో వేసుకుని ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ అల్లం క్యూబ్స్ ఎప్పుడంటే అప్పుడు సులభంగా వాడుకోవచ్చు.

4. సాల్ట్ డబ్బా అడుగు భాగంలో కొద్దిగా బియ్యం వేసి తరువాత సాల్ట్ పోసుకుంటే సాల్ట్‌లోని తేమను బియ్యం పీల్చుకుని సాల్ట్‌ను పొడిగా ఉంచుతుంది.

5. ప్లాస్టిక్ రోల్ అతుక్కుని త్వరగా రాదు. ఇటువంటప్పుడు అరగంటపాటు రోల్‌ని రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత ఓపెన్ చేస్తే అతుక్కోకుండా సులభంగా వస్తుంది.



6. గాజుకప్పు లేదా గ్లాసులో వేడిపాలు, పాయసం వంటివి పోసే ముందు.. దానిలో ఒక స్టీల్ స్పూను పెట్టి, తరువాత పాలు లేదా పాయసం వేయాలి. ఇలా చేయడం వల్ల గాజు గ్లాసు పగలదు.

7. స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీస్పూను డిష్‌వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లు పోసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం మీద, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే క్రిములు దరిచేరవు.



● 12.5 కోట్ల టన్నులు.. ప్రపంచవ్యాప్తంగా సేద్యంలో వాడుతున్న ప్లాస్టిక్ సామగ్రి	● 60 లక్షల టన్నులు.. ఆసియా దేశాల్లోని పొలాల్లో ప్లాస్టిక్ వినియోగం	● రూ. 1980 కోట్లు.. మన దేశంలో పంటలకు ఏటా కలుపు వల్ల నష్టం	● కిలో ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌తో 700 చ.అ.ల భూమి కలుషితం	● ఖరీదైన ప్రత్యామ్నాయంగా ముందుకొస్తున్న అటానమస్ వీడింగ్ రోబోలు

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 21 వరకు
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

పొలాల్లో ప్లాస్టిక్ భూతం!

పంట పొలాల్లో ప్లాస్టిక్ భూతం తిష్టవేసుక్కూచుంది. వ్యవసాయంలో చాలా పనుల కోసం ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం గత 70 ఏళ్లుగా అనేక రెట్లు పెరిగింది. మల్చింగ్ షీట్లు, ఫామ్‌పాండ్ లైనింగ్, ప్లాస్టిక్ డ్రిప్ లేటరల్స్, పీవీసీ పైపులు, గ్రీన్‌హౌస్‌ల పైకప్పులు, సైలేజీ గడ్డి బేల్స్ కోసం ఫిల్మ్‌ల తదితర పనుల కోసం వ్యవసాయంలో ప్లాస్టిక్ వాడకం అంతకంతకూ పెరుగుతోంది.

వీటిల్లో ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ ముఖ్యమైనది. ఒక పంట కాలంలో చిరిగిపోయే పల్చటి షీట్ ఇది. కలుపును నివారించడం ద్వారా కలుపు తీత శ్రమతో పాటు ఖర్చును లేదా రసాయనిక కలుపు మందుల ముప్పును/ వాటి కొనుగోలు ఖర్చును తగ్గించడం.. మట్టిలో నుంచి నీటి తేమ ఆరిపోకుండా చూడటం ద్వారా నీటిని ఆదా చేయటం ద్వారా దిగుబడి పెరుగుదలకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు ఉపయోగపడుతున్నాయి.

1.25 కోట్ల టన్నుల 'ప్లాస్టిక్ సేద్యం'

2019వ సంవత్సర కాలంలో ప్రపంచవ్యాప్తంగా పంటల సాగు, ఆక్వా సాగు, చేపల వేట దగ్గరి నుంచి ఆయా ఆహారోత్పత్తులను వినియోగదారులకు చేర్చే వరకు ఉన్న దశలన్నిటిలో కలిపి సుమారు కోటి 25 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను వినియోగించినట్లు ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) అంచనా వేసింది.

ప్రపంచవ్యాప్తంగా పంటలు/ఉద్యాన తోటల సాగులో, పశువుల పెంపకంలో ఏడాదికి కోటి టన్నుల ప్లాస్టిక్ వాడుతుండగా.. ఇందులో మల్చింగ్ ఫిల్మ్ వాటా 34 లక్షల టన్నులు. చేపల వేట, ఆక్వా సాగులో 21 లక్షల టన్నులు, అటవీ ఉత్పత్తులకు సంబంధించి మరో 2 లక్షల టన్నుల ప్లాస్టిక్ సామగ్రి వాడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న ప్లాస్టిక్‌లో సింహభాగం అంటే 60 లక్షల టన్నుల(ప్రపంచ వినియోగంలో సగం)ను ఆసియా రైతులే వాడుతున్నారని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది.

ప్లాస్టిక్ అవశేషాలతో ముప్పేమిటి?

పంట భూముల్లో మిగిలిపోయే ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ అవశేషాల వల్ల ఆయా భూములు కాలుష్యం బారిన పడినందున సూక్ష్మజీవరాశి నశించి పంట దిగుబడులు తగ్గిపోతున్నట్లు ఎఫ్.ఎ.ఓ. పేర్కొంది. ఇలా భూమిలో కలిసిన ప్లాస్టిక్ (ముఖ్యంగా మల్చింగ్ ఫిల్మ్ అవశేషాల) ద్వారా వెలువడే మైక్రోప్లాస్టిక్స్ (సూక్ష్మప్లాస్టిక్ కణాలు) ఆహారోత్పత్తులు, నీటి ద్వారా తిరిగి మనుషులకు చేరి వారికి అనారోగ్యం కలిగించడం కూడా జరుగుతోందని ఎఫ్.ఎ.ఓ. ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని ప్లాస్టిక్ కణాలలో ఉండే థాలేట్స్, బిస్ఫినాల్స్ వంటి విషతుల్య పదార్థాలు మనుషుల హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్థం చేసి ఆనారోగ్యాల బారిన పడేస్తాయి.


ఒక వైపు ఆహారోత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్న ఈ ప్లాస్టిక్ మరో ఆహారభద్రతపై, ఆహార నాణ్యత, పౌష్టికాహార శోషణపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. అదేవిధంగా, సాంఘిక, ఆర్థిక పరంగా నష్టాలకు కారణభూతమవుతోంది.


భూమి కలుషితం

పంట పూర్తయిన తర్వాత చీలికలు పేలికలయ్యే మల్చింగ్ ప్లాస్టిక్ షీట్ ముక్కలను ఏరివేయటం పెద్ద సమస్యగా మారింది. ఆసియా పొలాల్లో నుంచి 10 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే సేకరించి, తిరిగి వాడగలుగుతున్నారు. 90% ప్లాస్టిక్ ముక్కలు భూమిలో అలాగే ఉండిపోతున్నాయి. మట్టిలో కలిసే సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు మట్టిలోని సూక్ష్మజీవరాశిని నాశనం చేస్తున్నాయి. దీంతో భూసారం దెబ్బతింటున్నది. ఒక కిలో పల్చటి ప్లాస్టిక్ షీట్ 700 చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యవసాయ భూమిని కలుషితం చేస్తోందని అంచనా.

నిప్పుపెట్టిన ప్లాస్టిక్ నుంచి పాలీక్లోరినేటెడ్ డిబెన్‌జో-పి-డయాక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి విషతుల్య వాయువులు వెలువడుతున్నాయి. అందువల్ల, వ్యవసాయంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని గాడిన పెట్టి, ప్రత్యామ్నాయాలపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందంటూ ఎఫ్.ఎ.ఓ. ఓ నివేదికలో శాస్త్రవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు, పాలకులకు సూచించింది.


● ప్లాస్టిక్ ఫిల్మ్‌ను ఆచ్ఛాదన (మల్చింగ్)గా వేసిన లెట్యూస్ పొలం





ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో ప్లాస్టిక్ ఫిల్మ్స్ వినియోగం (2018)

ప్రత్యామ్నాయాలున్నప్పటికీ..!

రసాయనిక కలుపు మందులు వాడకుండా, కలుపు మొలవకుండా చూసేందుకు వ్యవసాయంలో వాడుతున్న ప్లాస్టిక్ మల్చింగ్ ఫిల్మ్‌కు ప్రత్యామ్నాయాలు అనేకం. పంటల మార్పిడి పాటించడం, పంట పొలంలో ఖాళీ లేకుండా అంతర పంటలు వేయటం(సజీవ ఆచ్ఛాదన) లేదా ఎండుగడ్డి వంటి పంట వ్యర్థాలను మల్చింగ్‌గా వాడటం వంటి మార్గాలున్నాయి.

త్వరగా చివికి భూమిలో కలిసిపోయే పర్యావరణహితమైన (బయోడీగ్రేడబుల్) మల్చింగ్ ఫిల్మ్‌లను సంపన్న దేశాల్లో వాడుతున్నారు. అదే విధంగా, మన కాయిర్ బోర్డు రూపొందిస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేసే 'భూవస్త్రాలు' కూడా పంటల మధ్య ఆచ్ఛాదనకు ఉపయోగపడతాయి. కొద్ది నెలల్లో మట్టిలో కలిసిపోతాయి.

అయితే, వీటితో వచ్చిన చిక్కేమిటంటే.. ప్లాస్టిక్ మల్చింగ్ ఫిల్మ్ కన్నా వీటి ధర 2-3 రెట్లు ఎక్కువగా ఉండటమే. ఈ ప్రతిబంధకాలను అధిగమించేందుకు ముఖ్యంగా ఆసియా దేశాలు పరిశోధనలకు ఊతమివ్వాలి.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలు ఫలించి, ధర అందుబాటులోకి వస్తే బయోడీగ్రేడబుల్ మల్చింగ్ ఫిల్మ్‌లు మన దేశంలోనూ రైతులకు అందుబాటులోకి వస్తాయని ఆశించవచ్చు.

కలుపు తీసే రోబోలొస్తున్నాయ్!

మన దేశంలో పంట పొలాల్లో కలుపు వల్ల రైతులకు ఏటా జరుగుతున్న ఆర్థిక నష్టం రూ. 1980 కోట్లని నాలుగేళ్ల క్రితం నాటి అంచనా. పురుగులు, తెగుళ్ల నష్టాలకన్నా కలుపు నష్టమే ఎక్కువని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి లెక్క తేల్చింది. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా స్వతంత్రంగా పనిచేస్తూ కలుపు మొక్కల్ని మాత్రమే నిర్మూలించే రోబోలు (అటానమస్ రొబోటిక్ వీడ్ కంట్రోల్ సిస్టమ్స్) వస్తున్నాయి. కృత్రిమ మేధ, జీపీఎస్, జిఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో రూపొందిన 'రోబో కూలీలు' ఇవి. వీటిల్లో అనేక రకాలున్నాయి. కలుపు తీసే రోబో తనను తానే నడుపుకుంటూ పంట సాళ్లలో వెళ్తూ సాళ్ల మధ్యన, వరుసల్లో మొక్కలు/చెట్ల మధ్యన ఉండే నిర్దేశించిన కలుపు మొక్కల్ని మాత్రమే గుర్తించి నాశనం చేస్తాయి.

నాశనం చేసే పద్ధతులు అనేకం. గాలి, మంట (ఫ్లేమ్), చలి గాలి, మైక్రోవేవ్స్, లేజర్ కిరణాలు, వాటర్ జెట్‌ను ప్రయోగించటం ద్వారా (పంట మొక్కలకు హాని జరగకుండా) కేవలం కలుపు మొక్కల్ని నిర్మూలించటం ఈ రోబోల ప్రత్యేకత. వీటి ఖరీదెక్కువ. కూలీల సమస్యను అధిగమించే క్రమంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా డ్రోన్ల మాదిరిగా వీటిని మన దేశంలోనూ వినియోగించే అవకాశాలు ఉన్నాయి.


● కలుపు మొక్కల్ని మాత్రమే నిర్మూలించే అటానమస్ రోబో

చిరుధాన్యాలతో భరోసా

వర్షం ఎప్పుడొస్తుందో.. ఎంత కురుస్తుందో.. మధ్యలో ఎన్ని రోజులు మొహం చాటేస్తుందో అంతుపట్టనంతగా వాతావరణం మారిపోయింది. ఈ అనిశ్చిత వాతావరణ పరిస్థితుల్లో నీటి ఎద్దడిని తట్టుకునే భరోసా పంటలైన చిరుధాన్య పంటల వైపు దృష్టి మరల్చడం శ్రేయస్కరమని నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో దేశీయంగా చిరుధాన్యాల వినియోగంతోపాటు ఎగుమతి అవకాశాలు కూడా పెరిగాయి. దీంతో.. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఊద, సామ, అరికెలు, ఒరిగెల, అండుకొర్రలకు కూడా గిరాకీ బాగానే ఉంటుందని చెప్పొచ్చు.



భరోసా పంటలంటే?

నీటి వనరులు అందుబాటులో లేని, సారం పెద్దగా లేని తేలిక నేలలు వరి, పత్తి వంటి 'సి-3' పంటల సాగుకు అనుకూలం కావు. తక్కువ వర్షం తోనే, అంతగా సారం లేని తేలిక, ఎర్ర నేలల్లోనూ ఖచ్చితమైన దిగుబడులనిచ్చేవి చిరుధాన్య పంటలు. వీటిని 'సి-4' పంటలు అంటారు. ఇవే రైతులకు భరోసా ఇచ్చే పంటలు. పౌష్టికాహార భద్రతతోపాటు రైతులకు కనీస ఆదాయ భద్రతను ఇవ్వడంతోపాటు.. వరి గడ్డి కన్నా అధిక పోషక విలువలున్న పశుగ్రాసాన్ని కూడా చిరుధాన్యాలు అందిస్తాయని నిపుణులు చెబుతున్నారు. భూతాపాన్ని పెంచే కర్బన ఉద్గారాలను విడుదల చేయటంలో చిరుధాన్యాలతో పోల్చితే వరి పంట 20 రెట్లు ఎక్కువగా విడుదల చేస్తుందని అంచనా.

అందుకే చిరుధాన్యాలు రైతులకు ధీమా ఇవ్వగలిగిన పంటలంటున్నారు. చెరకు సాగుకు 2,100 ఎం.ఎం, వరికి 1,250 ఎం.ఎం., పత్తికి 600 ఎం.ఎం. నీరు అవసరం. అయితే, జొన్నలకు 400 ఎం,ఎం., సజ్జ, రాగి, కొర్ర తదితర స్మాల్ మిల్లెట్లకు 350 ఎం.ఎం. నీరు సరిపోతుంది. వేరుశనగకు 450 ఎం.ఎం., పప్పుధాన్యాలకు 300 ఎం.ఎం., మొక్కజొన్నకు 500 ఎం.ఎం. నీరు అవసరమవుతుంది. తేలిక భూముల్లో, ఎర్ర నేలల్లో మొక్కజొన్న, పత్తి సాగు చేస్తే.. వర్షాలు సక్రమంగా పడకపోతే ఈ పంటలు రైతులను తీవ్ర నష్టాల పాలు జేయడానికి అవకాశాలెక్కువ.

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే చీడపీడల బెడద కూడా పెద్దగా ఉండదని చెబుతున్నారు.


అరికె మొలిస్తే చాలు..

ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట అరిక. ఇది 160-170 రోజుల పంట. దాదాపు 6 నెలల పంట. అరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూన్ 22 నుంచి జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం. కొర్ర, సామ, ఊద, అండుకొర్ర పంటలు 90-100 రోజుల్లో పూర్తయ్యేవే.

మొలిచిన తర్వాత 40-50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుందని చిరుధాన్యాల సేంద్రియ సాగుదారుడు, రైతు శాస్త్రవేత్త విజయకుమార్ తెలిపారు. 8 సాళ్లు అరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్లు అరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవచ్చని ఆయన వివరించారు. అరికలు ఎకరానికి 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని విజయకుమార్ (98 496 48498) తెలిపారు. ఏపీ రైతులు ఉ. 6-9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6-9 గం. మధ్య సంప్రదించవచ్చు.


● కె.విజయకుమార్
రైతు శాస్త్రవేత్త

ఎద్దు గానుగల నిర్వహణపై 2 రోజుల శిక్షణ



ఆరోగ్యదాయకమైన వంట నూనెలను పట్టణాలు, పల్లెల్లో స్థానికంగానే ఉత్పత్తి చేసుకునే లక్ష్యంతో ఎద్దు గానుగ నిర్వహణపై 'ఆరోగ్యదాయని' సంస్థ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. మహబూబ్‌నగర్ జిల్లా గుండీడ్ మండలం జక్లపల్లి గ్రామంలో ఎద్దు గానుగలను నిర్వహిస్తున్న 'ఆరోగ్యదాయని' సంస్థ ఈ నెల 24,25 తేదీల్లో శిక్షణ ఇవ్వనుంది. నూనె గింజ పంటలను స్థానికంగానే పండించుకొని, ఆ గింజలతో ఎద్దు గానుగ ద్వారా నూనెలను ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందటంతో పాటు ఆరోగ్యదాయకమైన వంట నూనెలను ప్రజలకు అందుబాటులోకి తేవచ్చని ఆరోగ్యదాయని వ్యవస్థాపకుడు, ప్రకృతి వ్యవసాయదారుడు బసవరాజ్ తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ ఉచితం. రెండు రోజుల పాటు బస, భోజన ఏర్పాట్ల కోసం రూ. 800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు.. 93466 94156, 93984 27007.

మహిళల జట్టు సెలక్టర్‌గా శ్యామ షా



భారత సీనియర్ మహిళల జట్టు సెలక్షన్ కమిటీలోకి బీసీసీఐ కొత్త సభ్యురాలిని ఎంపిక చేసింది. మాజీ క్రికెటర్, బెంగాల్‌కు చెందిన శ్యామ షా కొత్త సెలక్టర్‌గా ఎంపికైంది. ఇప్పటి వరకు సెలక్టర్‌గా ఉన్న మిథు ముఖర్జీ పదవీకాలం ముగియడంతో ఆమె స్థానంలో శ్యామకు అవకాశం కల్పించారు. శ్యామ భారత్‌కు 3 టెస్టులు, 5 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించింది. మరో వైపు భారత జూనియర్ సెలక్షన్ కమిటీలోకి కర్ణాటక మాజీ వికెట్ కీపర్ బీఎస్ తిలక్ నాయుడును ఎంపిక చేశారు.

సెమీస్ నేటికి వాయిదా

హాంకాంగ్‌లో జరుగుతున్న ఆసియా కప్ మహిళల ఎమర్జింగ్ టోర్నీని వాన వీడటం లేదు. తాజాగా సోమవారం కూడా భారీ వర్షం దెబ్బ కొట్టింది. టోర్నీలో భాగంగా రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, వానతో ఆట సాధ్యం కాలేదు. భారత్ 'ఎ', శ్రీలంక 'ఎ' మధ్య తొలి సెమీ ఫైనల్... పాకిస్తాన్ 'ఎ', బంగ్లాదేశ్ 'ఎ' మధ్య రెండో సెమీఫైనల్ నేటికి వాయిదా పడ్డాయి. టోర్నీ నిబంధనల ప్రకారం సెమీస్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉంది.



రష్మీ, భవానిలకు కాంస్యాలు

- ఏపీ అమ్మాయిల ఘనత
- తజీందర్ 'ఆసియా' రికార్డు
- జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలు రష్మీ, భవాని యాదవ్ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలతో మెరిశారు. ఒడిశాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో రష్మీ ఈటెను 50.95 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది. నాలుగో ప్రయత్నంలో ఈ మెరుగైన ప్రదర్శన ద్వారా ఆమె కాంస్య పతకం నెగ్గింది. ఇందులో అన్ను రాణి (ఉత్తరప్రదేశ్; 58.22 మీ.)


తజీందర్

స్వర్ణం, ప్రియాంక (హరియాణా; 51.94 మీ.) రజతం గెలుపొందారు. అంతకుముందు జరిగిన లాంగ్‌జంప్ పోటీలో భవాని 6.44 మీటర్ల దూరం దూకి కాంస్యంతో తృప్తిపడింది. అన్సీ సోజన్ (కేరళ; 6.51 మీ.), శైలీసింగ్ (ఉత్తరప్రదేశ్; 6.49 మీ.) వరుసగా పసిడి, రజత పతకాలు సాధించారు. భారత స్టార్ అథ్లెట్, షాట్‌పుటర్ తజీందర్ పాల్ తూర్ తన రికార్డును తానే సవరించి కొత్త 'ఆసియా' రికార్డు నెలకొల్పాడు. అతను గుండును 21.77 మీటర్ల దూరం విసిరాడు. దీంతో 28 ఏళ్ల పంజాబ్ అథ్లెట్ తజీందర్ 2021లో 21.49 మీటర్లతో నెలకొల్పిన రికార్డును అధిగమించాడు. అతను విసిరిన దూరం ఈ సీజన్‌లో ప్రపంచంలోనే తొమ్మిదో మెరుగైన ప్రదర్శనగా నిలిచింది. 21.40 మీటర్ల క్వాలిఫయింగ్ మార్క్‌ను దాటడంతో ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలకూ తజీందర్ పాల్ అర్హత సంపాదించాడు.

సోమవారం ముగిసిన ఈ పోటీల్లో ఏపీ అమ్మాయి యెర్రా జ్యోతి ఉత్తమ మహిళా అథ్లెట్‌గా ఎంపికైంది. తమిళనాడు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

భవానీదేవికి కాంస్యం

ఆసియా ఫెన్సింగ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: భారత ఫెన్సర్ భవానీదేవి ఆసియా ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో చరిత్ర సృష్టించింది. చైనాలోని వూగ్జీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆమె కాంస్యం సాధించడం ద్వారా ఈ పోటీల్లో పతకం గెలిచిన తొలి భారత ఫెన్సర్‌గా ఘనతకెక్కింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో (సబ్రే ఈవెంట్) 29 ఏళ్ల భవాని 14–15తో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జేనబ్ దేబెకొవా చేతిలో తుదికంటా పోరాడి ఓడింది. ఫలితం నిరాశపరిచినా ఆమె శ్రమకు కాంస్య పతకం లభించింది. ఈ టోర్నీలో భారత ఫెన్సర్ సంచలన విజయాలతో సెమీస్‌లోకి దూసుకొచ్చింది. క్వార్టర్ ఫైనల్లో భవాని 15–10తో ప్రపంచ చాంపియన్ ఫెన్సర్ మిసాకి ఎమురు (జపాన్)ను కంగుతినిపించింది. మిసాకి గతేడాది కైరోలో జరిగిన ప్రపంచ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. ఈ మేటి ప్రత్యర్థితో గతంలో తలపడిన ప్రతీసారి ఓటమి పాలైన భవానీ ఈ ఈవెంట్‌లో అద్భుత విజయం సాధించింది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత ఫెన్సర్ కూడా అయిన భవాని ప్రిక్వార్టర్స్‌లోనూ తనకన్నా మెరుగైన మూడో సీడ్ ప్రత్యర్థి ఒజాకి సెరి (జపాన్)ని 15–11తో ఓడించింది.

174 పరుగులు...7 వికెట్లు!

- రసపట్టులో 'యాషెస్' తొలి టెస్టు
- ఆసీస్ లక్ష్యం 281, ప్రస్తుతం 107/3

బర్మింగ్‌హమ్: 'బజ్‌బాల్' పని చేసిందా లేక ప్రత్యర్థి సాంప్రదాయ ఆట ముందు తలవంచిందా...మొదటి రోజు చేసిన డిక్లరేషన్ సాహసం విజయాన్నందించిందా లేక వ్యూహం ఎదురుతన్నిందా! టెస్టు క్రికెట్‌లో వీటన్నింటికి సమాధానం నేడు లభించనుంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య ఉత్కంఠభరితంగా సాగుతూ వచ్చిన 'యాషెస్' సిరీస్ తొలి టెస్టులో చివరి రోజు ఆసక్తికర ఘట్టానికి తెర లేచింది. సోమవారం ఆస్ట్రేలియా ముందు ఇంగ్లండ్ 281 పరుగుల



స్టోక్స్ వికెట్ తీసిన కమిన్స్

ఊరించే విజయలక్ష్యాన్ని ఉంచింది. ఆసీస్ కూడా ఆత్మవిశ్వాసంతో దూకుడుగానే ఛేదనను ప్రారంభించింది. అయితే ఇంగ్లండ్ బౌలర్లు చెలరేగి కంగారూలను కట్టి పడేశారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. వార్నర్ (36), లబుషేన్ (13), స్మిత్ (6) పెవిలియన్ చేరగా...ఉస్మాన్ ఖ్వాజా (34 నాటౌట్), నైట్ వాచ్‌మన్ బోలండ్ (13 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. చివరి రోజు ఆసీస్ మరో 174 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 28/2తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే కాస్త జోరు తగ్గినా... 66.2 ఓవర్లలోనే 4.11 రన్‌రేట్‌తో వేగంగానే ఈ పరుగులు సాధించింది. బ్రూక్ (46), రూట్ (46), స్టోక్స్ (43) జట్టు స్కోరులో కీలక పాత్ర పోషించారు. ఆసీస్ బౌలర్లలో లయన్, కమిన్స్ చెరో 4 వికెట్లు పడగొట్టారు.

విజేత వెర్‌స్టాపెన్

ఎఫ్1 – కెనడియన్ గ్రాండ్‌ప్రి



మాంట్రియల్: ఫార్ములా వన్ సీజన్‌లో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన సీజన్ ఎనిమిదో రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 1 గంటా 33 నిమిషాల 58.348 సెకన్లలో అతను రేసు పూర్తి చేశాడు. వెర్‌స్టాపెన్‌కంటే 9.570 సెకన్లు ఆలస్యంగా ముగించిన ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్) రెండో స్థానంలో నిలవగా, 14.168 సెకన్లు ఆలస్యంగా లక్ష్యం చేరిన లూయిస్ హామిల్టన్ (మెర్సిడెజ్) మూడో స్థానంతో ముగించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో ఆరు రేస్‌లను గెలుచుకోవడం విశేషం. ఓవరాల్‌గా అతనికి ఇది 41వ విజయం. దాంతో అతను అత్యధిక ఫార్ములా వన్ రేస్ విజయాల జాబితాలో ఒకప్పటి దిగ్గజం ఐర్టన్ సెనా (బ్రెజిల్ – 41)ను సమం చేశాడు. టీమ్ రెడ్‌బుల్‌కు ఇది 100వ విజయం కావడం కూడా మరో విశేషం. చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న పెరెజ్ (126 పాయింట్లు) కంటే వెర్‌స్టాపెన్ 69 పాయింట్లు ముందంజలో (195 పాయింట్లు) ఉన్నాడు.

హసరంగ 6/24

యూఏఈపై లంక ఘనవిజయం

బులవాయో: ఐసీసీ వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో లంక 175 పరుగుల భారీ తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ని చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (63 బంతుల్లో 78; 10 ఫోర్లు), సదీరా సమరవిక్రమ (64 బంతుల్లో 73; 9 ఫోర్లు), పతుమ్ నిసాంకా (76 బంతుల్లో 57; 5 ఫోర్లు), దిముత్ కరుణరత్నే (54 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించగా, చరిత్ అసలంక (23 బంతుల్లో 48 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 180 పరుగులకే కుప్పకూలింది. వసీమ్ (39), అరవింద్ (39), నసీర్ (34) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వనిందు హసరంగ (6/24) ఆరు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థిని పడగొట్టాడు.

ఐర్లాండ్‌ను చిత్తు చేసిన ఒమన్...

వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో పెద్ద సంచలనం నమోదైంది. టెస్టు హోదా ఉన్న ఐర్లాండ్‌పై 5 వికెట్లతో విజయం సాధించి ఒమన్ కొత్త చరిత్ర సృష్టించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. జార్జ్ డాక్‌రెల్ (89 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా, హ్యారీ టెక్టర్ (82 బంతుల్లో 52; 5 ఫోర్లు) రాణించాడు. అనంతరం ఒమన్ 48.1 ఓవర్లలో 5 వికెట్లకు 285 పరుగులు చేసింది. కశ్యప్


జీషాన్



హసరంగ

ప్రజాపతి (74 బంతుల్లో 72; 6 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ జీషాన్ మఖ్సూద్ (67 బంతుల్లో 59; 4 ఫోర్లు, 1 సిక్స్), ఆఖిబ్ ఇల్యాస్ (49 బంతుల్లో 52; 8 ఫోర్లు), మొహమ్మద్ నదీమ్ (53 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు) విజయంలో ప్రధాన పాత్ర పోషించారు.

అశ్విని జోడీకి టైటిల్



నాంటెస్ (ఫ్రాన్స్): భారత సీనియర్ షట్లర్ అశ్విని పొన్నప్ప నాంటెస్ అంతర్జాతీయ చాలెంజ్ టోర్నీ మహిళల డబుల్స్‌లో విజేతగా నిలిచింది. అశ్విని–తనీషా క్రాస్టో జంట ఫైనల్లో 21–15, 21–14తో హంగ్ ఎన్ జు–లిన్ యు పే (చైనీస్ తైపీ) జోడీపై అలవోక విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభంలో భారత ద్వయం 0–4తో వెనుకబడింది. తర్వాత అశ్విని–తనీషా ద్వయం వరుసగా పాయింట్లు సాధించి 10–10 వద్ద తొలి గేమ్‌ను సమం చేసి ఆ తర్వాత అదే జోరుతో గేమ్‌ను గెలుచుకుంది. అనంతరం రెండో గేమ్‌లో 3–3 వద్ద ఉండగా... భారత జోడీ వరుసగా 7 పాయింట్లు గెలిచి ఆధిపత్యాన్ని కొనసాగించింది. చివరకు 31 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా–సాయి ప్రతీక్ జంటకు అదృష్టం కలిసిరాలేదు. క్వాలిఫయర్స్‌గా బరిలోకి దిగి ఫైనల్ చేరిన ఈ జంట పరాజయాన్ని ఎదుర్కొంది. ఫైనల్లో తనీషా–సాయిప్రతీక్ జోడీ 21–14, 14–21, 17–21తో మాడ్స్ వెస్టెర్‌గార్డ్–క్రిస్టిన్ బస్చ్ (డెన్మార్క్) జంట చేతిలో ఓడిపోయింది.

భారత ఫుట్‌బాల్ జట్టుకు ఒడిశా సీఎం నజరానా

భువనేశ్వర్: భారత హాకీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తాజాగా భారత ఫుట్‌బాల్ జట్టుకు ప్రోత్సాహక బహుమతి ప్రకటించారు. ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో సునీల్ ఛెత్రి సారథ్యంలోని భారత ఫుట్‌బాల్ జట్టు టైటిల్ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో జట్టు విజయానికి ప్రోత్సాహకంగా ఒడిశా సీఎం రూ. కోటి నగదు నజరానా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడి కళింగ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో భారత్ 2–0తో లెబనాన్‌పై విజయం సాధించింది.

సినిమా

జోడీ రిపీట్?


● రవితేజ, శ్రీలీల

'ధమాకా' చిత్రంతో హిట్ జోడీ అనిపించుకున్న రవితేజ, శ్రీలీల మరోసారి కలిసి నటించనున్నట్లు తెలుస్తోంది. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రవితేజ, శ్రీలీల హీరో హీరోయిన్లుగా నటించిన తొలి చిత్రం 'ధమాకా'. గత ఏడాది డిసెంబరులో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మూవీలో రవితేజ, శ్రీలీల మాస్ ఎనర్జీ ఆడియన్స్‌ను బాగా అలరించింది. అయితే ఇప్పుడు ఈ హిట్ జోడీ రిపీట్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. 'డాన్‌శీను', 'బలుపు', 'క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ నిర్మించనున్నారట. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకు శ్రీలీలను తీసుకోవాలని చిత్ర యూనిట్ భావిస్తోందని సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాదే సెట్స్‌పైకి తీసుకువెళ్లాలని రవితేజ, గోపీచంద్ మలినేని అండ్ కో సన్నాహాలు చేస్తున్నారట. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

పుట్టినరోజు కానుకగా...

అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు బాలీవుడ్ హీరోయిన్ సాక్షీ వైద్య. ఆమె నటిస్తున్న మరో తెలుగు చిత్రం 'గాండీవధారి అర్జున'. వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. కాగా సోమవారం (జూన్ 19) సాక్షీ వైద్య పుట్టినరోజు. ఈ సందర్భంగా 'గాండీవధారి అర్జున' చిత్రం నుంచి వరుణ్, సాక్షిల స్టిల్‌ను రిలీజ్ చేసి, సాక్షికి బర్త్ డే శుభాకాంక్షలు తెలిపింది చిత్రయూనిట్. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ అర్జున పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ సినిమాకు మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... సాయిధరమ్ తేజ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా ఎంపికయ్యారని వార్తలు వస్తున్నాయి.


● సాక్షీవైద్య, వరుణ్ తేజ్

మాయ నాలో జరిగెనే!

'అందరిలోనూ ఒక్కడు కాను... నేను వేరే తీరులే, కలిసే తాను.. వెలిగే మేను.. మాయ నాలో జరిగెనే...' అంటూ మొదలవుతుంది 'కల కంటూ ఉంటే..' అనే పాట. నాగశౌర్య, యుక్తితరేజ జంటగా నటించిన 'రంగ బలి' చిత్రంలోని పాట ఇది. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదల కానుంది. పవన్ సీహెచ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కల కంటూ ఉంటే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను సార్థక్ కల్యాణి, వైష్ ఆలపించారు. సత్య, సప్తగిరి కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు కెమెరా: దివాకర్ మణి.


● నాగశౌర్య, యుక్తితరేజ


● జాన్వీ కపూర్

లండన్‌లో ఇండియన్ ఆఫీసర్

ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ఆఫీసర్‌గా లండన్‌లో చార్జ్ తీసుకున్నారు హీరోయిన్ జాన్వీకపూర్. అయితే ఇది రియల్ లైఫ్‌లో కాదు.. రీల్ లైఫ్‌లో అన్నమాట. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహిస్తున్న 'ఉలజ్' చిత్రంలో జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. గుల్షన్ దేవయ్య, రోషన్ మాథ్యూ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని జంగ్లీ పిక్చర్స్ నిర్మిస్తోంది. దేశభక్తి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు జాన్వీకపూర్. ఈ సినిమా షూటింగ్ తాజాగా లండన్‌లో ప్రారంభమైంది. జాన్వీకపూర్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు చిత్రయూనిట్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు సాగుతుందని టాక్. కాగా జాన్వీకపూర్ నటించిన మరో హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' చిత్రంతో జాన్వీ తెలుగుకి పరిచయమవుతున్న సంగతి తెలిసిందే.

ఓటీటీలో బవాల్.. వరుణ్‌ధావన్, జాన్వీకపూర్ జంటగా నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ లవ్‌స్టోరీ 'బవాల్'. సాజిద్ నదియాద్‌వాలా ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా జూలైలో డైరెక్ట్‌గా అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

ఆ ప్రయత్నంలో విజయం సాధించాం

- వివేక్ కూచిభొట్ల



● రామజోగయ్య, విక్రమ్ రెడ్డి, వివేక్, శశిధర్

''ఆదిపురుష్' చిత్రాన్ని ఆదివారం వరకు ప్రపంచ వ్యాప్తంగా కోటి మంది ప్రేక్షకులు చూశారు. అందుకే ఈ ప్రెస్‌మీట్‌ని రామ కోటి ఉత్సవం అని పిలిచాం. రామ నామాన్ని ప్రతి గడపకు చేర్చాలన్నదే యూనిట్ ఆలోచన. ఆ ప్రయత్నంలో విజయం సాధించడం సంతోషంగా ఉంది'' అని సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల అన్నారు. ప్రభాస్ శ్రీరాముడిగా, కృతీసనన్ సీత పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలుగులో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో 'రామ జయం, రఘు రామ జయం' పేరుతో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ– ''ఆదిపురుష్' చిత్రాన్ని నైజాంలో దాదాపు 500 స్క్రీన్స్‌కి పైగా రిలీజ్ చేశాం. తొలి రోజు నైజాంలో 13.65 కోట్లు, రెండో రోజు దాదాపు 8 కోట్లు వసూళ్లు వచ్చాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి, మాటల రచయిత భీమ్ శ్రీనివాస్ మాట్లాడారు.



నా కల నెరవేరింది

- అవికా గోర్

''నేను హారర్ సినిమాలను భయపడుతూ చూస్తాను. 'రాజు గారి గది 3' హారర్ కామెడీ. కానీ '1920' సినిమా సీరియస్ హారర్ ఫిల్మ్. ఇలాంటి సినిమా చేయడం నాకు ఇదే తొలిసారి.. చాలా కొత్త అనుభూతి ఇది. ఈ సినిమా తర్వాత మరిన్ని హారర్ కథల కోసం దర్శక–నిర్మాతలు నన్ను సంప్రదిస్తారని భావిస్తున్నాను'' అని హీరోయిన్ అవికా గోర్ అన్నారు. ప్రముఖ దర్శక–నిర్మాత మహేష్ భట్ రచన, సమర్పణలో రూపొందిన చిత్రం '1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్'. కృష్ణ భట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అవికా గోర్ లీడ్ రోల్‌లో నటించారు. విక్రమ్ భట్ ప్రొడక్షన్స్‌పై రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్, డా.రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న హిందీ, తెలుగు భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ– ''మహేష్ భట్, విక్రమ్ భట్‌లాంటి లెజెండరీ ఫిల్మ్ మేకర్స్‌తో పని చేయడం నా కల. '1920' చిత్రంతో అది ఇంత త్వరగా నెరవేరడం నా అదృష్టం. ఇది నాపై మరింత బాధ్యత పెంచింది. మహేష్ భట్, విక్రమ్ భట్ గార్లతో మాట్లాడుతునప్పుడు సొంత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది. నాగార్జునగారిలో కూడా ఆ క్వాలిటీ చూశాను. '1920' కథ, కాన్సెప్ట్ కొత్తగా ఉంటాయి. ఇందులో కేవలం హారర్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్ కూడా ఉంది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా షూటింగ్ నాకు కొత్త అనుభవం ఇచ్చింది. కొత్త టెక్నాలజీ (అన్ రియల్ ఇంజిన్ ఎల్‌ఈడీ స్క్రీన్) వాడాం.. దాని కోసం చాలా హార్డ్ వర్క్ చేశాను. నేను నటించిన 'ఇందు'అనే వెబ్ సిరీస్ త్వరలోనే వస్తుంది. ఆది సాయికుమార్‌కి జోడీగా నటించనున్న 'అమరన్' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం అవుతుంది'' అన్నారు.

ఇంపాజిబుల్ లవ్‌స్టోరీ


● షాహిద్ కపూర్

షాహిద్‌కపూర్, కృతీసనన్ జంటగా హిందీలో ఓ రొమాంటిక్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ చిత్రానికి అమిత్ జోషి, ఆరాధన షా కలిసి దర్శకత్వం వహిస్తున్నారు. జియో స్టూడియోస్, దినేష్ విజన్, జ్యోతిదేశ్ పాండే, లక్ష్మణ్ ఉటేకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోందని బాలీవుడ్ సమాచారం. కాగా ఈ సినిమాను తొలుత అక్టోబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ తాజాగా ఈ సినిమాను డిసెంబరు 7న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రయూనిట్ సోమవారం ప్రకటించింది. ఈ సినిమా టైటిల్ ఇంకా ఖరారు కాలేదు కానీ, 'యాన్ ఇంపాజిబుల్ లవ్‌స్టోరీ' అనేది ట్యాగ్‌లైన్.

హద్దులు దాటె చూడు!

'ఎదురుగా ఇంతందంగా కనిపిస్తుంటే నీ చిరునవ్వూ.. ఎదసడే హద్దులు దాటి చూడు చూడు చూడు...' అంటూ మొదలవుతుంది 'బేబీ' చిత్రంలోని 'రిబపప్పా రిబపప్పాప..' సాంగ్. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ 'బేబీ'. సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రిబపప్పా రిబపప్పాప..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ సోమవారం విడుదల చేసింది. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటను సాయి కృష్ణ పాడారు. ఈ సినిమాకు సహ నిర్మాత: ధీరజ్ మొగిలినేని.


● ఆనంద్, వైష్ణవి, విరాజ్

పల్లెటూరి ప్రేమకథ

చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రాన్ని జూలై 21న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా యష్ రంగినేని మాట్లాడుతూ– ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమ కథా చిత్రమిది. చెందు ముద్దు ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా రూపొందించారు. 80 దశకం నేపథ్యంతో పీరియాడిక్ సినిమాగా సాగుతుంది. మా సంస్థకు మంచి పేరు తెచ్చే చిత్రమవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. మిహిరా, ఉత్తర, వైవా రాఘవ, లలిత్ ఆదిత్య ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ప్రిన్స్ హెన్రీ, కెమెరా: పంకజ్ తొట్టాడ.


● లావణ్య, చైతన్య

సాక్షి బిజినెస్
మంగళవారం
20-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	216	63,168
నిఫ్టీ ▼	71	18,755

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,369	▼	93
డోజోన్స్	34,299	▼	109
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▼	58
డాక్స్	16,201	▼	156
షాంఘై	3,256	▼	18
నికాయ్	33,370	▼	336

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,227
బంగారం (99.5 స్వచ్ఛత)	58,990
వెండి (కేజీ)	72,359

ఇండిగో రికార్డ్ ఆర్డర్



- ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలు
- 2030–35 మధ్య డెలివరీ

ముంబై: దేశీ విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే దిశగా పెద్ద ఎత్తున విమానాలను కొనుగోలు చేస్తున్నాయి. చౌక చార్జీల విమానయాన సంస్థ ఇండిగో తాజాగా మరో 500 ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం ఫ్రెంచ్ విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్‌కు భారీ ఆర్డరు ఇచ్చింది. ఎయిర్‌బస్‌కు ఏ ఎయిర్‌లైన్ నుంచైనా ఇంత స్థాయి ఆర్డరు లభించడం ఇదే ప్రథమం. ప్యారిస్ ఎయిర్ షో 2023 సందర్భంగా విమానాల కొనుగోలు ఒప్పందంపై ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. ఈ డీల్ విలువ ఎంత అనేది వెల్లడి కాలేదు. 2030–35 మధ్య కాలంలో డెలివరీలు ఉంటాయని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. వీటిలో ఏ320నియో, ఏ321నియో, ఏ321ఎక్స్‌ఎల్‌ఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉంటాయని వివరించింది.

ఇండిగో గతంలోనే 480 విమానాల కోసం ఆర్డరు ఇచ్చింది. వాటి డెలివరీలను ఇంకా అందుకోవాల్సి ఉంది. తాజా ఒప్పందంతో ఇండిగో మొత్తం దాదాపు 1,000 ఎయిర్‌క్రాఫ్ట్‌లను కొనుగోలు చేసినట్లవుతుంది. వచ్చే దశాబ్దకాలంలో ఇండిగో వీటిని అందుకోనుంది. దేశీ రూట్లలోనూ, అంతర్జాతీయంగాను భారత్‌లో విమాన సేవల నెట్‌వర్క్ మరింతగా విస్తరించి, ఎయిర్ కనెక్టివిటీ మెరుగుపడేందుకు తమ వంతు తోడ్పాటు అందించగలమని ఆశిస్తున్నట్లు ఎయిర్‌బస్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ క్రిస్టియన్ షెరర్ తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధికి, దేశీయంగా ప్రయాణాలకు ఊతమివ్వాలన్న తమ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు ఈ విమానాల కొనుగోలు సహాయకరంగా ఉండగలదని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. కొన్నాళ్ల క్రితమే టాటా గ్రూప్ దిగ్గజం ఎయిరిండియా కూడా 470 విమానాల కోసం ఎయిర్‌బస్, బోయింగ్‌లకు ఆర్డరు ఇవ్వడం తెలిసిందే.

> **దేశీ ఏవియేషన్‌లో చరిత్రాత్మకం..**
>
> భారతీయ ఏవియేషన్ రంగంలో ఇదొక చరిత్రాత్మక ఘట్టం. భారతదేశం, ఇండిగో ఉజ్వల భవిష్యత్తు గురించి ఇది చాటి చెబుతుంది. ప్రస్తుతం అంతర్జాతీయ విమానయాన రంగంలో భారత్ కీలకంగా మారింది.
>
> – ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్

ఇప్పటివరకు 1,300 పైచిలుకు ఎయిర్‌క్రాఫ్ట్‌..

కొత్త కొనుగోళ్లతో ఇండిగో 2006లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి ఎయిర్‌బస్‌కు ఇప్పటిదాకా మొత్తం 1,330 విమానాలను ఆర్డరు ఇచ్చినట్లయింది. ప్రస్తుతం ఇండిగో 300 పైచిలుకు విమానాలను నడుపుతోంది.

తాజా ఆర్డరుతో భారతీయ విమానయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా గత అయిదు నెలల్లో మొత్తం 970 విమానాలను కొనుగోలు చేసినట్లవుతుంది. కొత్తగా ఆకాశ ఎయిర్ కూడా ఈ ఏడాది ఆఖరు నాటికి మూడంకెల స్థాయిలో ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డరు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది ఆగస్టులో కార్యకలాపాలు ప్రారంభించిన ఆకాశ ఎయిర్‌కి ప్రస్తుతం 19 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉండగా, జులైలో 20వ విమానం డెలివరీ కానుంది.

5 నెలల్లో 1,000 విమానాలు..

ప్రస్తుతం దేశీయంగా 700 పైచిలుకు కమర్షియల్ విమానాలు నడుస్తున్నాయి. వచ్చే ఏడాది, రెండేళ్లలో భారతీయ విమానయాన సంస్థలు 1,500 నుంచి 1,700 పైచిలుకు ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డరు ఇచ్చే అవకాశం ఉందని ఏవియేషన్ కన్సల్టెన్సీ సంస్థ సీఏపీఏ ఫిబ్రవరిలో అంచనా వేసింది. దానికి అనుగుణంగా వచ్చే కొన్నేళ్లలో భారతీయ ఎయిర్‌లైన్స్ 1,100 పైచిలుకు విమానాల డెలివరీలను అందుకోనున్నాయి. ఇండిగో 500, గో ఫస్ట్ 72, ఆకాశ ఎయిర్ 56, విస్తార 17 ఎయిర్‌క్రాఫ్ట్‌ల డెలివరీలు పొందాల్సి ఉంది. అయితే, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్.. మే నెల నుంచి ఫ్లయిట్ సేవలు నిలిపివేసింది.

ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిల నుంచి వెనక్కి

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- సెన్సెక్స్ నష్టం 216 పాయింట్లు
- 18,800 దిగువకు నిఫ్టీ




ముంబై: రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 216 పాయింట్లు పతనమై 63,168 వద్ద, నిఫ్టీ 71 పాయింట్లను కోల్పోయి 18,755 వద్ద ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్ల క్షీణత కూడా సూచీల లాభాల్ని హరించివేశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బేరిష్ ట్రెండ్ సైతం సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. ఫలితంగా సూచీలు కొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను అందుకోవడంలో విఫలమయ్యాయి. నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఐటీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఉదయం సెన్సెక్స్ 89 పాయింట్లు స్వల్ప లాభంతో 63,474 వద్ద, నిఫ్టీ 46 పాయింట్లు పెరిగి 18,873 వద్ద మొదలయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న బలహీన సంకేతాలతో సూచీలు ఆరంభంలోనే నష్టాల్లోకి మళ్లాయి. మిడ్‌సెషన్ నుంచి ఇన్వెస్టర్లు ప్రైవేట్ రంగ బ్యాంక్స్, ఆటో, టెలికాం, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో నష్టాలు మరింత పెరిగాయి. రోజంతా సెన్సెక్స్ 526 పాయింట్ల పరిధిలో, నిఫ్టీ 162 పాయింట్ల శ్రేణిలో ట్రేడయ్యాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు చైనా కేంద్ర బ్యాంకు ఎలాంటి ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించకపోవడంతో ఆసియా మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ టెస్టిమోనీ ప్రసంగం(రేపు) నేపథ్యంలో యూరప్, అమెరికా ఫ్యూచర్లు 1 శాతం వరకు పతనమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లలో ర్యాలీ భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు మూడు శాతం పెరిగి రూ.194 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4% ఎగసి రూ.195 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) రూ.లక్షల కోట్లపైన రూ.1,00,169 కోట్లుగా నమోదైంది. తద్వారా మార్కెట్ క్యాప్ రూ.లక్ష కోట్లు దాటిన రెండో ప్రభుత్వరంగ బ్యాంక్‌గా నిలిచింది. కాగా తొలి స్థానంలో ఎస్‌బీఐ (రూ.5 లక్షల కోట్లు) ఉంది.
- గత శుక్రవారం లిస్టింగ్‌లో అదరగొట్టిన ఐకియో లైటింగ్ షేరు ర్యాలీ కొనసాగింది. బీఎస్‌ఈలో 10% పైగా ర్యాలీ చేసి రూ.445.25 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 11% ఎగసి రూ.455 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది.
- భారీ బ్లాక్ డీల్ తర్వాత శ్రీరామ్ ఫైనాన్స్ షేరు ఐదు శాతం లాభపడి రూ.1470 వద్ద స్థిరపడింది. ప్రతి షేరు రూ.1,401 చొప్పున మొత్తం 99.2 లక్షలు ఈక్విటీ షేర్లు(2.65% వాటాకు సమానం) చేతులు మారినట్లు ఎక్స్ఛేంజీ డేటాలో వెల్లడైంది. ఈ డీల్ విలువ రూ.1,390 కోట్లుగా ఉంది.

అదానీ ట్రాన్స్‌మిషన్ నిధుల సమీకరణ

రూ. 8,500 కోట్లకు వాటాదారులు సై



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ ట్రాన్స్‌మిషన్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ. 8,500 కోట్లు సమకూర్చుకోనుంది. ఇందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల నుంచి అనుమతి పొందినట్లు కంపెనీ వెల్లడించింది. సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(ప్లేస్‌మెంట్) ద్వారా పెట్టుబడులు సమీకరించనున్నట్లు పేర్కొంది. 2023 మే 15కల్లా ఈక్విటీ షేర్లు లేదా ఏ ఇతర అర్హతగల సెక్యూరిటీల జారీని చేపట్టనున్నట్లు తెలియజేసింది. గత నెల(మే) 13న నిధుల సమీకరణ ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేయగా.. వాటాదారుల నుంచి తాజాగా గ్రీన్‌సిగ్నల్‌ను పొందినట్లు కంపెనీ వివరించింది.

లూబ్రిజోల్ దేశీ పెట్టుబడులు

- రూ. 1,230 కోట్లకు రెడీ
- గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌తో జత



ముంబై: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ యూఎస్ కంపెనీ లూబ్రిజోల్ కార్పొరేషన్ దేశీయంగా 15 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,230 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులపై తాజా పెట్టుబడులను వెచ్చించనున్నట్లు బెర్క్‌షైర్ హాథవే ప్రమోట్ చేసిన కంపెనీ తెలియజేసింది. ప్రణాళికల్లో భాగంగా గుజరాత్‌లోని విలాయత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద సీపీవీసీ రెజిన్ ప్లాంటును నిర్మించనున్నట్లు పేర్కొంది. డైవర్సిఫైడ్ దిగ్గజం గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యం ద్వారా నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలియజేసింది. దహేజ్ ప్లాంటులో సీపీవీసీ సామర్థ్యాన్ని రెట్టింపునకు పెంచడం ద్వారా 1.4 లక్షల టన్నులకు చేర్చనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా నవీముంబైలో రెండో గ్రీజ్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు తెలియజేసింది.

1928లో..: రవాణా, పారిశ్రామిక, కన్జూమర్ మార్కెట్లకు అవసరమయ్యే స్పెషాలిటీ కెమికల్స్‌ను రూపొందిస్తున్న లూబ్రిజోల్ కార్పొరేషన్ 1928లో ఏర్పాటైంది. ఇంజిన్ ఆయిల్స్, డీజిల్, ఇండస్ట్రియల్ లూబ్రికెంట్స్, రవాణా సంబంధ ఫ్లూయిడ్స్‌కు ఎడిటివ్స్‌ను సైతం తయారు చేస్తోంది. 1966 నుంచీ దేశీయంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం గ్రాసిమ్‌తో భాగస్వామ్యం ద్వారా తొలి దశలో లక్ష టన్నుల సీపీవీసీ రెజిన్ ప్లాంటుకు శంకుస్థాపన చేయనున్నట్లు లూబ్రిజోల్ పేర్కొంది. విలాయత్‌లో గ్రాసిమ్‌కుగల స్థలంలో ప్లాంటును నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. ఉత్తర అమెరికా తదుపరి రెండో ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని సైతం నెలకొల్పనున్నట్లు తెలియజేసింది.

మారుతీ ఇన్విక్టో బుకింగ్స్ షురూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మారుతీ సుజుకీ సరికొత్త యుటిలిటీ వెహికిల్ ఇన్విక్టో బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. వినియోగదార్లు రూ.25,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. జూలై 5న ఈ కారు భారత్‌లో ఎంట్రీ ఇవ్వనుంది. ధర రూ.20 లక్షలకుపైగా ఉండనుంది. ఇన్విక్టో రాకతో మూడు వరుసల్లో లభించే ప్రీమియం వెహికిల్స్ విభాగంలోకి ప్రవేశించినట్టు అవుతుందని మారుతీ సుజుకీ తెలిపింది. స్పోర్ట్ యుటిలిటీ/మల్టీపర్పస్ వెహికిల్ లక్షణాలతో కూడిన



ప్రీమియం మూడు–వరుసల వాహనాన్ని కోరుకునే వినియోగదారులను కంపెనీ లక్ష్యంగా చేసుకుంది. దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో మూడు వరుసలున్న స్పోర్ట్ యుటిలిటీ/మల్టీపర్పస్ వెహికిల్స్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇందులో రూ.20 లక్షలకుపైగా ఖరీదు చేసేవి 1.2–1.25 లక్షల యూనిట్లు ఉంటాయని కంపెనీ తెలిపింది. టయోటా ఇన్నోవా హైక్రాస్ ఎంపీవీ ఆధారంగా ఇన్విక్టో రూపుదిద్దుకుంది.

భారత్‌లో రెట్టింపు రేడియో థెరపీ మెషీన్లు అవసరం

ఎలెక్టా ఇండియా ఎండీ మణికందన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో ఏటా క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. 2020లో కొత్తగా 13.25 లక్షల కొత్త కేసులు రాగా 8.5 లక్షల మంది క్యాన్సర్ సంబంధ సమస్యలతో మరణించారు. ఈ నేపథ్యంలో దేశీయంగా సకాలంలో సరైన చికిత్స అందించేందుకు రేడియో థెరపీ మెషీన్ల సంఖ్య రెట్టింపు స్థాయికి పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎలెక్టా ఇండియా ఎండీ మణికందన్ బాలా సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 650 పైచిలుకు మెషీన్లు ఉండగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం జనాభారీత్యా 1,400 వరకు అవసరమని ఆయన చెప్పారు. నివేదికల ప్రకారం తెలంగాణలో 2025 నాటికి కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 53,000 పైచిలుకు ఉండనుందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు, చికిత్స వ్యయాలను తగ్గించి .. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వాలు, ప్రైవేట్ ఆస్పత్రులతో చర్చలు జరుపుతున్నామని బాలా చెప్పారు. ఎంఆర్–లినాక్ వంటి అధునాతన మెషీన్లను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు సంబంధించి దేశీయంగా తమ మెషీన్లు 500 పైచిలుకు ఉన్నట్లు వివరించారు. ఎలెక్టాకు అమెరికా, బ్రిటన్, చైనా తదితర దేశాల్లో తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మెడికల్ ప్రాక్టీస్‌కు ఎఫ్‌ఎంజీఈ

ఎఫ్‌ఎంజీఈ 2023

ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్.. సంక్షిప్తంగా ఎఫ్‌ఎంజీఈ. ఇది విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసుకున్న అభ్యర్థులు స్వదేశంలో ప్రాక్టీస్ చేయడానికి అవకాశం కల్పించే పరీక్ష. ఇందులో అర్హత సాధిస్తే.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)లో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్).. ఏటా రెండుసార్లు ఎఫ్‌ఎంజీఈ స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఎఫ్‌ఎంజీఈ–2023 జూన్ ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌ఎంజీఈకి అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ తదితర వివరాలు..

అర్హతలు

- ఎఫ్‌ఎంజీఈ స్క్రీనింగ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు భారతీయులు లేదా విదేశాల్లో స్థిరపడిన భారత సంతతికి చెందిన వారై ఉండాలి. వీరు విదేశాల్లో ఎంబీబీఎస్ లేదా తత్సమాన విద్య ఉత్తీర్ణులవ్వాలి.
- ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యూకే, యూఎస్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి.. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సీటు సంపాదించిన వారు లేదా ఆయా దేశాల్లో ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి లభించిన అభ్యర్థులకు ఈ స్క్రీనింగ్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంది. వారు నేరుగా ఎంసీఐ/ఎస్ఎంసీలో సభ్యత్వం కోసం నమోదు చేసుకోవచ్చు.
- పాకిస్తాన్‌లో మెడిసిన్ పూర్తి చేసిన వారు కేంద్ర హోంశాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

- ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో రెండు పార్ట్‌లుగా నిర్వహిస్తారు.
- మొత్తం 300 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి పార్ట్‌లో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలన్నీ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో అడుగుతారు.
- ఒక్కో పార్ట్‌కు రెండున్నర గంటల సమయం కేటాయిస్తారు. రెండు పార్ట్‌లకు కలిపి మొత్తం పరీక్ష సమయం 300 నిమిషాలు. రుణాత్మక మార్కులు లేవు.
- ఈ పరీక్షల్లో అర్హత సాధించాలంటే.. మొత్తం 300 మార్కులకు గాను కనీసం 150 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 20.06.2023
- అడ్మిట్ కార్డ్‌ల జారీ: 25.07.2023
- పరీక్ష తేదీ: 30.07.2023
- వెబ్‌సైట్: https://natboard.edu.in

గ్రామీణ బ్యాంకుల్లో.. ఘనమైన కొలువులు

ఉద్యోగార్థులకు శుభవార్త! బ్యాంకు కొలువుల కోసం ప్రయత్నిస్తున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం!! ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. గ్రామీణ బ్యాంకుల్లో మొత్తం 9,053 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా డిగ్రీతోనే ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1, 2, 3 ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఐబీపీఎస్.. సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

- ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల
- 43 బ్యాంకుల్లో 9,053 పోస్టులకు ఎంపిక ప్రక్రియ
- ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1,2,3 ఉద్యోగాలు



ఎస్‌బీఐ మినహా దేశంలోని అన్ని జాతీయ బ్యాంకుల్లో క్లర్క్స్ నుంచి ఆఫీసర్స్ వరకు.. వివిధ ఉద్యోగాల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టే సంస్థ.. ఐబీపీఎస్. ఇది తాజాగా దేశంలోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

43 బ్యాంకులు.. 9053 పోస్టులు

ఐబీపీఎస్ ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ ద్వారా దాదాపు అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ బ్యాంకుల్లో 9053 పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) 5650; ఆఫీసర్ స్కేల్–1: 2563; ఆఫీసర్ స్కేల్–2 (అగ్రికల్చర్ ఆఫీసర్):118; ఆఫీసర్ స్కేల్–2(మార్కెటింగ్ ఆఫీసర్): 38; ఆఫీసర్ స్కేల్–2(ట్రెజరీ మేనేజర్): 16; ఆఫీసర్ స్కేల్–2(లా): 56; ఆఫీసర్ స్కేల్–2(సీఏ): 63; ఆఫీసర్ స్కేల్–2(ఐటీ): 106; ఆఫీసర్ స్కేల్–2 (జనరల్ బ్యాంకింగ్): 367; ఆఫీసర్ స్కేల్–3: 76 పోస్టులు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 916 ఖాళీలు భర్తీ చేయనున్నారు.

పోస్టులు.. అర్హతలు

- **ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్):** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. స్థానిక భాషతోపాటు కంప్యూటర్‌పై అవగాహన ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్1(అసిస్టెంట్ మేనేజర్):** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. స్థానిక భాషపై అవగాహన తప్పనిసరి. దాంతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్–2(జనరల్ బ్యాంకింగ్):** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ పాసైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఏదైనా బ్యాంకు లేదా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఆఫీసర్‌గా రెండేళ్ల అనుభవం ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్ 2(స్పెషలిస్ట్ ఆఫీసర్): ఐటీ ఆఫీసర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్/కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **చార్టర్డ్ అకౌంటెంట్:** ఐసీఏఐ నుంచి సీఏ ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం తప్పనిసరి.
- **లా ఆఫీసర్:** బ్యాచిలర్ ఆఫ్ లా కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల్లో అడ్వకేట్‌గా రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- **ట్రెజరీ మేనేజర్:** సీఏ లేదా ఎంబీఏ ఫైనాన్స్ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఏడాది పని అనుభవం ఉండాలి.
- **మార్కెటింగ్ ఆఫీసర్:** ఎంబీఏ మార్కెటింగ్ స్పెషలైజేషన్ ఉత్తీర్ణత ఉండాలి. ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- **అగ్రికల్చరల్ ఆఫీసర్:** అగ్రికల్చర్/హార్టికల్చర్/డెయిరీ/యానిమల్ హస్బెండరీ /ఫారెస్ట్రీ/వెటర్నరీ సైన్స్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/పిసీ కల్చర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** ఆఫీసర్ స్కేల్–2 అన్ని పోస్టులకు జూన్ 1, 2023 నాటికి 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్–3:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. అయిదేళ్ల పని అనుభవం కూడా ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. ఎస్సీ/ఎస్టీలు ఐదేళ్లు, ఓబీసీలు మూడేళ్ల వయో సడలింపు పొందొచ్చు.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. వీరు జూన్ 21 నాటికి ఉత్తీర్ణత సాధించాల్సిన ఉంటుంది.

ఎంపిక విధానం

- ఆర్ఆర్‌బీ కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో భాగంగా ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరు విధానాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్–1 పోస్టులకు రెండు దశల రాత పరీక్ష(ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్), ఇంటర్వ్యూ.. ఇలా మొత్తం మూడు దశల్లో నియామక ప్రక్రియ ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్–2, స్కేల్ –3లకు మాత్రం రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్)

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 80 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్ రాసేందుకు అనుమతి లభిస్తుంది.
- ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ కూడా ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలతో 200 మార్కులకు జరుగుతుంది. రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్-1

- ఆఫీసర్ స్కేల్–1 ప్రిలిమినరీ పరీక్ష.. ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు చొప్పున మొత్తం 80 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్స్‌కు అనుమతిస్తారు.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** మెయిన్‌లో రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–50 మార్కులు.. ఇలా వివిధ విభాగాల్లో మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, హిందీ లాంగ్వేజ్‌లకు సంబంధించి ఏదో ఒక లాంగ్వేజ్‌నే ఎంచుకోవాలి. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచే ఆ విభాగం ప్రశ్నలు అడుగుతారు.
- మెయిన్ ఎగ్జామ్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున తుది దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్- 2,3.. ఒకే రాత పరీక్ష

- ఆఫీసర్ స్కేల్–2(జనరలిస్ట్,స్పెషలిస్ట్), ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు ఒకే రాత పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్(జనరల్ బ్యాంకింగ్)పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు– 40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్/హిందీ లాంగ్వేజ్ 40ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40ప్రశ్నలు–50 మార్కులు.. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్–2(స్పెషలిస్ట్ కేటగిరీ) పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–50 మార్కులు..ఇలా వివిధ విభాగాల్లో 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- అన్ని పోస్ట్‌లకు సంబంధించి పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతాయి.
- రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో (ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున) చివరి దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ప్రాక్టీస్‌తోపాటు వేగం

- **రీజనింగ్:** కోడింగ్, డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్, ఇన్–ఈక్వాలిటీస్, ఆల్ఫాబెటికల్ సీక్వెన్సెస్, సిలాజిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్స్, ఇన్‌పుట్ అవుట్‌పుట్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఇందులో రాణించాలంటే.. గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, సెంటెన్స్ కరెక్షన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, యాంటానిమ్స్,సినానిమ్స్‌పై పట్టు సాధించాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** కరెంట్ అఫైర్స్, దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగంలో పరిణామాలు, మానిటరీ పాలసీ, రుణాలు, వడ్డీ రేట్లు, ఫైనాన్స్ రంగ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దాంతోపాటు జాతీయ,అంతర్జాయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు,ముఖ్యమైన ఘటనలు, తేదీలు, వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.
- **క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్:** అర్థమెటిక్ అంశాలు, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- **ప్రొఫెషనల్ నాలెడ్జ్:** ఆఫీసర్ స్కేల్–2 పోస్ట్‌లకు ఉండే ఈ విభాగంలో రాణించాలంటే..అభ్యర్థులు తమ అకడమిక్ అర్హతలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్(కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర అంశాల)పై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 21.06.2023
- **ప్రిలిమ్స్:** ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉంది.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in

క్లుప్తంగా...

నేడు ఏపీ ఈసెట్


డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్, బీఎస్సీ(గణితం) ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈసెట్–23 పరీక్షను మంగళవారం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 103 పరీక్షా కేంద్రాలు, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 38,255 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 28,640 మంది బాలురు, 9,615 మంది బాలికలు ఉన్నారు. ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో అగ్రికల్చరల్, సిరామిక్ టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, కెమికల్, బీఎస్సీ(గణితం) ఈఈఈ విభాగాలకు, మధ్యాహ్నం సెషన్‌లో ఈసీఈ, ఈఐఈ, మెకానికల్ మెటలర్జికల్, మైనింగ్ ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల పరీక్ష నిర్వహిస్తారు. ఈ నెల 23న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, 25 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, జూలై మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ఈసెట్–2023 చైర్మన్, జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు 8500404562 హెల్ప్ లైన్ నంబరు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నెలాఖరులోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ కార్యదర్శులకు సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి సమస్యలను ఈ నెలాఖరులోపు పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆయా శాఖల కార్యదర్శులను సోమవారం ఆదేశించారు. ఈ నెల 23, 27, 30 తేదీల్లో శాఖల వారీగా ఉద్యోగ సంఘాల నాయకులకు అనుకూలమైన రోజు వారితో ప్రభుత్వ కార్యదర్శులు సమావేశమై ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలపై చర్చించి తమ పరిధిలోని అంశాలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. శాఖల వారీగా పరిష్కరించిన అంశాల నివేదికను సర్వీసెస్ శాఖ కార్యదర్శికి పంపాలని సీఎస్ ఆదేశించారు. ఒకవేళ సంబంధిత శాఖ స్థాయిలో పరిష్కారానికి అవకాశం లేని అంశాల నివేదికను కూడా పంపాలని తెలిపారు. ఈ అంశాన్ని సర్వీసెస్ శాఖ కార్యదర్శి ఆయా శాఖలతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. వివిధ శాఖల నుంచి వచ్చిన అంశాలపై అజెండా రూపొందించి జూలై 5వ తేదీన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎస్ వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల కార్యదర్శులు శ్రద్ధ వహించి నెలాఖరులోపు శాఖల వారీగా ఉద్యోగ సంఘాలతో సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

హార్టీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం: ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సులో చేరడానికి నిర్వహించనున్న హార్టీసెట్–2023కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉద్యాన వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డీవీ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అర్హతలు, ఫీజు, అప్లికేషన్ ఫాం, ఇతర వివరాల కోసం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఆగస్టు 22న హార్టీసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సులో సీట్లు కేటాయిస్తారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి మరింత భద్రత

ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

- ఉద్యోగుల హెల్త్ స్కీము కింద ఇప్పటివరకు రూ.1094 కోట్లు వ్యయం
- గత చంద్రబాబు ఐదేళ్ల హయాంలో రూ.748 కోట్లే వ్యయం
- ఉద్యోగులు, వారి కుటుంబాలకు మేలు చేసేలా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్
- ఈ నెల నుంచే అమలు.. ఆమోదం తెలిపిన ఆర్థిక శాఖ
- మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు గత రెండేళ్లలోనే రూ.242 కోట్లు మంజూరు



సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఆరోగ్య భద్రతలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మేలు చేసేలా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను తీర్చిదిద్దారు. నిధులు కూడా ఎక్కువ కేటాయిస్తున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌పై ఖర్చు చేసిన మొత్తంకంటే ఈ నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎక్కువ వెచ్చించింది. చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో ఈహెచ్ఎస్ కింద రూ.748.81 కోట్లు మాత్రమే వ్యయం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ స్కీం కింద రూ.1,094.69 కోట్లు ఖర్చు చేసింది. మరో పక్క ఈహెచ్ఎస్ ఉన్నప్పటికీ ఉద్యోగుల అభ్యర్థన మేరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించింది.

అవాంతరాల్లేకుండా ఈహెచ్ఎస్

ఈహెచ్ఎస్‌కు ఎటువంటి అవాంతరాల్లేకుండా, ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టింది. ఈహెచ్ఎస్‌కు సంబంధించి ఉద్యోగులు, ప్రభుత్వ కంట్రిబ్యూషన్‌ను ఏ నెలకు ఆ నెల ఎంప్లాయీస్ హెల్త్ స్కీము ట్రస్టుకు జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెల నుంచి ఇది అమల్లోకి వస్తోంది. ఇందుకు ఆర్థిక శాఖ ఆమోదం కూడా తెలిపింది. అంటే ఈ నెల ఉద్యోగులు, ప్రభుత్వ వాటా వచ్చే నెలలో నేరుగా ట్రస్టుకు జమ అవుతుంది. తద్వారా ఆస్పత్రులకు ఈహెచ్ఎస్ చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. దీనివల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వైద్యానికి ఎటువంటి అవాంతరాలు ఉండవు. ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద గత రెండేళ్లలో రూ.242 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 28,097 బిల్లులకు రూ.109.84 కోట్లు, 2022–23లో 16,495 బిల్లులకు రూ.132.41 కోట్లు మంజూరు చేసింది.

క్లెయిమ్స్ పరిష్కారంలో జాప్యం ఉండదు: వెంకటరామిరెడ్డి

ఎంప్లాయీస్ హెల్త్ స్కీములో ఉద్యోగులు, ప్రభుత్వ కంట్రిబ్యూషన్లను నెలవారీ ట్రస్టుకు జమ చేయడం వల్ల ఆస్పత్రులకు క్లెయిమ్స్ పరిష్కారంలో ఇకపై జాప్యం ఉండదని, ఇది ఉద్యోగులకు చాలా మేలు చేస్తుందని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామి రెడ్డి తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను పొడిగించడం కూడా ఉద్యోగులకు మేలు చేకూర్చడమేనని చెప్పారు. హెల్త్ స్కీముల్లో ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

విద్యుత్ సేవల విస్తరణ

- కొత్త డివిజన్ల ఏర్పాటు
- అధికారులు, సిబ్బంది కేటాయింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు కొత్త జిల్లాల్లో సర్కిల్, డివిజన్, ఏఈ కార్యాలయాల ఏర్పాటుతోపాటు వాటికి అధికారులను నియమించడంపై దృష్టి సారించాయి. దీని కోసం దూరం (కిలోమీటర్లు), హెచ్‌టీ సర్వీసులు, ఎల్‌టీ సర్వీసులు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వాటి సామర్థ్యం, సబ్‌స్టేషన్ల సంఖ్య, నెలకు వచ్చే సగటు ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విస్తరణ చర్యలు చేపడుతున్నాయి. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) సీఎండీ ఐ.పృథ్వీతేజ్ తాజాగా డిస్కం పరిధిలో కొత్త డివిజన్ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయగా.. ఏపీ సీపీడీసీఎల్, ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఇందుకు సంబంధించి ఆదేశాలిచ్చేందుకు రంగం సిద్ధం చేశాయి.

ప్రస్తుత పోస్టు.. పేరు మార్పి..

రాష్ట్రంలోని మూడు డిస్కంలలో సుమారు 23 వేల మంది శాశ్వత సిబ్బంది పని చేస్తున్నారు. వీరినే పాత, కొత్త డివిజన్లకు సర్దుబాటు చేస్తున్నారు. ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ సీపీడీసీఎల్, ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిల్లో కొత్త జిల్లాలు ఏర్పాటయినప్పటికీ..డిస్కంలు ఇప్పటికీ పాత పద్ధతిలోనే విద్యుత్ పంపిణీ, బిల్లుల జారీ వంటి అన్ని కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రతి జిల్లాలోనూ ఒక ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఉంది. ఇక్కడ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ 13 జిల్లాలకు ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా డిజిగ్నేషన్‌ను మార్చి వారిని ఆపరేషన్ డివిజన్ అధికారులుగా నియమిస్తున్నారు. వీరితోపాటు ఇతర సిబ్బందిని కూడా నియమిస్తున్నారు. దీనివల్ల విద్యుత్ సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయి.

అన్నదాతకు లాభసాటి ధరలు

- మిల్లర్లు, దళారుల ప్రమేయం లేని ధాన్యం సేకరణతో సత్ఫలితాలు
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్

జిల్లాల వారీగా సేకరించిన ధాన్యం, రైతులకు చెల్లింపుల శాతాలు ఇలా

జిల్లా	సేకరించిన ధాన్యం (టన్నుల్లో)	రైతుల సంఖ్య	చెల్లింపులు (శాతం)
పశ్చిమ గోదావరి	6,44,199	72,092	95.15
తూర్పు గోదావరి	2,42,446	26,046	93.83
ఏలూరు	2,16,815	18,951	99.18
అంబేడ్కర్ కోనసీమ	1,42,308	18,340	96.05
కాకినాడ	84,673	11,358	93.59
బాపట్ల	37,943	6,279	87.50
కృష్ణా	18,173	3,048	97.48
ఎన్టీఆర్	19,269	1,733	92.28
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	4,909	333	93.27
ప్రకాశం	3,744	646	99.48
పల్నాడు	243	38	99.00
అనకాపల్లి	160	31	98.00
తిరుపతి	59	6	100
అన్నమయ్య	53	3	100

సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణలో ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సత్ఫలితాలు ఇస్తున్నాయని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతకు మద్దతు ధరే లక్ష్యంగా చేపట్టిన సంస్కరణలు బహిరంగ మార్కెట్‌లో పోటీని పెంచాయన్నారు. ఫలితంగా ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర, అంతకంటే ఎక్కువ ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకు 14.15లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు చెప్పారు. ప్రభుత్వం తొలిసారిగా బొండాలు (జయ రకం) ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వడంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రైతులకు లాభసాటి ధర లభించిందన్నారు. ప్రభుత్వం 5 లక్షల టన్నుల జయ రకం ధాన్యం కొనుగోలును నిర్దేశిస్తే.. కేవలం 80 వేల టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని ఫైన్ వెరైటీలు చెన్నై మార్కెట్‌కు తరలిపోగా.. పశ్చిమ గోదావరి జిల్లాలో జయ రకం ధాన్యాన్ని రైతులు మంచి ధర కోసం నిల్వ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం 1.58 లక్షల మంది రైతుల నుంచి రూ.2,889 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇప్పటికే రూ.2,754 కోట్ల చెల్లింపులు చేశామన్నారు. మంగళవారం నాడు మరో రూ.100 కోట్లను రైతులకు చెల్లించనున్నామన్నారు. మిగిలిన మొత్తాన్ని ఒకట్రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. అకాల వర్షాలకు తడిసిన రబీ ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. రబీలో ఇంకా రైతులు ఎవరైనా ధాన్యం తీసుకొస్తే సేకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సంస్థాగత నిర్మాణంతో పార్టీ మరింత బలోపేతం

- అందరితో సమన్వయం చేసుకోండి
- 15 రోజుల్లోగా అనుబంధ విభాగాల కమిటీల నియామకం పూర్తిచేయండి
- వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: సంస్థాగత నిర్మాణంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని.. అందరిని సమన్వయం చేసుకుని 15 రోజుల్లోగా అనుబంధ విభాగాల కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు.. త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై విజయసాయిరెడ్డి మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో అలసత్వం వహించరాదని సీఎం వైఎస్ జగన్ హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీల నియామకాలను జాప్యం చేయకుండా 15 రోజుల్లోగా పూర్తిచేసి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని కోరారు. అందరినీ సమన్వయం చేసుకుని కమిటీలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పార్టీ పదవుల్లో ఉన్న వారందరికీ ఐడీ కార్డులను జారీచేస్తామన్నారు. ఏ స్థాయి కమిటీలైనా పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ ఆమోదం పొందిన తర్వాతే పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. ఇక గతంలో బీసీ మహాసభ నిర్వహించిన తరహాలోనే ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనారిటీ మహాసభలు నిర్వహిస్తామని విజయసాయిరెడ్డి చెప్పారు. ముస్లిం మైనారిటీ మహాసభ కర్నూలులో జూలై 15న నిర్వహించేందుకు పరిశీలిస్తున్నామని.. దానినీ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం

ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికీ అందించి.. వారిలో చిరునవ్వును చూడటమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ జూన్ 23న శ్రీకారం చుడతారని విజయసాయిరెడ్డి చెప్పారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయంలో మండల స్థాయి అధికారులు ఒకరోజు గడుపుతారని.. క్యాంపు నిర్వహించిన రోజున తమ పరిధిలో ఉన్న సచివాలయాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. మరోవైపు.. విజయసాయిరెడ్డి పార్టీ నేతలు, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించే దిశగా కృషిచేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు.

అనుబంధ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌ల నియామకం

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ జోనల్ ఇన్‌చార్జులను నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.
- ఎస్సీ సెల్ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా జి. ఏడుకొండలు (కాకినాడ) నియమితులయ్యారు.
- క్రిస్టియన్ మైనార్టీ సెల్ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జులుగా జాన్ వెస్లీ (కాకినాడ)..
- పల్నాడు, బాపట్ల ప్రకాశం జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా పి. డేవిడ్ మనోహర్ (బాపట్ల)..
- ఎస్టీ సెల్ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా ఎం రామతులసీ (ఏలూరు) నియమితులయ్యారు.

రైలుపై తెగిపడిన బ్రాకెట్ ఇన్సులేటర్లు

మధిర/ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న శాతవాహన (12714) ఎక్స్‌ప్రెస్ రైలుపై మధిర రైల్వే స్టేషన్ సమీపాన బ్రాకెట్ ఇన్సులేటర్లు తెగిపడ్డాయి. దీంతో పెద్ద శబ్దం రావడమే కాక మంటలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురై హాహాకారాలు చేశారు. మధిర రైల్వేస్టేషన్‌కు పది అడుగుల దూరాన రైలు నిలిచిపోగానే ప్రయాణికులు కిందకు దిగి పరుగులు తీశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సాయంత్రం 4:30 గంటలకు బయలుదేరిన శాతవాహన ఎక్స్‌ప్రెస్.. రాత్రి 9.30 గంటలకు కిలోమీటర్ నంబర్ 528/26 వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ట్రాక్ పక్కన ఉండే స్తంభాల నుంచి రైళ్లు నడిచేలా ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలకు అనుసంధానంగా బ్రాకెట్ ఇన్సులేటర్లు ఉంటాయి. ప్రమాదవశాత్తు ఈ ఇన్సులేటర్లు తెగిపడటంతో బోగీలపై మంటలు వచ్చినట్లు చెబుతున్నారు. విద్యుత్ తీగలు కూడా తెగిపోయినా రైలుకు పక్కన పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్సీ గురుకుల విద్యార్థుల జయకేతనం

మంత్రి మేరుగు నాగార్జున వెల్లడి

సాక్షి, అమరావతి: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్సీ గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని, ఈ ఏడాది 67 మంది విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్ట్, సెంట్రల్ యూనివర్సిటీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరోనా కాలంలో పరీక్షలు రాయకుండానే 9, 10 తరగతులు ఉత్తీర్ణులైన వారే ప్రస్తుత జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉన్న కటాఫ్ మార్కుల ఆధారంగా చూసినప్పుడు ఈ ఏడాది ఐఐటీల్లో 16, ఎన్ఐటీల్లో 39, నిఫ్ట్, ఇతర సెంట్రల్ యూనివర్సిటీల్లో 12 చొప్పున మొత్తం 67 మంది ఎస్సీ గురుకులాల విద్యార్థులకు సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు.

పెరగనున్న పెన్షన్ల భారం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రానున్న తొమ్మిదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో రిటైర్ కానున్నారు. అదే స్థాయిలో పెన్షన్ల వ్యయం కూడా భారీగా పెరగనుంది. వచ్చే తొమ్మిదేళ్లలో 1,33,417 మంది ఉద్యోగులు రిటైర్ కానుండగా పెన్షన్ల రూపంలో ప్రభుత్వం మొత్తం రూ.2,80,141.94 కోట్లు చెల్లించనుంది. రాష్ట్ర ద్రవ్య విధాన పత్రంలో ఆర్థిక శాఖ ఈ వివరాలను పొందుపరిచింది. వచ్చే ఏడాది 13,643 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం పెన్షన్ల వ్యయం రూ.20 వేల కోట్లు ఉండగా వచ్చే ఏడాది రూ.25,520.04 కోట్లకు పెరగనుంది. 2024 నుంచి 2032 వరకు ఏటా 13 వేల నుంచి 16 వేల మంది ఉద్యోగులు రిటైర్ అవుతారని ద్రవ్య విధాన పత్రం వెల్లడించింది. దీంతో 2032 నాటికి పెన్షన్ల వ్యయం రూ.41,803.40 కోట్లకు పెరుగుతుందని తెలిపింది.

పెన్షన్ల వ్యయం పెరగనుంది ఇలా..

సంవత్సరం	రిటైరయ్యే ఉద్యోగులు	పెన్షన్ల వ్యయం రూ.కోట్లలో
2024	13,643	25,520.04
2025	13,583	26,470.61
2026	14,095	27,794.75
2027	14,905	29,320.81
2028	14,734	30,278.81
2029	14,620	31,343.16
2030	16,227	33,358.47
2031	15,548	34,251.89
2032	16,062	41,803.40
మొత్తం	1,33,417	2,80,141.94

స్కూళ్లకు మినిస్టీరియల్ సిబ్బంది

- నాడు–నేడు పూర్తయిన పాఠశాలల్లో త్వరలో కంప్యూటర్ ఆపరేటర్లు
- ఉపాధ్యాయులకు బోధన తప్ప ఇతర విధులు ఉండవు
- విద్యా శాఖ మంత్రి బొత్స వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమర్థమంతమైన బోధన అందించేందుకు నాడు – నేడు పూర్తయిన స్కూళ్లల్లో మినిస్టీరియల్ సిబ్బందిని నియమిస్తామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇకపై ఉపాధ్యాయులకు బోధన తప్ప మరో విధి ఉండదన్నారు. ఇప్పటికే ఆ పాఠశాలలకు నైట్ వాచ్‌మన్లను నియమించామని, రికార్డు పనుల కోసం త్వరలో స్కూళ్లకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఎంఈవో–2 పోస్టుల భర్తీ పూర్తయిన నేపథ్యంలో కొన్ని చోట్ల తలెత్తిన సాంకేతిక సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు సోమవారం మంత్రితో విజయవాడలో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలకు 82,587 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అన్ని అర్హతలు ఉన్న 52,548 మందిని బదిలీ చేశామన్నారు. ఇప్పటికే 98.28 శాతం రిలీవ్ అయ్యారని, ప్రత్యామ్నాయం లేక 1012 మంది రిలీవ్ కాలేదని చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. బదిలీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు రెండు జిల్లాల నుంచి ఫిర్యాదులొచ్చాయని, బలవంతపు బదిలీలు చేసినట్టు ఒకట్రెండు ఫిర్యాదులు కూడా అందాయని చెప్పారు. అలాంటి వారికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపడతామని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయేతర సిబ్బంది, పీఈటీలకు కూడా పదోన్నతులు ఇచ్చి బదిలీ చేస్తామని చెప్పారు.

ఎంఈవో–1 పోస్టుల్లోకి వస్తే సీనియర్లకు పదోన్నతి

విద్యా శాఖలో సమర్థవంతమైన పాలనకు గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులిచ్చి 679 ఎంఈవో–2 పోస్టులను కూడా భర్తీ చేసినట్టు మంత్రి తెలిపారు. 355 ఎంఈవో–1 పోస్టులు కూడా ఖాళీ ఉన్నాయని, సీనియర్ హెచ్ఎంలు ఈ పోస్టుల్లోకి వస్తే సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులకు ఆస్కారం ఉంటుందన్నారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కూడా ఉపాధ్యాయులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు సెలువు పెట్టినప్పుడు ఆ స్థానంలో బోధించేందుకు ప్రతి మండలంలో ముగ్గురు నుంచి ఐదుగురు రిజర్వ్ ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతామన్నారు. దీనివల్ల బోధనలో అంతరాయం ఉండదని తెలిపారు.

విలీన పాఠశాలల్లో మెరుగైన బోధన

విలీనమైన ప్రాథమికోన్నత పాఠశాలల్లో మూడో తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లు బోధిస్తారని, దీనివల్ల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని మంత్రి తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఈ స్కూళ్లల్లో చేర్పించాలని కోరారు. పాఠశాల దూరంగా ఉందనుకొంటే సమీపంలోని మోడల్ స్కూల్ లేదా కేజీబీవీల్లోనైనా చేర్పించాలన్నారు. విద్యార్థులకు చక్కటి వాతావరణంలో బోధన అందించేందుకు ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ స్క్రీన్లు అందిస్తున్నామని, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నాడు–నేడు పూర్తయిన అన్ని స్కూళ్లల్లో డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో డిజిటల్ బోధన వస్తుందని మంత్రి చెప్పారు.

బాబూ.. వయసుకు తగ్గట్టు మాట్లాడు: మంత్రి బొత్స

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వయసుకు తగ్గట్టు మాట్లాడాలని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఒకసారి 'వేరొకరి బిడ్డ' అన్నందుకే వెక్కివెక్కి ఏడ్చిన ఆయన తమను విమర్శించే ముందు గతాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. చంద్రబాబు ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని చెప్పారు. పేదలకు ఇవ్వాల్సిన టిడ్కో ఇళ్లను కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, వాటిని తమ ప్రభుత్వం పూర్తి చేసి ఇస్తోందని అన్నారు. దీనిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన వయసుకు తగ్గట్టుగా లేవన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై బాబు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఎం జగన్ పాలనలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని చెప్పారు. టీడీపీలోనే గూండాలు, రౌడీలు ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అంటూ బాబు కొత్త పలుకులు పలుకుతున్నారని, ఇన్నేళ్ల తర్వాత జ్ఞానోదయమైనట్టుందని అన్నారు. నాలుగేళ్ల క్రితమే సీఎం వైఎస్ జగన్ 50 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి రిజర్వేషన్లు అమలు చేశారని మంత్రి గుర్తు చేశారు. అసలు వైఎస్సార్‌సీపీ అంటేనే బీసీల పార్టీ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాలుడిపై దాడి ఘటన చాలా దురదృష్టకరమన్నారు. మహిళలు, పిల్లలపై దారుణాలకు ఒడిగట్టినవారు ఎవరైనా సరే శిక్ష తప్పదని చెప్పారు.

రెండు నెలల్లో మరో రూ.1.93 లక్షల కోట్ల పెట్టుబడులు

22న సీఎంచే 6 పరిశ్రమలు వర్చువల్‌గా ప్రారంభం

సాక్షి, అమరావతి: విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదిరిన ఒప్పందాలను వేగంగా అమల్లోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జీఐఎస్‌లో రూ.13,12,120 కోట్ల విలువైన 387 ఒప్పందాలు కుదరగా అందులో ఇప్పటికే 14 ప్రాజెక్టులు వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాయి. వచ్చే రెండు నెలల్లో రూ.1,93,150 కోట్ల విలువైన మరో 28 ప్రాజెక్టులు వాస్తవ రూపంలోకి రానున్నాయి. వీటిలో కొన్ని ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరికొన్ని శంకుస్థాపనలు జరగనున్నాయి. వీటి ద్వారా 1,17,937 మందికి ఉపాధి లభించనుంది. వీటిలో వివిధ జిల్లాల్లో రూ. 1775 కోట్ల విలువైన 6 పరిశ్రమలను ఈనెల 22న సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. వీటిద్వారా 1,230 మందికి ఉపాధి లభిస్తుంది. మిగతా ప్రాజెక్టుల శంకుస్థాపనలు/ఉత్పత్తి ప్రారంభానికి వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జీఐఎస్ ఎంవోయూల అమలుపై సీఎస్ జవహర్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన 14 ప్రాజెక్టుల ద్వారా రూ.2,749 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 7,108 మందికి ఉపాధి లభించిందని అధికారులు సీఎస్‌కు వివరించారు. మరో 106 ప్రాజెక్టులు పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయని, వీటి ద్వారా రూ.3,77,476 కోట్ల పెట్టుబడులతో 2,13,513 మందికి ఉపాధి లభించనుందన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400 708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943